
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-8-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 193 పేజీలు: 8+4 వెల: 6.50

నేడు శాంతిభద్రతలపై సిఎం చంద్రబాబు సమీక్ష 3వ

బ్యాంకాక్ బాధితులను స్వస్థలాలకు రప్పించేందుకు చర్యలు: మంత్రి లోకేష్



పార్లమెంటు ఇక రెండు రోజులే..

## కీలక బిల్లులు గట్టెక్కేనా?

డీలిమిటేషన్, ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లులపై ఇంకా ప్రతిష్టంభన

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెడతారని భావిస్తున్న రెండు కీలక బిల్లులపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈరెండు బిల్లులు ఈసమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ఎన్డీయే పక్షం యోచిస్తుంటే ఎట్టిపరిస్థితుల్లోను వీటిని ఆమోదింపచేయకూడదన్న పట్టులో విపక్షాలు ఇండియా కూటమి పార్టీలు మొండపట్టుతో ఉన్నాయి. విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లుతోపాటు డీలిమిటేషన్ బిల్లును ఈసమావేశాల్లోనే ప్రవేశపెట్టాలన్నది ఎన్డీయే పక్షం ఆలోచన. ఇందుకోసం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్‌రిజిజు విపక్ష నేతలతో సంప్రదింపులు జరిపినా విపక్షాలు నీట్ అల్లర్లు, అరెస్టులు, లాఠిఛార్జిలతోపాటు అయోధ్య విరాళాల చోరీపైనే ముందు చర్చ జరపాలని,పార్లమెంటులోమోడీ, అమిత్‌షాలు క్షమా పణ చెపితేనే సజావుగా సాగుతాయన్న హెచ్చరికలుచేస్తుండటంతో ఎన్డీయే పక్షం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఎఫ్‌సిఎన్‌ఆర్‌ఎ బిల్లును పంపించాలనినిర్ణయిస్తోంది. కేవలం రెండే రెండురోజులు ఇక వర్షాకాల సమావేశాలు జరుగుతాయి. ఈ లోపే ఈ రెండు బిల్లులను ఆమోదింపచేసుకోవడం అనేది ఎన్డీయే పక్షానికి కత్తిమీద సాములాంటిదే. ముందురోజు స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షతన జరిగిన బిఎసి సమావేశంలోకూడా ఈ రెండు బిల్లుల ప్రస్తావనకు రాలేదు. దీన్నిబట్టి ఈ సమావేశాల్లో ఉండకపోవచ్చున్న భావన కూడా అధికారపక్షంలోనే నెలకొంది. ఏది ఎలా ఉన్నా ఉభయసభల్లో ఈ రెండు బిల్లులను ఈసమావేశాల్లోనే ఆమోదింప చేసు కోడానికి ఎన్డీయే పక్షం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే కొన్ని విపక్షాలు బిల్లును విత్‌డ్రాచేసుకోవడం లేదా జెపిసికి పంపిం చాలని డిమాండ్‌చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఎఫ్‌సిఆర్‌ఎ చట్టంలోనిసెక్షన్ 15 తొలగించాలని డిఎంకె ఇప్పటికే డిమాండ్‌చేస్తోంది. కాంగ్రెస్, ఎస్పీ వామపక్షాలు కూడాఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి.



స్వాతంత్ర్య దినోత్సవం వేళ

## 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనండి: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ ప్రజలు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ కొత్త వీడియోను విడుదల చేసి ప్రజలను ఉద్దేశించి ఈ విజ్ఞప్తి చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని మోడీ అన్నారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన అమర వీరులకు నివాళులర్పిస్తూ, అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. 'హర్ ఘర్ తిరం'గా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని గౌరవంగా జరుపుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా, మంగళవారం పార్లమెంట్‌లో జరిగిన అధికార ఎన్డీఏ కూటమి వారపు పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోడీ హాజరైన సందర్భంగా ఎన్డీఏ ఎంపీలు, కేంద్రమంత్రులు జాతీయ జెండాలు ఊపుతూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. వందే మాతరం, భారత్ మాతాకీ జై నినా దాలతో హోరెత్తించారు. పార్లమెంట్ లైబ్రరీలోని జీఎంసీ >>2

ఎల్‌నినో సంక్షోభంలోనూ

# 10.7% వృద్ధి

విద్యుత్ వినియోగంలో 13.7, ఖనిజాల్లో 32.8శాతం

గణనీయంగా పెరిగిన దేశీయ, విదేశీ పర్యాటకులు

వివిధ రంగాల్లో పెరుగుదలపై ఆర్థిక నివేదిక సిఎంకు అందజేత

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా నిలకడైన వృద్ధి నమోదు చేస్తోందని జులై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక స్పష్టం చేస్తోంది. గడచిన రెండేళ్లుగా జాతీయ వృద్ధి రేటు కంటే ఎపి వృద్ధిరేటు మెరుగ్గా నమోదు అవుతోంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి వాస్తవ వృద్ధి రేటు 2023-24లో 6.5శాతం నమోదు చేస్తే 2025-26 ఆర్థిక సంవత్సరంలో 9.9శాతానికి పెరిగింది. రాష్ట్రంలోని వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన వృద్ధి నమోదు అవుతున్నట్టు నెలవారీ ఆర్థిక నివేదిక పేర్కొంది. ఈమేరకు సిఎం క్యాంపు కార్యాలయంలో ప్రణాళికా విభాగం అధికారులు 2026 జులై ఆర్థిక నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందించారు. 2026 జూన్‌తో పోలిస్తే పారిశ్రామిక ఉత్పత్తి 8.2శాతం మేర పెరిగిందని నివేదిక పేర్కొంది. ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలానికి సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 89,383 మెట్రిక్ >>2

# లక్ష్యం మరువద్దు!


15శాతం వృద్ధిరేటు సాధించేలా సమగ్ర ప్రణాళికలు

సామాన్యుడిపై ధరల భారం లేకుండా కార్యాచరణ

ఆర్థిక, ప్రణాళికా విభాగం అధికారులకు సిఎం ఆదేశం

జిఎస్‌డిపి, నెలవారీ ఆర్థిక నివేదికపై చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎల్ నినో లాంటి సంక్షోభ సమయంలోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి



మంగళవారం అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు. ఇన్‌సెట్‌లో ఆర్థిక ప్రగతి సూచిక

లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళికా విభాగం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ముందుకు వెళ్లాలని సిఎం సూచించారు. వాణిజ్య పన్నుల శాఖ తరహాలోనే అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ టెక్నాలజీని సమర్థంగా అనుసంధానించి లక్ష్యాలను చేరుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మంగళవారం సిఎం క్యాంపు కార్యాలయంలో ప్రణాళిక విభాగం అధికారులతో సిఎం చంద్రబాబు ఉన్నత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం ఉందని కృష్ణా నదిలో ప్రవాహాలు లేని కారణంగా శ్రీశైలం, నాగార్జున సాగర్ లాంటి ప్రాజెక్టులు ఇంకా పూర్తిగా నిండలేదని.. గోదావరికి వచ్చిన వరద ప్రవాహాలను మళ్లించి కృష్ణా డెల్టాకు నీరిచ్చామని పేర్కొన్నారు. భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నా యని, ఈ నేపథ్యంలో స్థూల ఉత్పత్తి పడిపోకుండా వివిధ శాఖలతో సమన్వయం చేసుకుని కార్యాచరణ >>2

# 'ఆక్వా'కి ప్రభుత్వం భరోసా



మంగళవారం పాలకొల్లులో జరిగిన ఆక్వా రైతు కృతజ్ఞతా సభలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

50వేల మంది పైగా రైతులకు లబ్ధి- ఖజానాపై రూ.1100 కోట్ల భారం

విద్యుత్ సబ్సిడీ యూనిట్‌కు రూ.1.50 పైసలు అమలు, జిఓ విడుదల

**పాలకొల్లు, ఆగస్టు 11 ప్రభాతవార్త:** ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు రూపాయిన్నరకే కరెంటు ఇస్తూ కూటమి ప్రభుత్వం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జిఓ విడుదల చేసింది. ఆక్వా రైతుల ఆనంద పరవశం మధ్య మంగళవారం పాలకొల్లులో బ్రాడీపేట బైపాస్ రోడ్డు రామచంద్ర గార్డెన్ వద్ద నిర్వహించిన రాష్ట్ర ఆక్వా రైతుల కృతజ్ఞత బహిరంగ సభలో విద్యుత్తు, వ్యవసాయ, మత్స్య శాఖ, ఇరిగేషన్ మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, ఆక్వా రంగంతో సంబంధం ఉన్న ఎమ్మెల్యేలు, అనేక మంది ప్రముఖుల మధ్య సబ్సిడీ కరెంట్ జిఓ విడుదల చేశారు. వేలాదిగా తరలివచ్చిన రైతులు హర్షం వ్యక్తం చేశారు. సభకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధ్యక్షత వహించారు. 2019-24 మధ్య జగన్ అరాచక పాలనలో ఆక్వా రంగం కుదేలు అయిపోయిందని మంత్రులు ఆరోపించారు. పాదయాత్రలో రూపాయిన్నరకే కరెంటు ఇస్తానని వైఎస్ జగన్ ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత మడమ తిప్పి మాట మార్చాడని దుయ్యబట్టారు. ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్, 10 ఎకరాల రైతులకే పరిమితం అంటూ ఆక్వా రైతులను విభజించి సబ్సిడీ కరెంటు అందించే రైతులను సగానికి సగం తగ్గించేసాడని >>2

అగ్రిగోల్డ్ ఆస్తుల జప్తునకు

## ప్రభుత్వం అనుమతి

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** అగ్రిగోల్డ్ కేసులో మరిన్ని ఆస్తుల జప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. డిపాజిటర్ల సొమ్ముతో బంధువుల పేరిట ఆస్తులు కొన్నట్లు గుర్తించింది. జయలక్ష్మి పేరిట పోరంకి, పెనమలూరు, ఈదరలో 6.55 ఎకరాల భూమి జప్తునకు హోంశాఖ ఉత్తర్వులిచ్చింది. ఎండీగా ఉన్న అవ్వా హేమసుందర వరప్రసాద్‌కు జయలక్ష్మి అత్తగా గుర్తించింది. ఎన్.మమత పేరుతో కర్ణాటకలో 3.32 ఎకరాలు ఉన్నట్లు గుర్తించగా, 3.32 ఎకరాలు కూడా డిపాజిట్‌దారుల సొమ్ముతోనే కొన్నట్లు ధ్రువీకరించింది. భూమి జప్తునకు చర్యలు తీసుకోవాలని సిఐడి డైరెక్టర్ జనరల్‌కు ప్రభుత్వంఆదేశాలు జారీ చేసింది.

జూ.డాక్టర్ల ఆందోళన

## ఆగిన వైద్యసేవలు

తీవ్ర ఇబ్బంది పడ్డ రోగులు

**విజయవాడ,ఆగస్టు11, ప్రభాతవార్తప్రతినిధి:** తమ సమస్యల పరిష్కారం కోసం ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు ఆందోళన చేపట్టారు. ప్రధానంగా 15 శాతం స్టైఫండ్ పెంపును డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించారు. ఫలితంగా ప్రభుత్వ ఆసుపత్రులు, బోధనాస్పత్రుల్లో ఓపీతోపాటు సాధారణ సేవలు నిలిచిపోయాయి. అత్యవసర సేవలు మాత్రం కొనసాగాయి. నిరసనలో భాగంగా జూడాలు విజయవాడ జీజీహెచ్ సూపర్ స్పెషాల్టీ బ్లాక్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.వైద్యుల ఉద్యోగ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచాలన్న నిర్ణయాన్ని వారు >>2

# ఇక చకచకా

## పోలవరం ప్రాజెక్ట్ ఫేజ్-1బి

పునరావాస కాలనీ నిర్మాణంపై ఫోకస్

డిపిఆర్‌ల తయారీ, నిర్మాణ పనులు వేగవంతం

అధికారులకు ఆదేశాలు, క్షేత్రస్థాయిలో పరిశీలన



మంగళవారం పోలవరం నిర్వాశిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**పోలవరం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** పోలవరం ప్రాజెక్టు ఫేజ్-1బి పునరావాస కాలనీల నిర్మాణంపై అధికారుల దృష్టి సారించారు. ప్రభుత్వం విధించిన గడువు లోపు పనులను పూర్తి చేసి నిర్వశితులను పునరావాస కాలనీలకు తరలించలన్న లక్ష్యంతో అధికారులు అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఏలూరు జిల్లా పోలవరం నిర్వశిసితుల కాలనీల నిర్మాణా ప్రాంతాన్ని పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అభిషేక్, చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్ పరిశీలించి ఆధికారులకు దిశానిర్దేశం చేశారు. డిపిఆర్‌ల తయారీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు జిల్లాలో పోలవరం ప్రాజెక్టు ఫేజ్-1బి పరిధిలోని 41.15 కాంటూర్ లెవెల్‌కు సంబంధించిన చింతూరు డివిజన్ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల కోసం >>2

# నెత్తురోడిన రోడ్లు

జహీరాబాద్ వద్ద ఘోర ప్రమాదం

ఆటోను ఢీకొన్న ఆయిల్ టాంకర్

ఐదుగురు కూలీల మృతి, ఏడుగురికి గాయాలు

మృతులంతా కర్ణాటకకు చెందినవారే..

కోహీర్ ఎక్స్‌రోడ్ వద్ద కార్లు ఢీకొని ఇద్దరు మృతి 2వ



## చంద్రునిపై భారత్ అడ్రస్!

'మూన్ బేస్'లో చేరాలని ఇస్రోకు అమెరికా ఆహ్వానం

చంద్రుని దక్షిణ ధ్రువంలో మనుషుల స్థావరం ఏర్పాటు చేయాలని నాసా ప్రణాళిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయాలన్న అమెరికా ప్రణాళికలో భారత్ భాగస్వామి అయ్యే అవకాశం ఉంది. నాసా ప్రతిపాదించిన మూన్ బేస్ కార్యక్రమంలో చేరాలని ఇస్రోను అమెరికా ఆహ్వానించింది. బెంగళూరులో ఆగస్టు 5, 6 తేదీల్లో జరిగిన భారత్‌అమెరికా సివిల్ స్పేస్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశంలో ఈ ఆహ్వానం అందింది. చంద్రుడి దక్షిణ ధ్రువం సమీపంలో మానవులు నివసించే తొలి శాశ్వత స్థావరాన్ని ఏర్పాటు చేయాలన్నది నాసా ప్రణాళిక. వ్యోమగాములు అక్కడ నివసించడంతో పాటు పరిశోధనలు చేయనున్నారు. ఇందుకోసం మానవ సహిత, మానవ రహిత మిషన్ల ద్వారా అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా ఏర్పాటు చేయనున్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువానికే నాసా ప్రాధాన్యం ఇస్తోంది. అక్కడ శాశ్వతంగా నీడలో ఉండే కొన్ని ప్రాంతాల్లో మంచు రూపంలో నీరు ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆ నీటిని >>2



క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి

## రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదు

హోంమంత్రి వంగలపూడి అనిత

నకిలీ పోలీసులతో ర్యాలీలేంటి?

పోలీసు వ్యవస్థను వైసిపి నేతలు అవమానిస్తున్నారని మండిపాటు

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** నకిలీ పోలీసులతో ర్యాలీలు నిర్వహిస్తూ వైసిపి నాయకులు రాష్ట్ర పోలీసు వ్యవస్థను తీవ్రంగా అవమానిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ పార్టీ నేతలు ఇలాంటి దిగజారుడు >>2



పంద్రాగస్టుకు ముందే

## ఉగ్రదాడులు..

భారీ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు దేశంలో ఉగ్రవాద దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో ఉగ్రవాదులు సరిహద్దుల వద్ద లేదా దేశంలోని ఇతర ప్రాంతాల్లో దాడులకు పాల్పడవచ్చున్న సమాచారంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యం >>2

ప్రగతి బాట



## మారుమూల పల్లెలకు దారులు

మరో 158 ఆవాసాలకు తొలిసారి రహదారి సౌకర్యం

ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.422.10 కోట్ల నిధులు మంజూరు

347 కి.మీ పొడుగున, 146 రోడ్లు, 19 వంతెనల నిర్మాణం

నిర్మాణంలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పంచాయతీరాజ్ అధికారులకు డి.సిఎం పవన్ కల్యాణ్ ఆదేశం

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని చిట్టచివరి గ్రామానికి సైతం అభివృద్ధి ఫలాలు చేరాలన్నదే తమ సంకల్పమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ఆ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయన్నారు. ఇప్పటికే అడవితల్లి బాట పేరిట అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఎన్నో గిరిశిఖర గ్రామాలకు తొలిసారి రహదారి సౌకర్యం కల్పించినట్లు వివరించారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా మైదాన ప్రాంతాల్లో సైతం జనజీవనానికి దూరంగా విసిరేసినట్టు ఉండే మారుమూల పల్లెలు, ఆవాసాలకు, కుగ్రామాలకు రోడ్లను పరిచయం >>2



మంగళవారం సిఎం చంద్రబాబుకు ప్రగతి నివేదిక అందచేస్తున్న అధికారి

# ఎల్‌నినో సంక్షోభంలోనూ 10.7% వృద్ధి

>> టన్నుల ఉత్పత్తితో 304 శాతం మేర పెరుగుదల రికార్డు అయినట్లు నివేదిక పేర్కొంది. ఆటు కూరగాయల ఉత్పత్తిలోనూ 44.8శాతం మేర పెరుగుదల ఉన్నట్లు ప్రణాళికా విభాగం స్పష్టం చేసింది. పశుసంపద్ద రంగాలలో మాంసం ఉత్పత్తి 9.6శాతం, గుడ్ల ఉత్పత్తి 5.1శాతం, సముద్రపు రొయ్యల్లో 17 శాతం వృద్ధిని సాధించాయి. సేవా రంగంలో ఐటి, రవాణా, వాణిజ్య కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. సాధారణ ఎగుమతుల్లో రూ. 16,322 కోట్లతో 10.5 శాతం మేర వృద్ధి నమోదు అయ్యింది. ఎస్‌టిపిఐ ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి, అలాగే వాణిజ్య వాహనాల కొనుగోళ్లు 51.6 శాతం వృద్ధిని కనబరిచింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టెక్నాలజీ ఇంటిగ్రేషనుతో జిఎస్‌టి పన్ను వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. ఖనిజాల్లో 17.9 శాతం, విద్యుత్ వినియోగం 22.2 శాతం మేర పెరిగింది. జులై మాసానికి సంబంధించి పర్యాటకుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. దేశీయంగా 3.10 కోట్ల మంది, 35,951 మంది విదేశీ టూరిస్టులు రాష్ట్రానికి వచ్చారని జులై నెల ఆర్థిక నివేదిక పేర్కొంది.
రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ.2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడులు గ్రౌండింగ్‌తో 75.4 శాతం మేర, రూ.60 వేల కోట్ల మేర ఎంఎస్ఎంఇ రంగ పెట్టుబడులు 73.6శాతం వృద్ధిని నమోదు చేశాయి. పన్ను, పన్నేతర ఆదాయాల్లో గణనీయంగా వృద్ధి నమోదు అయ్యింది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం మేర వృద్ధి నమోదు చేసింది. పారిశ్రామిక రంగం 10.6 శాతం మేర, సేవల రంగం 9.9 శాతం వృద్ధితో ఆర్థిక వ్యవస్థ వెన్నుదన్నుగా నిలిచాయి. ఫలితంగా కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూనే ప్రజా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోంది.

# లక్ష్యం మరువద్దు!

>> చేపట్టాలని సూచించారు. సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించి లోటుపాట్లను సరిచేసుకోవాలన్నారు. ప్రతీ ప్రభుత్వశాఖ అత్యున్నత స్థాయి లక్ష్యాలను చేరుకునేలా వనరుల నిర్వహణ చేపట్టాలన్నారు. నిర్దుష్టమైన ప్రమాణాలను అనుసరించి ఫలితాలు వచ్చేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. రూపొందించే ప్రతీ ప్రణాళికా రాష్ట్ర వృద్ధిరేటును పెంచేలా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలపై ఎలాంటి ధరల భారం పడకుండా చూడాలని సూచించారు. నీటి లభ్యత, ఉత్పత్తులకు విలువ జోడింపు లాంటి అంశాలపై సూచనాత్మక కంటిజెన్సీ ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఎపి 15శాతం వృద్ధిరేటు సాధించేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి కావాల్సి న ఉత్పత్తులపై ప్రభావం లేకుండా చూడాలన్నారు. జిల్లా, నియోజకవర్గం, మండలవారీగా నివేదికలు ఇస్తే లక్ష్యాల సాధన సులువు అవుతుందని సిఎం సూచించారు. ఈ సమీక్షకు ఆర్థిక, ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, జాయింట్ సెక్రటరీ శాంతి ప్రియా పాండే, ప్రణాళికా విభాగం డైరెక్టర్ బి. గోపాల్, ఎపిఎస్‌డిపిఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విఆర్ అలపర్తి తదితరులు పాల్గొన్నారు.

# 'ఆక్వా'కి ప్రభుత్వం భరోసా

>> విమర్శించారు. ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాగేసుకున్నట్లు అయిందని ఎద్దేవా చేశారు. ఫ్రీ ట్రాన్స్‌ఫార్మర్ల విధానం ఎత్తివేసి ప్రైవేట్‌గా కొనుగోలు విధానం ప్రవేశపెట్టి లక్షల రూపాయల భారం ఆక్వా రైతులు మీద మోపాడు అని చెప్పారు. వీటన్నింటి కంటే మించి గొడ్డలి పార్టీ తన ఐదేళ్ల పదవీకాలంలో ఆరుసార్లు కరెంటు చార్జీలు పెంచారు అన్నారు. రైతులకు ఇంత అన్యాయం చేసిన జగన్ ఓదార్పులు, మద్దతులు, పేరిట పరామర్శిల పేరిట ఆక్వా రైతులను కలిసి మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు. ఆక్వా రైతుల అష్ట కష్టాలు ఎన్నికల ముందే కళ్లారా చూసిన కూటమి పార్టీలు ప్రభుత్వం ఏర్పడ్డాక ఆక్వా రైతులను ఆదుకుంటామని, రూపాయిన్నరకే కరెంటు ఇస్తామని, జోన్ల విధానం రద్దు చేస్తామని, 10 ఎకరాలు విస్తీర్ణ పరిమితిని తొలగిస్తామని. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని వక్తలు చెప్పారు. సభాధ్యక్షుడు నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రూపాయిన్నరకు కరెంటు ఇవ్వడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ.1100 కోట్లు భారం పడుతుందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోకపోయినా ఆక్వా రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రధాని మోడీ కలసి ఆక్వా రైతులకు అండగా నిలబడ్డారని చెప్పారు. ఈ జిఒ వల్ల ఎకరాకు 50 వేల పైబడి ఆక్వా రైతులకు ఆదావుతుందని రామానాయుడు చెప్పారు. వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి అచ్చన్నాయుడు మాట్లాడుతూ ఆక్వా ఉత్పత్తుల వ్యయం ఈక్వెడార్ లాంటి ప్రపంచ దేశాలతో పోల్చి చెప్పారు. అక్కడ కిలో ఉత్పత్తికి రూ.190లు అయితే మన దగ్గర 270- 280 వరకు అవుతుందన్నారు. ఈ వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం విడుదల చేసిన జిఒతో కూటమి ప్రభుత్వం ఇంచుమించు అన్ని హామీలు నిలబెట్టుకున్నట్లు అయిందన్నారు. ఆక్వా యూనివర్సిటీకి రూ.27 కోట్లు మంజూరు చేసినట్లు అచ్చెన్నాయుడు చెప్పారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రూపాయిన్నర కరెంటు జిఒ విడుదలకు వెనుకున్న కష్ట నష్టాలు తన ప్రసంగంలో వివరించారు. పెద్దలు ప్రధాని మోడీ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అవిరళ కృషి కారణంగానే మనం ఈరోజు ఆక్వారైతులను ఆదుకోగలుగుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయం, ఆక్వా, తదితర అన్ని రంగాలకు కలిపి విద్యుత్ శాఖ రూ.15 వేల కోట్ల సబ్సిడీ ఇస్తోందని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ఆక్వా యూనివర్సిటీకి భవనం ఏర్పాటు చేసిన విషయాన్ని, కృషి విజ్ఞాన కేంద్రంలో అత్యాధునిక ఆక్వా ల్యాబ్లు ఉన్న సంగతిని గుర్తుచేసి కొద్దిపాటి వ్యయంతో వాటిని ఉపయోగించుకోవచ్చునని చెప్పారు. భాజపా ముఖ్య నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, పులపర్తి అంజిబాబు, బొలిశెట్టి శ్రీనివాస్, ఆరి మిల్లి రాధాకృష్ణ, బొమ్మిడి నాయ కర్, కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, రాష్ట్ర ఆక్వా రైతుల సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, రాజోలు ఎమ్మెల్యే, తదితరులు మాట్లాడారు. వీరితోపాటు మత్స్య శాఖ ఉన్నతాధికారి నాయక్, కలెక్టర్ నాగరాణి కూడా ప్రసంగించారు. జిఒ విడుదల సందర్భంగా ఏర్పాటైన సభలో మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజులను మంత్రి రామానాయుడు సన్మానించారు. రామానాయుడుని వారు కూడా సత్కరించారు. ఆక్వా రైతుల సమస్యలపై మంత్రులకు ఆక్వా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు వినతిపత్రం అందజేశారు.

# రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదు

>> చర్యలకు ఒడిగడుతున్నారని ధ్వజమెత్తారు. అసలు నకిలీ పోలీసుల ముసుగులో ర్యాలీలు చేస్తూ సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించిన ఆమె, ముసుగులు వేసుకుని క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హతే లేదని తేల్చి చెప్పారు. పోలీసు వ్యవస్థ గౌరవాన్ని, విశ్వసనీయతను దెబ్బతీసే ఏ ఒక్క చర్యను కూడా కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని హోంమంత్రి స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వ వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనలో ర్యాలీలో పాల్గొన్న నకిలీ పోలీసులతో పాటు, వారి వెనకుండి నడిపించిన అసలు వైసిపి సూత్రధారులపైనా చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హెచ్చరించారు.ప్రతి ఘటన జరిగినప్పుడు 'రెడ్‌బుక్ రాజ్యాంగ్గం అంటూ విమర్శించడం జగన్‌కు అలవాటైందని హోంమంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్నది రెడ్‌బుక్ రాజ్యాంగం కాదు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగమే. చట్టం ముందు అధికారపక్షమైనా, ప్రతిపక్షమైనా ఒక్కటే' అని స్పష్టం చేశారు. గత రెండేళ్లలో రాజకీయ కక్షతో ప్రతిపక్ష నేతల ఇళ్లు కూల్చడం లేదని, వారి ఇళ్ల ముందు అనవసరంగా పోలీసులను మోహరించడంలేదని, రాజకీయ కారణాలతో వేధింపులకు పాల్పడటం లేదని పేర్కొన్నారు. మా ఫోకస్ రాష్ట్రానికి పెట్టుబడులు. శాంతిభద్రతలను కాపాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రస్థానంలో నిలపాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం' అని హోంమంత్రి స్పష్టం చేశారు. చివరిగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి అనిత మాట్లాడుతూ "గత పాలనను చూశారు... ఈ రెండేళ్ల కూటమి పాలనను చూస్తున్నారు. ఎవరు అభివృద్ధి చేస్తున్నారు? ఎవరు పెట్టుబడులు తెస్తున్నారు? ఎవరు ఉద్యోగాల కోసం శ్రమిస్తున్నారు? అన్నది ప్రజలే ఆలోచించాలని పేర్కొన్నారు.

# మారుమూల పల్లెలకు దారులు

>> చేసేందుకు పవన్ కల్యాణ్ రూపొందించిన ప్రణాళికలు కార్యరూపం దాల్చనున్నాయి. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈ రోడ్ల నిర్మాణం చేపట్టనుంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మరో 158 ఆవాసాలకు తొలిసారిగా రహదారి సౌకర్యం కల్పించబోతున్నట్లు ప్రకటించారు. మరో 158 మారుమూల గ్రామాలకు అనుసంధాన రహదారులు నిర్మించేందుకు పరిపాలన అనుమతుల ప్రక్రియ పూర్తయ్యింది. 347కిలోమీటర్ల పొడవున, 146 రోడ్లు, 19 వంతెనల నిర్మాణం చేపట్టనున్నారు. ఏఎస్ఆర్, పార్వతీపురం మన్యం, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, కడప, తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, పల్నాడు, ఎన్టీఆర్, ఏలూరు, పోలవరం, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో పూర్తి రహదారి సౌకర్యం లేని ఆవాసాలను గుర్తించి, అంచనాలు రూపొందించారు. ఆయా గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ.422.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఐదేళ్లపాటు ఈ రోడ్ల నిర్వహణ నిమిత్తం మరో రూ.24.47 కోట్లు విడుదలయ్యాయి. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సహకారంతో 158 ఆవాసాలకు తొలిసారి రోడ్డు సౌకర్యం కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది.మారుమూల గ్రామాలకు నిర్మించే రోడ్ల నాణ్యత విషయంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలి.మనం వేసే రోడ్డు పది కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడాలి. రహదారి సౌకర్యం లేని గ్రామాలకు మెరుగైన రవాణాసదుపాయం కల్పించే లక్ష్యంతో నిర్మిస్తున్న రోడ్లు, వంతెనల నిర్మాణం తో ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఏర్పడి, ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, మార్కెటింగ్ వంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి" అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# ఆగిన వైద్యసేవలు

>> వ్యతిరేకించారు. ఇలా చేయడం వల్ల యువతకు అవకాశాలు ఉండవన్నారు. అదేవిధంగా జూనియర్ డాక్టర్లపై పని ఒత్తిడి పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించేదాకా తమ ఆందోళన కొనసాగుతుందని జూనియర్ డాక్టర్లు స్పష్టం చేశారు. కడప రిమ్స్ లో జూనియర్ వైద్యులు సమ్మె బాట పట్టారు. అత్యవసర వైద్య సేవలు మినహా విధులు బహిష్కరించి ఆందోళనలో పాల్గొన్నారు. దీంతో సాధారణ వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వం ఏటా స్టైఫండ్ ను 15 శాతం పెంచాలన్నారు. గతంలో చివరిసారిగా 2024లో పెంచారని గుర్తు చేశారు. తెలంగాణ జూనియర్ వైద్యులకు మెరుగైన స్టైఫండ్ ఇస్తున్నారని చెప్పారు. వైద్యుల పదవీ విరమణ వయసును 65 సంవత్సరాలకు పెంచాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. అదేవిధంగా రెసిడెన్స్ డాక్టర్లను మెడికల్ వైద్యులుగా తీసుకోవాలని చెప్పారు.విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యులు విధులు బహిష్కరించారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ సూపరింటెండెంట్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం ఆంధ్ర మెడికల్ కాలేజ్ వరకు ర్యాలీ చేసిన జూడాలు ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా స్టైఫండ్ చెల్లించాలని, వైద్యుల ఉద్యోగ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# చంద్రునిపై భారత్ అడ్రస్!

>> తాగడానికి, ఆక్సిజన్, రాకెట్ ఇంధనంగా మార్చుకునే అవకాశం ఉంది. భవిష్యత్తులో అంగారకుడిపై మానవ యాత్రలకు చంద్రుడిని కీలక కేంద్రంగా ఉపయోగించుకోవాలన్నది నాసా లక్ష్యం. చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2023 ఆగస్టులో చంద్రయాన్3లోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ అక్కడ దిగాయి. ల్యాండింగ్ ప్రాంతానికి శివశక్తి పాయింట్‌గా పేరు పెట్టారు. నాసా ఇప్పుడు అదే ప్రాంతంలో స్థావరం ఏర్పాటుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఇస్రో అనుభవం కీలకంగా మారనుంది. మూన్ బేస్ సహకారం ఆర్టెమిస్ అకార్డ్స్ కింద భారత్‌అమెరికా భాగస్వామ్యానికి కొనసాగిం పుగా ఉండనుంది. శాంతియుత, పారదర్శక, సుస్థిర అంతరిక్ష అన్వేషణకు ఈ ఒప్పందం మార్గదర్శకంగా ఉంటుంది. 2023 జూన్ 21న భారత్ ఆర్టెమిస్ అకార్డ్స్‌పై సంతకం చేసింది. బెంగళూరు సమావేశంలో అంతరిక్ష పరిశోధనల నుంచి లభించే శాస్త్రీయ సమాచారాన్ని పరస్పరం పంచుకోవడంపైనా చర్చలు ముందుకు తీసుకెళ్లాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. భారత్, అమెరికా ఇప్పటికే నిసార్ ఉపగ్రహం ద్వారా భారీ అంతరిక్ష సహకారాన్ని కొనసాగిస్తున్నాయి. భవిష్యత్‌లో శాస్త్రీయ పరిశోధనలు, మానవ అంతరిక్ష ప్రయాణ సాంకేతికతపై కలిసి పనిచేయాలని తాజా సమావేశంలో నిర్ణయించారు. భారత్ గగన్‌యాన్ కార్యక్రమంతో మానవ అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతోంది. అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, భవిష్యత్తులో చంద్రుడిపై మానవ కార్యకలాపాల వంటి లక్ష్యాలను 'స్పేస్ విజన్ 2047'లో భారత్ నిర్దేశించుకుంది. ఈ నేపథ్యంలో నాసా ఆహ్వానం ఇస్రోకు కీలక అవకాశంగా మారనుంది.

# పంద్రాగస్టుకు ముందే ఉగ్రదాడులు

>> లో పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేస్తూ కీలక చర్యలు చేపట్టింది. ఈనెల 15న ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్ వంటి ప్రాంతాల్లో భద్రతా బలగాల దృష్టి వేరు కలపై కేంద్రీకృతమై ఉంటుందని, ఇదే అదనుగా దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ భావిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు తెలిపారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే), బలూచిస్థాన్‌లో నెలకొన్న అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఐఎస్ఐ ఈ కుట్రలకు పాల్పడుతున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లోకి ఉగ్రవాదులను చొరబడేలా చేయడం, బంగ్లాదేశ్ సరిహద్దుల ద్వారా పంపడం వంటి ప్రయత్నాలు జరగవచ్చని హెచ్చరికలు జారీ అయ్యాయి. అంతేకాకుండా, భద్రత తక్కువగా ఉండే టైర్2 నగరాలను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం కూడా ఉంది. కొన్నిసార్లు భద్రతా ఏజెన్సీల దృష్టిని పక్కదారి పట్టించేందుకు ఢిల్లీ లేదా కశ్మీర్‌లో దాడులంటూ తప్పుడు సమాచారం సృష్టించి, మరోచోట దాడికి దిగే వ్యూహం కూడా ఐఎస్ఐ అనుసరించవచ్చని ఓ అధికారి వివరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో పాకిస్థాన్‌తో ఉన్న పశ్చిమ సరిహద్దులో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఆపరేషన్ అలర్ట్‌ను ప్రారంభించింది. ఈనెల 10 నుంచి 17 వరకు కొనసాగే ఈ ఆపరేషన్‌లో భాగంగా బీఎస్ఎఫ్ సీనియర్ అధికారులు పర్యవేక్షిస్తూ, నిఘా మరియు పెట్రోలింగ్‌ను గణనీయంగా పెంచారు. మరోవైపు, బంగ్లాదేశ్ సరిహద్దులో భద్రతను పటిష్టం చేసేందుకు పశ్చిమ బెంగాల్‌లోని సరిహద్దు జిల్లాల్లో సుమారు 40 సబ్సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) యూనిట్లను తపర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ సరిహద్దు అత్యంత సున్నితమైనది కావడంతో శాశ్వత నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి చొరబాట్లు, స్మగ్లింగ్ వంటి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు అడ్డుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

## రుస్టెన్‌బర్గ్ గనిలో అక్రమ తవ్వకాలు.. 14 మంది మైనర్లు దుర్మరణం

**జోహాన్స్‌బర్గ్, ఆగస్టు 11:** సౌతాఫ్రికాలోని జోహాన్నెస్ బర్గ్ నగరానికి దాదాపు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న రుస్టెన్ బర్గ్ లోని ఓ గనిలో అక్రమంగా తవ్వకాలు జరువుతుండగా ప్రమాదవ శాత్తు గని కుప్పకూలిన ఘటనలో 14 మంది మైనర్లు ప్రాణాలు కోల్పోయారు. మరికొంతమంది గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు. అయితే ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రావిన్షియల్ పోలీస్ కమిషనర్ ఘటనాస్థలికి చేరుకున్నారు.



మంగళవారం కోహిర్ వద్ద ఢీకొన్న కార్లు

# నెత్తురోడిన రోడ్లు

**జహీరాబాద్, ఆగస్టు 11 ప్రభవార్త:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కూలీలతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో ఐదుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.చిరాగ్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం హుమ్నాబాద్ తాలూకా రాజగిరికి చెందిన కూలీలు పనుల నిమిత్తం జహీరాబాద్‌కు వచ్చారు. పని ముగించుకుని ఆటోలో జహీరాబాద్ నుండి హుమ్నాబాద్ వైపు వెళ్తుండగా సత్వార్ గ్రామ సమీపంలోని యూటర్న్ వద్ద ప్రమాదం జరిగింది. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న కూలీలు తీవ్రంగా గాయపడ్డారు.ఈ ప్రమాదంలో రేఖ, శ్రీదేవి, దేవదాస్, కవిత, రేష్మ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వీరంతా ఒకే గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. గాయపడిన వారిలో నిర్మల, నికిత, తుల్జమ్మ, చంద్రకళ, రాధిక, శిల్ప, శోభ ఉన్నారు.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే చిరాగ్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన వారిని హుటాహుటిన జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఆసుపత్రి వద్ద విషాదం ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు కూలీలు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకోవడంతో అక్కడ విషాద వాతావరణం నెలకొంది. తమ వారిని కోల్పోయిన కుటుంబ సభ్యుల రోదనలతో ఆసుపత్రి ఆవరణం దద్దరిల్లింది. ప్రమాదానికి గల పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.
02 కోహిర్ వద్ద కార్లు ఢీకొని మృతి చెందిన మల్లికార్జున్, శంకరులు

## కోహిర్ ఎక్స్ రోడ్ వద్ద కార్లు ఢీకొని ఇద్దరు మృతి

కోహిర్ చౌరస్తా సమీపంలో మంగళవారం రాత్రి కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు చనిపోయారు. చనిపోయిన వారిలో సదాశివపేట పట్టణం 1 వ వార్డుకు చెందిన బోడగమా మల్లికార్జున్ 52 ,శంకర్ 52,లు ఉన్నారు చనిపోయిన వారిలో మల్లికార్జున్ లీకినీ ఎంప్లాయ్ కాగా శంకర్ సదాశివపేట మున్సిపల్ ఎంప్లాయి పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న కోయిరు పోలీసులు సంఘటన స్థలాలను చేరుకొని మృతి చెందిన వారిని గాయపడ్డ వారిని జహీరాబాద్ ప్రభుత్వం ఏరియా ఆసుపత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఒక కారు పల్టీలు కొట్టి రహదారిపై పడగా వెనకాల ప్రయాణిస్తున్న మూడు కార్లు ఒకటి ఒకటి వెనుక నుండి ఢీకొనడంతో కారులో ప్రేమిస్తున్న ఇరువురు మృతి చెందినట్లు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## మెస్సీ మ్యాచ్ వ్యవహారంపై సీఎంకు దర్యాప్తు కమిటీ నివేదిక

**తిరువనంతపురం, ఆగస్టు 11:** ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ, ప్రపంచ ఛాంపియన్ అర్జెంటీనా జట్టును కేరళకు తీసుకువచ్చే ప్రయత్నం విఫలం కావడంపై తీవ్ర వివాదం రాజుకుంది. గత వామపక్ష ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ వ్యవహారంపై నియమించిన విచారణ కమిటీ తన నివేదికను ప్రస్తుత వి.డి. సతీశన్ ప్రభుత్వానికి సమర్పించింది. ఇందులో తీవ్రమైన ఆర్థిక అవకతవకలు జరిగినట్టు తేలడంతో ప్రభుత్వం తదుపరి చర్యలకు సిద్ధమవుతోంది. రేపుజరగనున్న కేబినెట్ సమావేశంలో దీనిపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. క్రీడల శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎన్. ప్రశాంత్ నేతృత్వంలో జరిగిన ఈ విచారణలో పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అర్జెంటీనా మ్యాచ్ కోసం స్పాన్సర్‌ను ఎంపిక చేసిన విధానం, ఆర్థిక లావాదేవీలు, కొచ్చిలోని జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ స్టేడియం అప్పగింత వంటి అంశాల్లో ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించినట్టు నివేదిక స్పష్టం చేసింది. ఒక నిర్దిష్ట కంపెనీకి ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని కూడా నివేదికలో పేర్కొన్నారు. అసలు అర్జెంటీనా జట్టు కేరళకు వస్తుందనడానికి ఎలాంటి అధికారిక పత్రాలు, ఒప్పందాలు లేవని విచారణలో తేలడం గమనార్హం.

## 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనండి: ప్రధాని మోడీ

>> బాలయోగి ఆడిటోరియంలో జరిగిన ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు, ఎన్డీఏ నేతలు, కూటమిలోని వివిధ పార్టీలకు చెందిన ఎంపీలు హాజరయ్యారు. ప్రధాని మోదీ సమావేశ ప్రాంగణంలోకి ప్రవేశించగానే మంత్రులు, ఎంపీలు జాతీయ జెండాలను చేతబూని నినాదాలు చేశారు. దీనికి ప్రతిగా మోడీ కూడా జాతీయ జెండాను చేతిలో పట్టుకుని ఎంపీల వైపు ఊపారు.ఈ సమావేశానికి బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, ఎస్. జైశంకర్ తదితరులు హాజరయ్యారు. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలకు చెందిన హెచ్‌డీ కుమారస్వామి (జేడీఎస్), కింజరాపు రామ్మోహన్ నాయుడు (టీడీపీ), రాందాస్ బందు అథవాలే, ప్రఫుల్ పటేల్ (ఎన్సీపీ), ఉపేంద్ర కుష్వాహా (ఆర్ఎల్ఎం), శతాబ్ది రాయ్ తదితర నేతలు కూడా సమావేశంలో పాల్గొన్నారు. జూలై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13న ముగియనున్నాయి.
**పలు బిల్లుల ఆమోదం:** ఈ సమావేశాల్లో తరచూ వాయిదాలు, నిరసనలు చోటుచేసుకోవడంతో పెద్దగా శాసన కార్యకలాపాలు జరగలేదు. ప్రజా పరీక్షలు (అక్రమ మార్గాల నిరోధం) సవరణ బిల్లు2026తో పాటు మరో నాలుగు బిల్లులను పెద్దగా చర్చ లేకుండానే పార్లమెంట్ ఆమోదించింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్య లోక్‌సభ మరో మూడు బిల్లులను కూడా ఆమోదించింది.తొలుత నీట్ ప్రశ్నపత్రం లీక్ అంశంతో పాటు అయోధ్య రామాలయ విరాళాల నిధుల దుర్వినియోగంపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేశాయి. అనంతరం నీట్ అంశంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యపై చర్చించాలని, ఈ అంశంపై ప్రధానమంత్రి మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో ఉండి ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

## ఇక చకచకా పోలవరం ప్రాజెక్ట్ ఫేజ్-1బి

>> ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణానికి గుర్తించిన భూములను పరిశీలించారు. కొయ్యలగూడెం మండలంలోని పరింపూడి గ్రామంలో వి.ఆర్.పురం మండలం రాజుపేట కాలనీ, రాజుపేట గ్రామాలకు గిరిజనేతర ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు, కూనవరం మండలంలోని కూనవరం, టేకులబోరె గ్రామాలకు చెందిన గిరిజనేతర ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల కోసం ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణానికి కేటాయించిన భూములను అధికారులు పరిశీలించారు. పరింపూడి గ్రామంలో గుర్తించిన భూముల విస్తీర్ణం, భూమి అనుకూలత, రహదారి సౌకర్యం, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల కల్పనకు ఉన్న అవకాశాలను పరిశీలించి, ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరింపూడి గ్రామ భూముల పరిశీలన అనంతరం ఐటిడిఏ కె.ఆర్.పురం కార్యాలయంలో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ధవళేశ్వరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, ఐటిడిఏ చింతూరు ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాకు చెందిన సంబంధిత అన్ని నిర్మాణ సంస్థలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చింతూరు డివిజన్‌కు చెందిన ఫేజ్-1బి ఎస్టీ, నాన్-ఎస్టీ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల కోసం ప్రతిపాదించిన ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణానికి సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టుల తయారీ, కాలనీల వారీగా గృహాల సంఖ్య, అవసరమైన మౌలిక వసతులు, భూముల అనుకూలత, కాలనీ లేఅవుట్లు, రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షి ంచారు.
ప్రతి ప్రతిపాదిత ఆర్ అండ్ ఆర్ కాలనీకి ప్రత్యేకంగా డిపిఆర్ సిద్ధం చేసి, సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులను త్వరితగతిన పొందేలా చర్యలు తీసుకోవాలని ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశం అనంతరం అధికారులు బుట్టాయిగూడెం, దొరమామిడి, మార్లగూడెం గ్రామాల్లో ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణానికి గుర్తించిన భూములను సందర్శించారు. కూనవరం మండలంలోని కుళ్ళపాడు, కూనవరం, టేకుబాక, టేకులబోరు గ్రామాలకు చెందిన ఎస్టీ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు, అలాగే వి.ఆర్.పురం మండలంలోని కన్నాయిగూడెం, సోమ్ములగూడెం, శబరాయిగూడెం తదితర గ్రామాలకు చెందిన ఎస్టీ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల కోసం ప్రతిపాదించిన పునరావాస భూములను పరిశీలించారు. చింతూరు డివిజన్‌కు చెందిన ఆయా గ్రామాల ఎస్టీ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల కోసం ప్రతిపాదించిన ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణాన్ని 2027 మార్చి నాటికి పూర్తి చేసే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రాములు నాయక్, ప్రాజెక్టు అధికారి, ఐటిడిఏ కె.ఆర్.పురం, బాలకృష్ణ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఏటపాక యూనిట్-1, శర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఏలూరు, ఆంజనేయులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, వి.ఆర్.పురం యూనిట్-2, చంద్రశేఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, చింతూరు యూనిట్-1, సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

12-08-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
● తి.అమావాస్య రా.11.09
న.పుష్యమి ఉ.8.00
వ.రా.7.48-రా.9.16
దు.ఉ.11.46-మ.12.37
రాహు. మ.12.00-మ.1.30 శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** చిన్ననాటి మిత్రుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. నూతన వస్తువులు కొనుగోలు. వాహన సౌఖ్యం.

**వృషభం :** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నూతన పెట్టుబడులకు అనుకూలం. శుభకార్యాలు.

**మిథునం :** కుటుంబ సభ్యులతో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. ఇంటా బయటా మీదే పైచేయిగా ఉంటుంది.

**కర్కాటకం :** సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతారు. క్రయ విక్రయాలలో లాభాలు.

**సింహం :** కొత్త వ్యాపార, విద్యా సంబంధితమైన విషయములకు, గృహ నిర్మాణాలకు అనుకూలం. మిత్రుల కలయిక.

**కన్య :** సన్నిహితుల సహకారము పూర్తిగా లభించుట వలన కొన్ని కార్యక్రమములలో విజయాలను చవిచూస్తారు.

**తుల :** ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుట వలన మానసిక ఉల్లాసమును కలిగియుంటారు. వస్త్రా లాభాలు

**వృశ్చికం :** అధికారుల అండదండలు లభించుట వలన వృత్తి యందు రాణించగలుగుతారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**ధనుస్సు :** సంతాన, ఆధ్యాత్మిక విషయములు సంతృప్తి ఇస్తాయి. భార్య వైపు బంధువులకు సాయం చేస్తారు.

**మకరం :** అధికారులతో సహోద్యోగులతో స్నేహ భావముతో మెలగండి. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కుంభం :** వ్యాపారములో, వృత్తిలో మీరు చూపించే నైపుణ్యమునకు గాను, మంచి అభివృద్ధిని సాధిస్తారు. మిత్రుల కలయిక.

**మీనం :** విదేశీయానములకు ఉద్యోగ ప్రయత్నములకు మీరుచేసే కృషి సానుకూల పడుతుంది. కాంట్రాక్టులు లాభిస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు పనులకు తొలగిన అడ్డంకులు

## పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి నిర్మాణంలో కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్డు పనులకు ఉన్న న్యాయపరమైన అడ్డంకులు ఎట్టకేలకు తొలగిపోయాయి. ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. దీంతో రాజధానిలో పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణ పనులకు మార్గం సుగమం అయింది. సీఆర్డీఏ పరిధిలో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ప్రయత్నం చేసింది. ఇందులో భాగంగా భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ఈ భూసేకరణ విషయంలో అధికారులు చట్ట నిబంధనలను ఏమాత్రం అనుసరించలేదని ఆరోపిస్తూ పలువురు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్‌ను, దానికి అనుగుణంగా ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద పలు వ్యాజ్యాలు దాఖలు చేశారు. రైతుల పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. సీడ్ యాక్సెస్ రోడ్డు భూసేకరణ ప్రక్రియ పారదర్శకంగా సాగుతోందని కోర్టుకు వివరించారు. ఎక్కడా చట్ట ఉల్లంఘనలు జరగలేదని స్పష్టం చేశారు. పక్కాగా చట్ట నిబంధనల ప్రకారమే భూసేకరణ చేపడుతున్నామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రైతులు చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. రైతులు, ప్రభుత్వం తరఫు వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం జులైలో ఈ వ్యవహారంపై తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా రైతులు వేసిన పిటిషన్లను కొట్టివేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది. సీడ్ యాక్సెస్ రోడ్డు అనేది రాజధాని నిర్మాణంలో భాగమని, ఇది విస్తృత ప్రజానీకం ప్రయోజనాలతో ముడిపడి ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి విస్తృత ప్రయోజనాల దృష్ట్యా జరుగుతున్న ప్రక్రియను తాము అడ్డుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు పూర్తిగా తొలగిపోయినట్లయింది.

## ఢిల్లీ-విజయవాడ విమానానికి సాంకేతిక సమస్య

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ఢిల్లీ- విజయవాడ ఎయిరిండియా విమానానికి సాంకేతిక సమస్య వచ్చింది. విమానం ఇంజిన్‌లో పైలట్ సాంకేతిక సమస్యను గుర్తించారు. విమానాన్ని విజయవాడలో దించకుండా హైదరాబాద్ వైపు మళ్లించారు. దారిలోనే ఇంజిన్ సమస్య పరిష్కారం కావడంతో మళ్లీ విజయవాడ తరలించారు. దీంతో ఎయిరిండియా విమానంలో మంత్రి దుర్గేశ్, పలువురు ఎమ్మెల్యేలు, ప్రముఖులతోపాటు 180 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. విమానం సురక్షితంగా ల్యాండ్ కావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయంలో పనిచేయని సర్వర్లు

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయంలో మంగళవారం సర్వర్లు పనిచేయలేదు. దీంతో పాస్‌పోర్టు కోసం ఆధారాలతో సహా నమోదుకు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాస్‌పోర్టు కోసం స్లాట్ బుక్ చేసుకుని, తేదిని అనుసరించి దూరప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాంకేతిక సమస్యపై అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వలేదు. కార్యాలయంలో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో మళ్లీ రావాలంటూ పాస్‌పోర్ట్ అధికారులు ఇంటికి అభ్యర్థులను వెనక్కి పంపించేశారు.

## బెయిల్ కోసం నాగారాజు కోర్టులో పిటిషన్

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సస్పెన్షన్‌లో ఉన్న నాగరాజు బెయిల్ కోసం మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. విజయవాడ మేజిస్ట్రేట్ కోర్టులో ఆయన తరఫు న్యాయవాదులు బెయిల్ పిటిషన్ సమర్పించారు. ప్రస్తుతం సీఐ నాగరాజు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఇటీవలనే సిట్ నాగారాజును కస్టడీలోకి విచారణ తీసుకుంది. కేసులో తదుపరి విచారణ సందర్భంగా కోర్టు ఆయన బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకోనుంది.

## మచిలీపట్నంలో 4 రెస్టారెంట్లలో తనిఖీలు

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా మచిలీపట్నంలో నాలుగు రెస్టారెంట్లలో తనిఖీలు చేపట్టారు. నాలుగు హోటళ్లలో నగరపాలకసంస్థ ఆరోగ్య విభాగ అధికారి తనిఖీలు చేశారు. పత్రాలు లేకుండా హోటల్ నిర్వహణ, పారిశుధ్య లోపాలను గుర్తించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలు గుర్తించామని ఎంహెచ్‌వో సుబ్రమణ్యం తెలిపారు. లోపాలపై సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

## డి.సిఎం పవన్‌తో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భేటీ




**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ను సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ శాఖ కార్యదర్శి డాక్టర్ హనుమంతు పురుషోత్తం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, పరిశోధన, ఆవిష్కరణలకు అనుకూల వాతావరణం కల్పించడం, విద్యార్థులు, యువ పరిశోధకులకు మరిన్ని అవకాశాలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించారు. యువతలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించే కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ సూచించారు. ఇక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఐఏఎస్ అధికారి జయకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులైన జయకృష్ణ మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రిని కలిశారు.

# ప్రజల భాగస్వామ్యంతో పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్

**రోడ్ డాక్టర్ పేరుతో జీరో పాత్ హోల్ మిషన్ • ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు**



**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. "పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, ప్రజలు అంతా భాగస్వామ్యం కావాలి. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభంగా అందిస్తే జాతి నిర్మాణానికి సహకరించినట్టే. ప్రతి ఉద్యోగి, ప్రతి అధికారి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు సహకరించాలి. పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. దీన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. రోడ్ డాక్టర్ పేరుతో జీరో పాత్ హోల్ మిషన్ చేపట్టాలి. గుంతలు పడిన రోడ్లను వెంటనే మరమ్మత్తులు చేపట్టేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికే కొన్ని చోట్ల ప్రయోగాత్మకంగా చేస్తున్నారు. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలి. ప్రభుత్వం మంచి పనిచేస్తే ప్రజలు ఇన్ వాల్వ్ అవుతారనడానికి భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చిన స్పందనే నిదర్శనం. అలాగే వాస్తవాలను ప్రజలకు వివరించగలిగితే ప్రభుత్వానికి ప్రజలే అండగా నిలుస్తారు. దీనికి కర్నూలులో డీఎస్సీ 2025 టీచర్లు చేపట్టిన కార్యక్రమమే ప్రత్యక్ష ఉదాహరణ. నెలవారీ ఆర్థిక ప్రగతి సమీక్షించాం. జులైలో 10.70 శాతం వృద్ధిని నమోదు చేయగలిగాం. ఎల్ నినో ప్రభావం ఇప్పటి నుంచి ఎక్కువగా ఉండనుంది. ఇప్పుడే అనేక సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. వీటిని అధిగమించాలి" అని ముఖ్యమంత్రి సూచించారు. సిఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలపై నేడు సిఎం సమీక్ష

**డిజిపి నుంచి స్టేషన్ హౌస్ ఆఫీసర్ల వరకు హాజరు**

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం 03:30 గంటలకు రాష్ట్ర సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఎన్నడూ లేనివిధంగా పోలీస్ వ్యవస్థలోని అన్ని శ్రేణుల అధికారులను ఈ సమీక్షలో భాగస్వాముల్ని చేస్తున్నారు. డీజీపీ మొదలుకొని క్షేత్రస్థాయిలో పనిచేసే స్టేషన్ హౌస్ ఆఫీసర్ల వరకు మొత్తంగా 1,300 మంది అధికారులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. శాంతి భద్రతలు, మహిళలు, చిన్నారులపై నేరాల కట్టడి, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా సైకోలు, బ్లేడ్, గంజాయి బ్యాచ్ ఆగడాలకు అడ్డుకట్ట వంటి అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరుపై ముఖ్యమంత్రి లోతైన విశ్లేషణ చేయనున్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు, శాంతిభద్రతల నిర్వహణ వంటి అంశాలపై తన వద్ద ఉన్న రిపోర్టులను ఈ సమావేశంలో సీనియర్ అధికారుల ముందే ముఖ్యమంత్రి బయట పెట్టనున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై ఉక్కుపాదం మోపాలని, మహిళలు, బలహీన వర్గాల రక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. పోలీస్ ఉన్నతాధికారులు సచివాలయంలో ప్రత్యక్షంగా హాజరు కానుండగా, జిల్లాల్లోని మిగిలిన అధికారులు, ఎస్‌హెచ్‌ఓలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనబోతున్నారు.

# తల్లీబిడ్డల సురక్షిత ప్రయాణానికి ఎక్స్‌ప్రెస్ వాహనాలతో కొత్త శకం

**• వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**



**నరసరావుపేట టౌన్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రసవానంతర తల్లి, శిశువుల సురక్షిత రవాణాకు కొత్త అధ్యాయం ప్రారంభమైందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబులతో కలిసి తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఆధునిక వాహనాలను ప్రారంభించారు. మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబులు ఈ సందర్భంగా మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రూపొందించిన ఈ వాహనాలు దేశంలోనే తొలిసారి అత్యాధునిక భద్రతా సౌకర్యాలతో కూడినవని తెలిపారు. మొత్తం 500 వాహనాలను ప్రభుత్వం సమకూర్చుతోందన్నారు. తొలి దశలో 300 వాహనాలను రోడ్డెక్కించగా మిగిలిన 200 వాహనాలను రెండు నెలల్లోపు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

జిల్లాల్లో నమోదవుతున్న ప్రసవాల సంఖ్య ఆధారంగా వాహనాలను శాస్త్రీయంగా కేటాయించడం జరిగిందని వారు వివరించారు. కొత్త వాహనాలలో ఎయిర్ కండిషన్డ్ ఎస్‌యూవీ/ఎంయూవీ తరహాలో ఉన్నాయన్నారు. ప్రయాణికుల భద్రతకు ఆరు ఎయిర్‌బ్యాగులు, వెనుక సీట్ బెల్టులు, చైల్డ్ లాక్ స్లైడింగ్ డోర్లు, ఏబీఎస్, ఈబీడీ, ఈఎస్‌పీ, రివర్స్ పార్కింగ్ సెన్సార్లు, 80 కిమీ/గంట వేగం దాటితే స్పీడ్ అలర్ట్ వ్యవస్థ వంటి సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు సులభంగా ఎక్కడానికి ప్రత్యేక ఫుట్‌రెస్టులు, హ్యాండ్‌రెయిల్స్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన తల్లి, శిశువుకు మాత్రమే ఈ డ్రాప్ బ్యాక్ సేవ ఉచితం. తల్లి, బిడ్డతో పాటు ఇద్దరు అటెండెంట్లు ప్రయాణించవచ్చు. హైరిస్క్ గర్భిణులు, తీవ్ర రక్తహీనతతో రక్తమార్పిడి అవసరమైనవారికి ప్రత్యేక పికప్, డ్రాప్‌బ్యాక్ సేవలు అందుతాయని తెలియజేశారు. రాష్ట్రంలో ఏ ఫోన్ నుంచైనా టోల్ ఫ్రీ 102కు కాల్ చేస్తే సరిపోతుంది. 202627కి రూ.37.40 కోట్ల బడ్జెట్ కేటాయించారు.

మాతా, శిశు మరణాలు తగ్గించడం, ప్రసవానంతర సంరక్షణను మెరుగుపరచడం, హైరిస్క్ గర్భిణులకు సకాలంలో రవాణా అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని మంత్రి సత్య కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబులు వివరించారు. తోలుత వాహనాలు జిల్లా కలెక్టర్ తో కలిసి వారు ప్రారంభించారు.

జిల్లా ఆసుపత్రిని పరిశీలించారు. కార్య క్రమంలో హాస్పటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, హాస్పటల్ సూపరిండెంట్ డాక్టర్ సతీష్, తెలుగుదేశం, బిజెపి నాయకులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాకో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయండి

**• కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి జనసేన ఎంపిలు వినతి**



కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి వినతి పత్రం ఆందజేస్తున్న జెఎస్పీ ఎంపీలు లింగమనేని రమేశ్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషికి జనసేన ఎంపిలు లింగమనేని రమేశ్, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ వినతి పత్రం అందించారు. మంగళవారం ఢిల్లీలో శ్రీ ప్రహ్లాద్ జోషితో ఎంపీలు భేటీ అయ్యారు. కొత్తగా ఏర్పడిన జిల్లాలతో సహా అన్ని జిల్లాల్లో జెఎన్‌విలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. 2027-28 విద్యా సంవత్సరం నుంచి దశలవారీగా ప్రవేశాలు, విద్యాబోధన ప్రారంభించేలా చూడాలని కోరారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ వల్ల నవోదయ విద్యాలయాలు లేని ప్రాంతాల్లో ప్రతిభా వంతులైన గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరమవుతోందని వివరించారు. నవోదయ పాఠశాలల ఏర్పాటుపై కేంద్రానికి ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రతిపాదనలు పంపారని ఎంపీలు తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో నవోదయ విద్యాలయాల ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు మార్గం సుగమం అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచన అని వివరించారు. నవోదయ విద్యాలయ సమితి నిబంధనల ప్రకారం ఉచితంగా భూమి, తాత్కాలిక భవనాలు, మౌలిక వసతులు కల్పించేందుకు ఏపి ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. కేంద్ర విద్యాశాఖ, నవోదయ విద్యాలయ సమితి, ఏపి ప్రభుత్వంతోపాటు ఎంపిలతో ఉమ్మడి సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే ఉమ్మడి సమీక్ష నిర్వహిస్తే త్వరితగతిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. ప్రతి జిల్లాలో నవోదయ పాఠశాలల ఏర్పాటు చేయడం వల్ల ఎన్ఇపి 2020, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలు సాకారమవుతాయని చెప్పారు. ప్రహ్లాద్ జోషికి విజ్ఞప్తి చేశారు.

## బ్యాంకాక్ బాధితులను స్వస్థలాలకు రప్పించేందుకు చర్యలు

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగాల పేరిట మోసపోయి బ్యాంకాక్‌లో చిక్కుకున్న తెలుగు విద్యార్థులను క్షేమంగా స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారు. బ్యాంకాక్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులతో ఏపి భవన్ అధికారులు మాట్లాడారు. మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు విద్యార్థుల పరిస్థితిపై అధికారులు ఆరా తీశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరమైన సహాయంపై వివరాలు సేకరించారు. విద్యార్థుల పరిస్థితికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని థాయ్‌లాండ్‌లోని భారత రాయబారికి పంపించారు. థాయ్‌లాండ్‌లో స్థానిక కరెన్సీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు ఏపి భవన్ అధికారులు తెలిపారు. విద్యార్థులకు సహాయం అందేలా తక్ ఇమ్మిగ్రేషన్ అధికారులకు సూచనలు ఇవ్వాలని రాయబారిని అధికారులు కోరారు.


**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**

RFP Tender Notice No.01/2026-27 /COC/Dt:11-08-2026

| | | |
|---|---|---|
| 01. No. of Works | : | 1 (One) (RFP Tender) |
| 02. Down loading Starting Date | : | 14-08-2026 10.30 AM |
| 03. Down loading End Date | : | 31-08-2026 @ 5.00 PM |
| 04. Last date for Submission of bid | : | 31-08-2026 @ 5.01 PM |

Further details at http://www.eprocurement.gov.in

O/o the Executive Engineer (PD) Division Sd/- Commissioner



**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**

ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు

(CIN : L36911RJ1996PLC011381)

నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001

అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన

ఇది ఇలా ఉండగా, షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ అయిన **AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, "సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002" క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002తో చదువబడే సెక్షన్ 13 క్రింద సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, తేదీ **19/05/2026** నాటి డిమాండ్ నోటీసును జారీ చేశాను. రిఫరెన్స్ నెం.: **CB/SAR/13-2/BB/MAY-2026/09** లోన్ అకౌంట్ నెం. **2406262157371913 & 9001231646887301** క్రింద రుణగ్రహీత/హామీదారు/తాకట్టుదారులు/**M/S. జయలక్ష్మి వెజిటబుల్ మర్చంట్స్**, దాని యజమాని శ్రీ యెర్రమ్‌శెట్టి సుబ్బారావు (రుణగ్రహీత), శ్రీ సాయిబాబు యెర్రమ్‌శెట్టి కుమారుడు శ్రీ యెర్రమ్‌శెట్టి సుబ్బారావు (తాకట్టుదారు), శ్రీ యెర్రమ్‌శెట్టి సుబ్బారావు భార్య శ్రీమతి యెర్రమ్‌శెట్టి జయలక్ష్మి (హామీదారు) ద్వారా, నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలి. ఆ మొత్తం లోన్ ఖాతా నెం. **2406262157371913** కొరకు రూ. **48,14,288/-** (నలభై ఎనిమిది లక్షల పద్నాలుగు వేల రెండు వందల ఎనభై ఎనిమిది రూపాయలు మాత్రమే) మరియు లోన్ ఖాతా నెం. **9001231646887301** కొరకు రూ. **38,85,239/-** (ముప్పై ఎనిమిది లక్షల ఎనభై ఐదు వేల రెండు వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే) కలిపి మొత్తం రూ.**86,99,527/-** (ఎనభై ఆరు లక్షల తొంభై తొమ్మిది వేల ఐదు వందల ఇరవై ఏడు రూపాయలు మాత్రమే) **18 మే 2026 నాటికి**, నోటీసు తేదీ/సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు పూర్తి చెల్లింపు చేసే వరకు, అదనపు వడ్డీ మరియు ఛార్జీలతో సహా, అసలు, వడ్డీ, జరిమానాలు మరియు అన్ని ఇతర ఛార్జీలతో కలిపి చెల్లించవలెను.

రుణగ్రహీత/తాకట్టుదారుడు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సదరు చట్టంలోని సెక్షన్ 13(4) మరియు సదరు నిబంధనలలోని రూల్ 8 ప్రకారం తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, క్రింద సంతకందారు **06వ తేదీన, ఆగస్టు 2026వ సంవత్సరం**, ఇక్కడ క్రింద వివరించబడిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత/తాకట్టుదారునికి మరియు సాధారణ ప్రజలకు దీని ద్వారా తెలియజేయడమైనది.

హామీగా ఉంచిన ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప సెక్షన్ (8)లోని నిబంధనల వైపు రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది.

ముఖ్యంగా రుణగ్రహీతలు/హామీదారులు/తాకట్టుదారులు మరియు సాధారణ ప్రజలు ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరించడమైనది. ఆస్తితో చేసే ఏ లావాదేవీలకైనా, లోన్ ఖాతా నెం. **9001231646887301** కొరకు రూ. **39,89,623/-** (ముప్పై తొమ్మిది లక్షల ఎనభై తొమ్మిది వేల ఆరు వందల ఇరవై మూడు రూపాయలు మాత్రమే) మరియు లోన్ ఖాతా నెం. **2406262157371913** కొరకు రూ. **49,50,908/-** (నలభై తొమ్మిది లక్షల యాభై వేల తొమ్మిది వందల ఎనిమిది రూపాయలు మాత్రమే) కలిపి మొత్తం **31 జూలై 2026 నాటికి 89,40,531/-** (ఎనభై తొమ్మిది లక్షల నలభై వేల ఐదు వందల ముప్పై ఒకటి రూపాయలు మాత్రమే) **AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉంటుంది. మరియు పూర్తి చెల్లింపు జరిగే వరకు దానిపై తదుపరి వడ్డీ మరియు ఖర్చులు.

స్థిరాస్తుల యొక్క వివరణ

ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం, గాజువాక మండలం, ఎస్.ఆర్.ఓ. అధికార పరిధిలో, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్/గాజువాక గ్రామ పంచాయతీ పరిధిలో, గాజువాక మండలం, బి.సి. రోడ్, న్యూ గాజువాక, గాజువాక గ్రామంలోని సర్వే నెం. 75 వద్ద ఉన్న, 184.84 చదరపు గజాల విస్తీర్ణం గల, డోర్/హౌస్ నెం. 12-43-13, పాత అసెస్‌మెంట్ నెం. 1088009776, కొత్త అసెస్‌మెంట్ నెం. 1086376264, పట్టా నెం. VZG1001-63-76613-71966 గల ఆస్తి యొక్క ప్రస్తుత మరియు భవిష్యత్ నిర్మాణంతో సహా ఆ భూమి యొక్క మొత్తం అదంతా. యజమాని శ్రీ యెర్రమ్‌శెట్టి సుబ్బారావు. సరిహద్దులు క్రింది విధంగా ఉన్నాయి: -

తూర్పు: డోర్/ఇంటి నెం. 12-43-12, పడమర: మదీనా, 12-43-14, ఉత్తరం: ఎస్ కె అలీ, ఇంటి నెం. 12-44-1/2, దక్షిణం: సిసి రోడ్

తేది : 06.08.2026 సం/- అధీకృత అధికారి

ప్రదేశం : విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్


# ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, శానిటేషన్ ఏజెన్సీలు పరస్పరం సమన్వయంతో పనిచేయాలి

**• నెలాఖరులోగా ప్రభుత్వాసుపత్రుల్లో శానిటేషన్ ఏజెన్సీల సిబ్బందికి ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి చేయాలి • మంత్రి సత్యకుమార్ వెల్లడి**

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆసుపత్రుల్లోని పరిస్థితులపై 3 గంటలపాటు సమీక్షించిన మంత్రి ప్రభుత్వాసుపత్రుల్లో పరిశుభ్రత పరిశుభ్రత మరింత మెరుగుపడేందుకు ఆసుపత్రుల సూపరెంటెంట్లు, ఏజెన్సీ వారు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ వెల్లడించారు. వైద్యుల హాజరు, వారందించే సేవలు, మందుల లభ్యత పట్ల ప్రజల సంతృప్త స్థాయికి తగ్గట్లుగా పరిశుభ్రత విషయంలోనూ సానుకూలత పెరగాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. మంగళగిరిలోని ఎపిఐఐసి టవర్స్‌లోని వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం బోధానాసుపత్రులు, జిల్లా, ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లో పరిశుభ్రత తీరు, సంతృప్తస్థాయి నమోదు ఇతర అంశాలపై అధికారులు, సదరు ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, శానిటేషన్ ఏజెన్సీల వారితో మూడు గంటల పాటు చర్చించారు. ఈ ఏడాది ఏప్రిల్ జులై కాలంలో సెకండరీ ఆసుపత్రుల్లో పరిశుభ్రత పట్ల ప్రజా సానుకూలత ఆశించిన స్థాయిలో నమోదు కాకపోవటం, ఆసుపత్రుల్లోని సమస్యలు, సమన్వయం వంటి అంశాలపై సూపరింటెండెంట్లు, ఏజెన్సీల వారి నుంచి వివరణ కోరారు. ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలలు, బోధానాసుపత్రులు, సెకండరీ ఆసుపత్రుల్లో శానిటేషన్ మరియు సెక్యూరిటీ పెస్ట్ కంట్రోల్ సేవలందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జరగాల్సిన సిబ్బంది నియమికాలు, వాస్తవంలో నమోదవుతున్న హాజరు, వ్యత్యాసాలను మంత్రి ఆరా తీశారు. ఎఫ్ఆర్ యస్ విధానంలో పూర్తిస్థాయి హాజరు నమోదు కాకపోవడానికి కారణాలపై మంత్రి అధికారులు, ఏజెన్సీల నుంచి తెలుసుకున్నారుతాము తగు స్థాయిలో సిబ్బందిని నియమించినా ఎఫ్ఆర్ యస్ హాజరు కొన్ని కారణాల వలన నమోదు కావడంలేదని ఏజెన్సీలు తెలుపగా, ఈ నెలాఖరుకు మొత్తం సిబ్బంది ఎఫ్ఆర్‌యస్ వ్యవస్థలో నమోదయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులు, ఏజెన్సీలను మంత్రి ఆదేశించారు.

నిరంతర సమీక్షలు జరగాలి: మంగళవారంనాటి సమీక్షలో వైద్య సంస్థల ఉన్నతాధికారులు, సర్వీసులందించే ఏజెన్సీల మధ్య ఆశించిన స్థాయిలో సమన్వయం జరగడంలేదని, పారిశుధ్య, సెక్యూరిటీల ప్రాధాన్యత దృష్ట్యా, ఈ అంశాలకు సంబంధించిన అన్ని సమస్యలనూ ప్రతి వారం క్షుణ్ణంగా సమీక్షించి, తీసుకున్న నిర్ణయాలను తదుపరి చర్యలను తనకు అందజేయాలని శాఖ కార్యదర్శి వీరపాండియన్ ఆదేశించారు. వివిధ సంస్థల ప్రాంగణాల్లోని ప్రధాన ప్రాంతాలకు పర్యవేక్షణా అధికారులను నియమించాలని సూచించారు. పూర్తి స్థాయిలో ఎఫ్ఆర్‌యస్ ఎన్‌రోల్‌మెంట్ జరిగిన తర్వాత, మరో సమీక్ష నిర్వహిస్తామని కార్యదర్శి స్పష్టంచేశారు.


**pnb Housing Finance Limited** Ghar Ki Baat

అనుబంధం-IV-A - స్థిరాస్తి/ల యొక్క ఇ-వేలం బహిరంగ విక్రయ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 యందు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6)కు ఏర్పాటుతో చదువబడే దాని క్రింద స్థిరాస్తుల యొక్క విక్రయం కొరకు ఇ-వేలం-విక్రయ ప్రకటన

నమోదిత కార్యాలయం: 9వ అంతస్తు, అంతరిక్ష్ భవన్, 22 కస్తూర్బా గాంధీ మార్గ్, న్యూఢిల్లీ-110001. ఫోన్: 011-23357171, 23357172, 23705414, వెబ్: www.pnbhousing.com

బ్రాంచ్ చిరునామా : డోర్ నం. 46-7-27, 2వ అంతస్తు, దానవాయిపేట మెయిన్ రోడ్, రాజమండ్రి - 533103, ఆంధ్రప్రదేశ్, బ్రాంచ్ చిరునామా : డోర్ నం. 13-1-57, 2వ అంతస్తు, NVR కాంప్లెక్స్, మెయిన్ రోడ్, సూర్యారావుపేట, కాకినాడ - 533001, ఆంధ్రప్రదేశ్.

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ప్రత్యేకించి కాలమ్ నెం.A మరియు పేర్కొనబడిన రుణగ్రహీత(లు) మరియు హామీదారు/లుకు నోటీసు జారీ చేయునది ఏమనగా సెక్యూరిటీ క్రెడిటార్ వద్ద తనఖా పెట్టబడిన/ఛార్జ్ చేయబడిన కాలమ్ నెం.D మరియు తెలుపబడిన స్థిరాస్తు(ల)ను (కాలమ్ నెం.C యందు పేర్కొనబడిన) వానిని M/s. PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్/సెక్యూర్డ్ క్రెడిటార్, నిర్మాణాత్మకంగా/భౌతికంగా స్వాధీనం చేసికొని ఉన్నారు. మరియు క్రింద పేర్కొన్న వివరాల ప్రకారం "ఏది ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా ఏది ఎలా ఉన్నవి అక్కడ ఏది ఉందో అది అలా" ప్రాతిపదికన అమ్మబడుతుంది. [illegible] www.pnbhousing.com చూడవచ్చును.

| రుణం నెం./రుణగ్రహీత పేరు/సహ-రుణగ్రహీత/హామీదారు/చట్టబద్ధ వారసులు (A) | డిమాండ్ మొత్తం & తేది (B) | స్వాధీనత యొక్క స్వభావం (C) | తనఖాపెట్టబడిన ఆస్తుల వివరణ (D) | రిజర్వ్ ధర (RP) (E) | ఇఎండి (RP లో 10%) (F) | బిడ్ సమర్పణ చివరి తేది (G) | బిడ్ ఇంక్రిమెంట్ రేటు (H) | తనిఖీ తేది మరియు సమయం (I) | వేలం తేది మరియు సమయం (J) | తెలిసిన అభ్యంతరాలు/క్లెయిమ్‌లు (K) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| NHL/RRJM/0924/5077390 గుణనాథ్ చొప్పాల / కొండెపర్తి మైథిలి, B.O: రోప్స్, రాజమండ్రి | రూ.2884671.82 05.09.25 నాటికి | భౌతికంగా | డోర్ నం.2-90 RS నం.140/1, కడలి గ్రామ పంచాయతీ మరియు గ్రామం, కడలి, రాజోలు, రాజోలు మండలం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, ఆంధ్రప్రదేశ్ - 533248 | రూ. 4399000 | రూ. 439900 | 27.08.26 | రూ. 10000 | 18.08.26 ఉ.11.00 గం. - సా.5.00 గం. | 29.08.26 మ.02.00 గం. - మ.3.00 గం. | లేవు/ తెలియవు |
| HOU/RKAK/0125/5142304 జనార్దన్ పసుపులేటి / Ms. రమ్య, B.O: రోప్స్, కాకినాడ | రూ.2643132 10.02.26 నాటికి | భౌతికంగా | ప్లాట్ నం.312, LP నం.792, S నం. 443, 451 RS నం.553, 552, సామర్లకోట మండలం, ప్రస్తుతం కాకినాడ జిల్లా, మెయిన్ రోడ్, కాకినాడ, ఆంధ్రప్రదేశ్ - 533005 | రూ. 2560000 | రూ. 256000 | 17.09.26 | రూ. 10000 | 25.08.26 ఉ.11.00 గం. - సా.5.00 గం. | 18.09.26 మ.02.00 గం. - మ.3.00 గం. | లేవు/ తెలియవు |

* దీనికి తదుపరి వడ్డీ @ 18% P.A. వర్తించే తగు వ్యయములు, ఇన్సిడెంటల్ ఖర్చులు, ధర, ఛార్జీలు మొదలగునవి చెల్లింపు తేదీ వరకు మరియు/లేదా రియలైజేషన్ వరకు అయినవి. **PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి యొక్క ఎరుక మరియు సమాచారం మేరకు పైన తెలుపబడిన స్థిరాస్తి పై కాలమ్ నెం.K యందు తెలుపబడినవి తప్పించి మరెటువంటి ఇతర అభ్యంతరములు/క్లెయిమ్‌లు గానీ లేవు. [illegible] 1) [illegible] PNBHFL/PNBHFL [illegible] 2) [illegible] 3) సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యందలి రూల్ 9(3) [illegible] 25% [illegible] 9(2) [illegible] 75% [illegible] 15 రోజులలోగా [illegible] 4) ఇట్టి ఇ-వేలం ద్వారా అమ్మకం చేయడంలో తన కార్పొరేట్ కార్యాలయం ప్లాట్ నం.68, 3వ అంతస్తు, సెక్టార్-44, గురుగ్రామ్, హర్యానా 122003 యందు గల M/s. C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధీకృత అధికారికి సహాయం చేస్తుంది. వెబ్‌సైట్ www.bankeauction.com [illegible] PNBHFL యొక్క అధీకృత అధికారి అయిన శ్రీ విజయ్ సుబ్రహ్మణ్యం/తరుణ్ రెడ్డి/శ్రీ రాజేందర్, మొబైల్: 7428193765/9392320800/9885418901, ఇ-మెయిల్: auction@pnbhousing.com లేదా www.pnbhousing.com సంప్రదించగలరు.

ప్రదేశము : రోప్స్ _రాజమండ్రి, రోప్స్ _కాకినాడ, తేదీ: 11.08.2026 సం/- అధీకృత అధికారి, M/s PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్


# కన్నబిడ్డను కోల్పోవడం తల్లిదండ్రులకు తీరని వేదన

**• విజయవాడ ట్రాఫిక్ డిసిపి షిరీన్ బేగంను ఓదార్చి ధైర్యం చెప్పిన హోంమంత్రి వంగలపూడి అనిత**



**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు జిల్లా ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం కుమార్తె అఫీఫా (24) అకాల మరణం చెందడం అత్యంత విషాదకరమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం విజయవాడలోని ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం నివాసానికి వెళ్లిన హోంమంత్రి అనిత ఆమెను, కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించారు. కన్నబిడ్డను కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్న షిరీన్ బేగంను ఓదార్చి ధైర్యం చెప్పారు. చీరాల బీచ్‌కు వెళ్తున్న సమయంలో ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అఫీఫా ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచివేసిందని హోంమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. 24 ఏళ్ల చిన్న వయసులోనే నిండు జీవితం ముగియడం అత్యంత బాధాకరమన్నారు. కన్నబిడ్డను కోల్పోవడం ఏ తల్లిదండ్రులకైనా తీరని వేదనని పేర్కొన్నారు.. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న హోంమంత్రి, ప్రమాదంలో గాయపడిన వారి వివరాలపై కూడా ఆరా తీశారు. ఈ విషాద సమయంలో షిరీన్ బేగం, ఆమె కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని కోరారు.

వార్త


ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.

- బెర్ట్రండ్ రస్సెల్

# 'సర్'కి హంసపాదులెన్నో !

ఎందుకో ఏమోకానీ ఏ ముహూర్తాన సర్ ప్రారంభించారో గానీ ఆది నుంచి అన్నీ హంసపాదులతోనే నడుస్తోంది. తాజాగా తెలంగాణలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ గడువు ముగిసింది. ఆఖరి క్షణాల్లో కూడా ఆదరాబాదరాగా తమ ఓటు ఉందో లేదో చూసుకోవడం 'సర్'కి అవసరమైన పత్రాలు చూపే పనిలో ఓటర్లంతా అప్రమత్తం కావడం విశేషం. అయినా తెలంగాణలో కోటి 31 లక్షల వయోజనుల ఓటు హక్కు అనిశ్చితిలో నెట్టబడిందన్న ఆరోపణలు నడుస్తున్నాయి. చాలా రాష్ట్రాలతో పోల్చి చూస్తే 'అనామలీస్' లెక్కల జాబితాలో దాదాపు 73 లక్షల ఓట్లు ఉండి ఉంటాయన్న అంచనా. వీరిలో చనిపోయినవారి ఓట్లు తొలగింపు, రెండేసి చోట్ల ఒకే వ్యక్తికి ఓటుహక్కు లభించగా వాటిలో ఒక దానిని తొలగించే విషయంలో బిఎల్ఓల యంత్రాంగం చేసిన ప్రయత్నాలు సానుకూల పడకపోవడంతో అన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి. తెలంగాణలో మొత్తం 3.38 లక్షల పైబడి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తే వాటిలో చాలా ఫారాలు డిజిటలైజేషన్‌కు చేరలేదు. వివిధ రాజకీయ పార్టీలు తమ యంత్రాంగాన్ని సిద్ధం చేసినా ఓటర్ల జాబితాలో తొలగింపులు సమంజసంగా ఉన్నాయా? లేదో ప్రక్రియలో ముందడుగు వేయలేకపోయారు. ఈ రాష్ట్రంలో మొత్తం ఓటర్లలో వివరాల సరిపోల్చుకోలేని పరిస్థితులలో కొన్ని పోతే రేపు ఎన్నికల సమయంలో 'పోలింగ్ బూత్' వరకు ఎంత మంది వస్తారు? ఎందరు సెలెక్ట్ ఓటర్లుంటారు. ఏ పార్టీని ఎన్నుకోవాలని ఆకాంక్షిస్తారో ఇవన్నీ లెక్కలేసుకుంటే అన్నిటి కన్నా ప్రధాన రాజకీయ పార్టీలకే సమస్యలు మెడకు చుట్టుకుంటాయి. ఈ నెల 17న మునిసిపల్ ఓటరు జాబితాను ప్రకటించగానే ఓటు హక్కు పునరుద్ధరణ, పునర్విచారణలో వాటిలో కొన్ని తిరిగి జాబితాలో సర్దుబాటవుతాయి. తమ వివరాలతో మరోసారి ఎన్నికల కమిషన్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిని కలిస్తేనే ఓటు హక్కు నిలిచే అవకాశం ఉంది. ఈ విషయంలో ఎంత మంది శ్రద్ధ వహిస్తారో ఎవరికీ అర్థంకాదు. మునిసిపల్ జాబితా ప్రకటనలోగానే ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేసుకునే ప్రక్రియలో అధికార పార్టీ ముందుంది. ఎన్నికలవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించడం మంచిదే కానీ అనాలోచితంగా పెట్టిన షరతులు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తడమే ఆక్షేపణీయం. ఉనికి దొరకని ఓటర్ల పేరుతో దొంగ ఓటర్ల జమానాకు అవకాశమివ్వకుండా వాళ్ల పేర్ల తొలగించడం ఎంత ముఖ్యమో నిజమైన ఓటు హక్కును కాపాడడమూ అంతే ముఖ్యం. ఓటర్ల జాబితాలో లోపాలను గుర్తించడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమే కానీ ప్రతి తొలగింపును రాజకీయ ఆరోపణలకు ఆస్కారంగా తీసుకోవడం పార్టీలకు అంత మంచిది కాదు. కానీ 'సర్' ప్రక్రియ మొదలైనప్పట్నించి అన్ని రాష్ట్రాల్లోనూ ఈ ప్రక్రియపై అనుమాన బీజాలు మొలకెత్తాయి. అందుకే 'సర్' ప్రక్రియ అసాంతం తప్పులతడకగా భావించే ఆస్కారం కలిగింది. దానికితోడు కారణాలేమైనా భారీ ఎత్తున తెలంగాణలో ఓటు హక్కు సంఖ్య తగ్గడంతో రాజకీయ పార్టీల్లో అలజడి రేగింది. జంటనగరాల్లో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ఇప్పటిదాకా 56.3శాతంమాత్రమే ఉంది. దాంతో విద్యావంతులకు చెందిన ఎన్నో ఓట్లు తొలగించబడినట్లుగా నిర్ధారణ జరగడంతో ఎక్కడో ఏదో తేడా ఉన్నట్లు గోచరిస్తోంది. ఇలాంటి సమస్యలు పరిష్కరించి అందరికీ ఓటు హక్కు కల్పించాలి. ఓటు హక్కు లేదని బాధపడే వారుండకూడదు. అనే లక్ష్యంతో ముందుకు నడిచినప్పుడు కొన్ని సాధక బాధకాలుంటాయి. తెలంగాణకు సంబంధించి హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో వలస జనాభా ఎక్కువ. సమస్యకు మూలం ప్రధానంగా 2002 నాటి ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకోవడమే కాగా 'సర్' ఉద్దేశం. నిజమైన ఓటర్లను తొలగించడం కాదు. జాబితాను ప్రక్షాళించడమేనని ఒకటికి పదిసార్లు విన్నవించుకున్నా జాబితా ప్రక్షాళన మరింత సంక్లిష్టం అయిపోతోందనే సంశయానికి దగ్గరలో వరకు తీసుకెళ్లింది. తాజా విషయాల్లోకెళ్తే హైదరాబాద్‌లో 45 శాతం మాత్రమే మ్యాపింగ్ జరిగింది. ఈ కారణాల రీత్యా హైదరాబాద్‌లో ఓటరు జాబితాలో సవరణలు ఎంత గ్యాప్ ఉందో తెలుసుకోవచ్చు. డ్రాఫ్ట్‌జాబితా తర్వాత ప్రభుత్వం మరిన్నిజాగ్రత్తలు తీసుకోవాలి.ఆధార్, ఫోన్ నంబరు ద్వారా కూడా ఓటర్ల ధ్రువీకరణ విధానాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రక్రియలో మరిన్ని సహకార కేంద్రాలు ఏర్పాటు కూడా అవసరం. మూడో దశలో 16 రాష్ట్రాలు,3 కేంద్రపాలిత ప్రాంతాల్లో 'సర్' ప్రక్రియ కొనసాగుతోంది. ఇంతకు పూర్వమే జరిగిన రెండో దశ 10 రాష్ట్రాల్లో, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లో 5.72 కోట్ల పేర్లు జాబితా నుంచి తొలగించారు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 2.05 కోట్ల ఆంధ్రప్రదేశ్‌లో మూడో దశలో 44.89లక్షల ఐదారు కోట్ల ఓట్లు తొలగింపు ప్రధానంగా జరిగింది. వీటికి లెక్కావ్యత్యాసాలుండవని చెప్పలేం కానీ ఎవరికి కొత్తగా ఓటుహక్కు కల్పించబడిందో ఎవరికి ఆ హక్కు తొలగించబడిందో తెలియని గందరగోళ పరిస్థితిఏర్పడింది. ఈరాష్ట్రంలో దాదాపు 44.89 లక్షలమేరకు ఉంది. ఇకపై క్లెయిమ్‌లు, అభ్యంతరాల ప్రక్రియ ఉండిపోరాని ప్రజాస్వామ్య హక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగింపులకు గురవరాదు. తెలంగాణలో ఓటర్ల వద్ద నుంచి సేకరించిన 78.26శాతం ఎన్యూమరేషన్ ఫారాల సమీక్ష, ఇంకా వారి నుంచి సేకరించలేకపోయిన 22 శాతం ఫారాలను కూడా విస్తృత తనిఖీ. సేకరణ సమీక్ష ప్రాతిపదికన వారి హక్కులు తేల్చగలిగితేనే ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం గండం గడిచి మెట్లెక్కుతుంది. దాదాపు ఐదో వంతు ఓటర్ల పేర్లు తుది జాబితా నుంచి తొలగించే ప్రమాదం నుంచి కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషనదే.

మిమ్మల్ని ప్రతిదానికీ పొగిడేవాడు మీకో రహస్య శత్రువని గమనించాలి.



అరిస్టాటిల్

వినపడనివారు కాదు, మంచి మాట వినిపించుకోనివారు నిజమైన బధిరులు.



డబ్ల్యు.ఎమర్సన్

# కొత్త ఒడంబడికలతో మరిన్ని సంఘర్షణలు!

*ప్రస్తుత కాలంలో ఒడంబడికలు కుదరట మనేది మేలు చేకూరుస్తుందని ఏ దేశమూ నమ్మే పరిస్థితిలో లేదు!కాలమే ఈ ఒడంబడికల కాలం ఇంకా చెల్లుబాటు అవుతుందా అన్న సందేహాన్ని తీర్చగలదు. కృత్రిమ మేథ తెర మీదికి వచ్చిన నేపథ్యంలో సాంప్రదాయ రీతుల్లో యుద్ధాలను కొనసాగించే స్థితి కనుమరగవుతున్నది. ప్రస్తుతం వున్న సంఘర్షణల్లోంచి ఇలాంటి రక్షణపరమైన ఒడంబడికలు మరిన్ని పుట్టుకొని వచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు! ఇజ్రాయిల్ అమెరికా, మొదట్లో గోటితో పోతుందనుకున్న సమస్య గొడ్డలిదాకా రావటం అందర్నీ ఆశ్చర్యపరుస్తునే వుంది! అయితే సాంకేతికంగా వృద్ధి పొందుతూ ఎ.ఐ ని అనుకూలంగా ఉపయోగించు కొనేందుకు సిద్ధపడుతున్న దేశాలు ఎలాంటి విపరీత పరిణామాలకు దారితీసే విధంగా ప్రవర్తిస్తాయో వేచి చూడాల్సిందే!*



రావులపాటి సీతారాంరావు

వెస్ట్ ఆసియా దేశాలు పాకిస్థాన్లో మక్కాలో చేసుకున్న ఒడంబడిక ఒక విధంగా అమెరికా ఇజ్రాయిల్ దేశాలకు అనుకూలంగా ఇరాన్ యుద్ధ నైపుణ్యాన్ని నియంత్రించటానికి అమెరికా పన్నిన ఎత్తుగడా అని అంతర్జాతీయ విశ్లేషకులు సందేహిస్తున్నారు! ఒక్క పాకిస్థాన్ దేశానికే అణ్వాయుధాలు వున్నాయి! వెస్ట్ ఆసియాలోని సౌత్ అరేబియా, టర్కీ దేశాలలో అమెరికా యుద్ధ స్థావరాలను ఎన్నో సంవత్సరాల క్రింద ఏర్పరుచుకొని ప్రపంచదేశాల నాయకత్వాన్ని పదిలంగా ఉంచుకోటానికి నాటో సియస్ సంస్థలను స్థాపించి సోవియట్ రష్యా, చైనాలను అదుపులో ఉంచేందుకు వేసిన ప్రణాళికలో భాగమని అందరికీతెలుసు! అప్పట్లో అలీన విధానాన్ని రూపొందించి ఇండియా ముస్లిం దేశాలతో మరికొన్ని దేశాలకు నాయకత్వం వహించి తటస్థంగా వుండటం ఎంత మంచిదో తర్వాత కాలాల వారికి తెలిసింది! యు.యన్.ఓ ఈ రాజకీయ సమీకరణకు కాస్తఊతం ఇచ్చినట్లయితే యు.యన్.ఓ స్థాపనకు ఒక అర్థమూ ప్రయోజనమూ సమకూరేది! దురదృష్టవశాత్తు అది జరగక పోవటం వల్ల ప్రపంచ దేశాల మధ్య వచ్చే గొడవలకు ఎంపైర్ లేకుండా పోయినట్లయింది! యు.యన్. ఓ ఎంపైరింగ్‌జాబ్ వదిలేసి 'సైలెంట్ స్పెక్టేటర్'గా మారింది! అందువల్లే ఏ అంతర్జాతీయ సమస్య అయినా, సంఘర్షణలు ఐనా పరిష్కారం లేకుండా ఏళ్ల తరబడి ఇబ్బందులను కలిగిస్తూనే ఉన్నాయి! ఆగస్టు 7న జరిగిన ఈ మక్కా ఒడంబడిక, ఒక విధంగా ఇరాన్‌ను నిలువరించే శక్తియుక్తులు క్రమేపీ కరిగిపోవటంతో, యు.యస్.ఏ ఈ కొత్త ప్రణాళికకు తెరదీసిందా అన్న అనుమానం సామాన్యులకు గూడా కలుగుతున్నది! ఈ మూడు దేశాలు 'జాయింట్ సెక్యూరిటీ' పేరుతో చేసుకున్న ఈ అగ్రిమెంట్ ఈ మూడు దేశాలలోని ఏ ఒక్క దేశంపై మరో దేశం దాడిచేయ ప్రయత్నించినా మిగతా రెండు దేశాలు తమ దేశాల మీద దాడిగానే భావించి సమిష్టి రక్షణలో భాగంగా దాడిచేసిన దేశం కానీ దేశాలను కాని, నిలవరించి, దాడులను త్రిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపేందుకే ఈ 'ఒడంబడిక' పనికి వస్తుంది! నాటో అంతరించిన నేపథ్యంలో ఈ సమిష్టి రక్షణ ఒడంబడికలు ఎంతవరకు ఉపయోగపడ్తాయో అప్పుడే చెప్పటం కష్టం కానీ అణ్వాయుధాలతో డ్రోన్‌లతో నవ్యతతో కూడుకున్న సాంకేతిక పరిజ్ఞానంతో అన్నిటినీ మించి ప్రస్తుతం వరంగా వెలిసిన 'కృత్రిమ మేథ' (ఎ.ఐ) ఆయుధంతో, ఇలాంటి రక్షణ ఒడంబడికలు నామమాత్రంగానే మిగులుతాయేమో! పాకిస్థాన్ ఇండియాతో వున్న పరిస్థితులను ఎదుర్కోటానికి, పి.ఒ.కే (పాకిస్థాన్ ఆక్యుపైడ్ కాశ్మీర్)ను నియంత్రించటానికి, బెలూచిస్థాన్ రెబెలియన్ తట్టుకోలేక ఈ ఒడంబడికకు సిద్ధపడిందా అన్న అనుమానం కూడా యుద్ధ నిపుణులకు కలుగుతున్నది! నిన్న మొన్నటిదాకా, అమెరికా సందిట చేరి, ఇరాన్ ఇజ్రాయిల్ దేశాల మధ్య మధ్యవర్తిత్వం నెరిపిన పాకిస్థాన్, అమెరికా, ఇరాన్‌ను పూర్తిస్థాయిలో ఎదుర్కోలేని దశలో, ఈ కొత్త పాచికకు తెరతీసినట్లుంది! హార్ముజ్ జలసంధి ద్వారా తమకు సంబంధించిన చమురు నౌకలను క్షేమంగా తమ తీరాలకు చేరాలనుకున్న పాకిస్థాన్‌కు ఇరాన్ స్పష్టంగా పాక్ నౌకలను అనుమతించమని తేల్చి చెప్పటంతో విధిలేని పరిస్థితులలో ఈనిర్ణయం తీసుకోవల్సి వచ్చినట్లుంది! ఇరాన్, పాక్ దేశాల మధ్య షియా, సున్నీ



మతపరమైన గొడవలు అనాది నుంచీ వున్నాయి! పైపైన కనపర్చిన స్నేహ సంబంధాలు ఈమధ్య కాలంలో ఏర్పడిన మార్పుల వల్ల బహిరంగంగా వదులుకోక తప్పటం లేదు! ఇండియా, చైనా దేశాలకు ఇరాన్ ఆయిల్ షిప్ల అనుమతిస్తున్నట్లు ప్రకటించటంతో ఇరాన్‌తో వున్న సంబంధం పూర్తిగా తెగినట్లయింది! అమెరికా వెస్ట్ ఏషియా ఇజ్రాయిల్‌దేశాల సమిష్టి బలాలకు ధీటుగా ఇండియా, రష్యా చైనా తమ స్నేహ సంబంధాలను మరింతగా మెరుగుపర్చుకున్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. బహుశా రానున్న కాలంలో అదే జరగొచ్చు! మాటిమాటికి ట్రంప్ ఉపయోగిస్తున్న 'శాంక్షన్స్' ఆయుధం వాడితగ్గిపోయింది! ఈమూడు దేశాలు అమెరికా డాలర్ విలువను తగ్గించటానికి తమ కరెన్సీ తమ తమ దేశాలలో చెల్లేట్లు చేసుకొని డాలర్‌ను బలహీనపర్చేందుకు చేసిన ఆలోచన ఇతర దేశాలు ముఖ్యంగా యూరోపియన్ స్కాండినేవియన్ దేశాలను కూడా కలవరపరుస్తున్నది! ఫ్రాన్స్,అమెరికా దేశాలు దూరమవుతున్న సంకేతాలు ఈ మధ్య ఇరు దేశాల నేతల మధ్య జరిగిన గొడవ స్పష్టపరుస్తున్నది! ఇదివరకు జరిగిన అంతర్జాతీయ ఒడంబడికలు రెండు బలమైన దేశాలు అమెరికా, రష్యాల నాయకత్వాన్ని ప్రోత్సహించేం దుకు, బలపర్చేందుకు ఏర్పడినవే! ఇప్పుడు కాలం మారింది! ప్రాంతీయంగా బలంగా వున్న దేశాలు, తమ తమ బలాలను పెద్ద దేశాలకు ధీటుగా తమ స్వీయ రక్షణకు ఏర్పరుచుకొనేందుకు సిద్ధంగా వున్నట్లు ఈ 'మక్కా ఒడంబడిక' బహిర్గత పరుస్తున్న మాట నిజం! అమెరికా దేశంలో అన్ని రకాల ఆయుధాలు ఈ మధ్య ఇరాన్‌తో జరిగిన యుద్ధంలో ఉపయోగించటం వల్ల వాటి నిలవల సంఖ్య బాగా తగ్గిపోయి ఆయుధాలు ఉత్పత్తి చేసే కార్ఖానాలు, కొత్త సామాగ్రిని అందుబాటులో ఉంచితేనే ఇజ్రాయిల్‌కు మరింత వత్తాసు పలికే అవకాశం ఉంది. అందుకే ప్రెసిడెంట్ ట్రంప్ రోజుకోమాట చెప్తూ చర్చలు సాగుతున్నాయనే అభిప్రాయం కలగచేసే పనిలో ఉన్నారు. అది ఒక విధంగా అమెరికా బలహీనతను ప్రతిబింబిస్తున్నది. నిజానికి ఈ డిఫెన్స్ డీల్ దాదాపు నెల క్రితమే డీల్ మీద సంతకం చేసిన దేశాలు భయంతో ఉండటంతో హడావిడిగా ఈ డీల్ కుదుర్చుకున్నారు. ఇరాన్ మీద దాడి ఇంకా ఒక పరిష్కారానికి రాకపోవటం వెస్ట్ ఏషియా దేశాలకు పెద్ద దెబ్బే! అన్ని అరబ్ గల్ఫ్ దేశాలు ఇరాన్ దాడుల వల్ల ఒత్తిడిని ఎదుర్కోలేని స్థితిలో ఉన్నాయి. ఇరాన్‌తో సంబంధం ఉన్న హౌతీస్ (అన్సరన అల్లా) గత నెలలో సౌదీ ఆయిల్ వనరుల మీద దాడి చేసి రెడ్ సీపోర్టుల మీద బ్లాకేడ్ విధించటం వల్ల కోలుకోలేని దెబ్బకు ఈ దేశాలు గురి అయ్యాయి. ఆయిల్ సరఫరా ఆగిపోయే స్థితి వచ్చింది. ఈ డీల్ వల్ల సౌదీ అరేబియాకు రక్షణ కలిగే అవకాశం లేదని ఇరాన్ అధికార ప్రతినిధి బాహాటంగా చెప్పటం ప్రస్తుతం అమెరికా వత్తాసు పలుకుతున్న వెస్ట్ ఏషియా దేశాలు ఎంతటి క్లిష్టస్థితిలో ఉన్నాయో చెప్పకనే చెప్పినట్లయింది. పాకిస్థాన్ ఈ డీల్‌లో ఉండటం వల్ల ఒడంబడిక నమ్మశక్యంగా కనపడటం లేదు. ఎందుకంటే సెక్యూరిటీ పార్టనర్‌గా మక్కా డీల్‌లో సంతకం చేసి మీడియేటర్‌గా ఇరాన్ యుద్ధంలో ఉండటం వల్ల ఈ ఒడంబడిక ఒక కొలిక్కి వచ్చేట్లు లేదని విదేశాంగ విజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. ఏ ఒడంబడిక అయినా సంఘర్షణలు ప్రారంభమయితే ఆపలేదన్నది చరిత్ర చెప్పకనే చెబుతున్నది. కేవలం ఇలాంటి ఒడంబడికలు మేమూ యుద్ధానికి 'సై' అంటున్నాం అని గంభీరంగా సంకేతాలు ఇవ్వటానికే పనికివస్తాయి! ప్రస్తుత కాలంలో ఒడంబడికలు కుదరట మనేది మేలు చేకూరుస్తుందని ఏ దేశమూ నమ్మే పరిస్థితిలో లేదు!కాలమే ఈ ఒడంబడికల కాలం ఇంకా చెల్లుబాటు అవుతుందా అన్న సందేహాన్ని తీర్చగలదు. కృత్రిమ మేథ తెర మీదికి వచ్చిన నేపథ్యంలో సాంప్రదాయ రీతుల్లో యుద్ధాలను కొనసాగించే స్థితి కనుమరగవుతున్నది.ప్రస్తుతం వున్న సంఘర్షణల్లోంచి ఇలాంటి రక్షణపరమైన ఒడంబడికలు మరిన్ని పుట్టుకొని వచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు! ఇజ్రాయిల్ అమెరికా, మొదట్లో గోటితో పోతుందనుకున్న సమస్య గొడ్డలిదాకా రావటం అందర్నీ ఆశ్చర్యపరుస్తునే వుంది! అయితే సాంకేతికంగా వృద్ధి పొందుతూ ఎ.ఐ ని అనుకూలంగా ఉపయోగించు కొనేందుకు సిద్ధపడుతున్న దేశాలు ఎలాంటి విపరీత పరిణామాలకు దారితీసే విధంగా ప్రవర్తిస్తాయో వేచి చూడాల్సిందే! ●

# మత్స్యకారుల భద్రతకు ఏదీ భరోసా?

కామిడి సతీష్ రెడ్డి

కొందరు మత్స్యకారులు లైసెన్స్, రిజిస్ట్రేషన్లు వంటివి సరిగా లేకుండానే చేపల వేటకు వెళుతూఉన్నారు. బైక్, కారు, లారీ ఇలా వాహనం ఏదైనా నడపాలంటే లైసెన్స్ ఉండాలి. టూ వీలర్ అయితే హెల్మెట్ ధరించాలి. కారు నడిపితే సీటు బెల్ట్ పెట్టుకోవాలి. ప్రమాదం జరిగితే ఆర్థికంగా నష్టపోకుండా తప్పనిసరిగా బీమా తీసుకోవాలి. వీటిలో ఏది లేకపోయినా అధికారులు జరిమానా వేస్తారు. ఇందుకోసం రహదారులపై ఎక్కడికక్కడ పోలీసులు కాపు కాసి తనిఖీలు చేస్తుంటారు. మరి సముద్రంలో చేపల వేటకు వెళ్లే సమయంలో బోటు యజమానులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?,వాటిని పాటిస్తున్నారా?, లేదా? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.విశాఖ జిల్లా గంగవరం పోర్టు సమీపాన ఈ నెల మొదటి వారంలో బోటు మునిగిపోయి ఆరుగురు మత్స్యకారులు మరణించారు. బోటు యజమాని ఒక్కడే బతికి బయటపడ్డాడు. ప్రభుత్వం తనకు ఏమీ సాయం చేయలేదని, చనిపోయిన కుటుంబాలకే రూ.10 లక్షల నష్టపరిహారం ఇచ్చిందని వాపోతున్నారు. నిన్నటికి నిన్న ఓ బోటు బ్రేక్ వాటర్స్ సమీపాన బోల్తాపడింది. ఇద్దరు గాయపడ్డారు. తమకు బోటుకు రూ.2 లక్షలు, వలకు రూ.2.5 లక్షల నష్టం జరిగిందని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ మెరైన్ ఫిషింగ్ రెగ్యులేషన్ (ఏపీఎంఎఫ్ఆర్) చట్టం ప్రకారం సముద్రంలో చేపల వేటకు వెళ్లే ప్రతి బోటు తప్పనిసరిగా మత్స్య శాఖ అధికారుల వద్ద రిజిస్టర్ చేసుకోవాలి. లైసెన్స్ తీసుకోవాలి. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.25 మాత్రమే. లైసెన్స్ ఫీజు రూ. 50. నిబంధనల ప్రకారం రెన్యువల్ చేయించుకోవాలి. వేటకు వెళ్లే ప్రతిసారి ముందుగా సమీపంలోని సాగర మిత్రకు సమాచారం ఇవ్వాలి. ఏ బోటు వేటకు వెళుతుంది?,ఎంతమంది (పేర్లతో సహా) వెళుతున్నారు?, ఏ దిక్కున వెళుతున్నారు?, ఎంత ఆయిల్ పోయించుకొని వెళుతున్నారు? అనే వివరాలు అందించాలి.వేటకు వెళ్లే బోటు ఫిట్‌గా ఉందని సర్టిఫై చేయించుకోవాలి. ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, సర్వేయర్ సంయుక్తంగా బోటునుతనిఖీ చేసి, బాగుందని, వేటకు అనువైనదని, అందులో అన్నీ ఉన్నాయని సర్టిఫై చేస్తేనే రెన్యువల్ చేస్తారు. అప్పుడే అది వేటకు వెళ్లాలి. ప్రతి బోటులో ఎంత మంది ఉంటే అంత మందికి ప్రమాదంలో ఉపకరించే లైఫ్‌జాకెట్లు, అగ్నిప్రమాదం సంభవిస్తే నివారించడానికి ఫైర్‌ఫైటింగ్ ఎక్విప్‌మెంట్, బీమా పత్రాలు ఉండాలి. విశాఖపట్నంలో లక్ష రూపాయల నుంచి రూ.50 లక్షల వరకు ఖరీదు చేసే బోట్లు చేపల వేటకు వెళుతున్నాయి. చాలామంది పాత బోట్లను కేరళ, తమిళనాడు ప్రాంతాల నుంచి తీసుకువచ్చి ఇక్కడ వేటకు ఉపయోగిస్తున్నారు. ఇక్కడ రిజిస్ట్రేషన్ చేయించడం లేదు. రోడ్లపై వాహనాలను తనిఖీ చేసినట్టు హార్బర్‌లో బోట్లను ఎవరూ తనిఖీ చేయడం లేదు.అక్కడ కూడా రాజకీయాలు నడుస్తున్నాయి. సంఘాల నాయకులు తనిఖీలుజరగకుండా అడ్డుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. తోటి మత్స్యకారులకు ప్రాణాపాయం అని తెలిసినా అధికారులకు సహకరించడం లేదని ఈత వచ్చునని, గంగమ్మ ఒడిలో పెరిగామని, ఏ నష్టం జరగదని సమర్థించుకుంటున్నారు. బీమా చేయించుకున్నప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే కంపెనీయే నష్టపరిహారం ఇస్తుంది. ఆ దిశగా కూడా వారికి హితబోధ చేయడం లేదు. ఇకనైనా బోటుయజమానులు నిబంధనలు పాటించేలా చూడాలి. మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు లేకుండా, బీమా చేయ కుండా సముద్రంలోకి పంపించే బోట్ల యజమానులపై క్రిమినల్ కేసులు పెడితే ప్రమాదాలూ తగ్గుముఖం పడతాయి. ప్రాణనష్టం తగ్గుతుంది.బోటు ఖరీదు రూ.లక్ష అయినా రూ.1.2 లక్ష సాయం మత్స్యకారులపట్ల కూటమి ప్రభుత్వం చాలా ఉదారంగా వ్యవహరిస్తోంది. లక్ష రూపాయల ఖరీదు చేసే బోటు అయినా సరే చేపల వేట నిషేధ సమయంలో బోటుకు ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున రూ.1.2లక్షల ఆర్థికసాయం చేస్తోంది. చేపల వేటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అధికారులు ప్రతి బోటును తనికీ చేయాలి. బోట్ డ్రైవర్స్ మద్యం సేవించి బోట్స్ నడపకుండా తగిన చర్యలు తీసుకోవాలి. కాలం చెల్లిన బోట్లను సముద్రంలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ●

# ప్రజావాక్కు

## కల్తీ నూనెలతో కేన్సర్

మననగరాలు,పట్టణాలలో హోటళ్ళుఅనేకంగా ఉన్నాయి. ఈ హోటళ్ళలో వంటలకు, మిఠాయిలకు, తిను బండారా తయారీకివాడే వంటనూనెలను ఒకసారికంటే ఎక్కువ సార్లు వాడటంతో ప్రజలు క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులకు గురిఅవుతున్నారు. వాడిన వంటనూనెను పదే పదే వాడటం నిషేధంఅయినా అనేక హోటళ్ళ యజమానులు పట్టించుకోవటం లేదు. అయితే దీనికో పరిష్కారం ఉంది. వాడేసిన వంటనూనెలను ప్రాసెస్ చేసి బయోడీజిల్ తయారీకి ఉపయోగించుకోవచ్చు. ఇప్పుడు మన దేశంలో అనేకపట్టణాలు,నగరాలలో హోటళ్ళవారి నుంచి వాడేసిన వంట నూనెలను సేకరిస్తున్నారు. దీనివల్ల హోటళ్ళ వారికి రాబడేకాకప్రజల ఆరోగ్యాలు కాపాడబడతాయి. శిలాజ ఇంధనాల కంటే బయోడీజిల్ ఉత్తమం. ఆహార భద్రతాధికారులు ఈ విషయమై లోతుగా ఆలోచించి ఒక ప్రణాళిక రూపొందించాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## శిక్షణా సదుపాయాలు కల్పించాలి

గ్లాస్గోలో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్ 13 స్వర్ణాలతో సహా మొత్తం 39 పతకాలు సాధించి నాలుగో స్థానంలో నిలవడందేశ క్రీడారంగానికి ప్రోత్సాహకరమైన పరిణామం.ఈవిజయం యాదృచ్ఛికంగా రాలేదు. సరైన ప్రణాళిక,మెరుగైన కోచింగ్, ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యం, ఆధునిక శిక్షణా కేంద్రాలు, క్రీడాకారుల నిరంతర శ్రమకలిసి ఈ ఫలితాన్ని అందించాయి. ఇది భారత క్రీడా విధానానికి కొత్తదిశనుసూచిస్తోంది.భారత్ ఇంకా ప్రపంచ క్రీడా శక్తిగా ఎదగాలంటే భారీ క్రీడా ఈవెంట్ల నిర్వహణ కంటే క్రీడాకారుల అభివృద్ధికే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచస్థాయి స్టేడియాలు నిర్మించడం అవసరమే అయినప్పటికీ, వాటిని వినియోగించే ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దడం మరింత ముఖ్యమైనది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## జీవితం శాశ్వతం కాదు

ఈ బాహ్య ప్రపంచంలో సాధారణ మానవుని జీవితం ఎప్పుడూ ఎలా నిర్జీవంగా మారుతుందో అంచనా వేయలేం. అందుకే ప్రతిక్షణం కుటుంబ సభ్యులతో, సన్నిహితులతో ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతూ జీవన విధానాన్ని ముందుకు సాగించాలి. ఆరోగ్యానికి ఎక్కువ సమయం కేటాయించాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## వాన నీటిని ఒడిసి పడదాం

ప్రకృతి మనకు అందించే అమూల్యమైన వరం వాన నీరు. ఇంటి పరిసరాల్లో చిన్న ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని వాన నీటిని నిల్వ చెయ్యాలి. ఇలా చేయడం వల్లవర్షపు నీరు వృథాగా ప్రవహించకుండా భూమిలోకి ఇంకి భూగర్భ జలాల పెరుగుదలకు తోడ్పడుతుంది. ప్రతి ఇంట్లోనూ సాధ్యమైనంత మేరకు వాననీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. నీటి కొరతను ఎదుర్కోవాలంటే ఇప్పటి నుంచే నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలి. నీరు లేకుండా జీవనం సాధ్యం కాదు కాబట్టి, వాన నీటిలో ప్రతి చుక్కను విలువైనదిగా భావించి సంరక్షించాలి.నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించడం కూడా ప్రతిపౌరుడి బాధ్యత. మనం కాపాడే ప్రతినీటిచుక్క భవిష్యత్తు తరాలకు ఎంతోవిలువైన సంపదగా మారుతుంది. వాననీటిని ఒడిసి పట్టి, భరోసా కల్పిద్దాం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## విశ్వాస ఘాతుకులదే రాజ్యం

వీరిని నేనెందుకు పోషించాలి, వీరిభారం నేనెందుకు మోయాలి, వీరి కోసం నా డబ్బు ఎందుకు ఖర్చు చేయాలి అనుకునే పుత్రరత్నాలు తల్లిదండ్రులనువృద్ధాశ్రమాలకు తరలిస్తున్నారు. అది కూడా దండగ అనుకునే ప్రబుద్ధులు నడిరోడ్డుమీద వదిలిపెట్టిపోతున్నారు. కొందరు మంచి వాళ్లు తల్లిదండ్రులపై ప్రేమగౌరవం ఉన్నవారుకూడా పెళ్లికాగానే మారిపోతున్నారు. భార్య చెప్పే మాటలు విని తల్లిదండ్రులను చూడ్డం మానేస్తున్నారు. వారిలానే ఈ మధ్య కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థబుద్ధిని చూపుతున్నారు. అధికారం ఉన్నన్ని రోజులు ఒకపార్టీలో ఉండి పదవులు అనుభవించి ఆ పార్టీ అధికారం కోల్పోగానే పార్టీకి ద్రోహం చేస్తున్నారు.

- రాశి, హైదరాబాద్

## ఉపాధి హామీలో ప్రత్యామ్నాయ పంటలు

పంటల వైవిధ్యం గురించి ఇప్పటి ఎల్‌నీనో ప్రభావం గురించి రాష్ట్రాలు మాట్లాడుతూనే ఉన్నాయి. అయితే క్షేత్ర స్థాయిలో తిరిగినప్పుడు పంటల వైవిధ్యానికి రైతులు కొన్ని ప్రయత్నాల ద్వారా ముందుకు వస్తున్నా ప్రభుత్వ సబ్సిడీల గురించి వారు అడుగుతున్నారు. మాఖన అని బీహార్ హర్యానలో పండే పంట ఈ పంట పండించడానికి అణువైన పరిస్థితులు తెలంగాణలో కూడాఉంది. తెలంగాణ ఫారం పొండ్స్ కుంటలు చెరువులు ఆ మాఖానా సాగుకు అనువుగా ఉన్న పరిస్థితులు. కావున ఒక పంటకు ఉపాధి హామీలో కొంత మెయింటనెయన్స్ ఇస్తే రైతులు ముందుకు వస్తారు.

-భారత అవినాష్, జనగామ

# తలసరి ఆదాయంలో ముందుకు, పెట్టుబడుల్లో వెనుకకు



డాక్టర్ తిరునహరి శేషు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన ఈ 12 వసంతాల తన ప్రయాణంలో అనేక మైలురాళ్లను చేరుకుంటూ దేశంలోని పెద్ద రాష్ట్రాలతో పోటీపడుతూ అనేక ఆర్థికాభివృద్ధి సూచికలలో తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటుంది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఫ్రంట్ రన్నర్ స్టేట్‌గా తెలంగాణ దేశంలో 11వ స్థానంలో పెట్టుబడులకు అనువైన రాష్ట్రాల జాబితాలో 13వ స్థానంలో నిలిచిందని నీతి ఆయోగ్, అలాగే తలసరి జిఎన్ఐలో మూడవ స్థానం దక్కించుకుందని ప్రపంచ బ్యాంక్ తన నివేదికలలో వెల్లడి చేసింది. ఒక అస్పిరేషనల్ స్టేట్‌గా తెలంగాణ 2014 నుండి జి.ఎస్.డి.పిలోనూ తలసరి ఆదాయంలోనూ గణనీయమైన ప్రగతిని సాధించింది.5407 డాలర్ల తలసరి జిఎన్ఐతో తెలంగాణ రాష్ట్రం ఎగువ మధ్య స్థాయి ఆదాయ రాష్ట్రంగా (యుఎంఐఎస్) ఢిల్లీ కర్ణాటకల తర్వాత దేశంలోమూడవ స్థానాన్ని దక్కించుకుందని ఇటీవల ప్రపంచ బ్యాంక్ తన కంట్రీ ఇన్కమ్ క్లాసిఫికేషన్ 2026 నివేదికలో వెల్లడి చేసింది.6217 డాలర్ల తలసరి జిఎన్ఐతో ఢిల్లీ, 5579 డాలర్ల తలసరి జిఎన్ఐతో కర్ణాటక రాష్ట్రాలు దేశంలో తెలంగాణ కంటే ముందు వరుసలో నిలబడినాయి. తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు దక్షిణాది నుండి తలసరి జిఎన్ఐలో మొదటి ఐదు స్థానాలలో స్థానం దక్కించుకున్నాయి. ఆర్‌బిఐ నివేదిక ప్రకారంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను4,18,931 రూపాయల తలసరి ఆదాయంతో కర్ణాటక(4,33,326)తరువాత తెలంగాణ దేశంలో రెండవ స్థానంలో నిలిచింది. ఆర్‌బిఐ, నీతి ఆయోగ్‌ల నివేదికల ప్రకారంగా తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయంలో దేశంలో రెండు మూడు స్థానాలలో నిలవటం రాష్ట్రఆర్థిక సామర్థ్యాన్ని తెలియజేస్తుంది.తెలంగాణ రాష్ట్రానికె చెందిన రంగారెడ్డి జిల్లా 11.46 లక్షలరూపాయల తలసరి జిఎన్ఐతో దేశంలోనే మొదటి స్థానాన్ని దక్కించుకుంది. దేశంలోని ప్రఖ్యాత సంస్థలు విడుదల చేస్తున్న నివేదికల ప్రకారంగా గడిచిన 12సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయంలో గణనీయమైన వృద్ధిని సాధించినట్లుగా కనపడుతుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలు అభివృద్ధి సాధన ప్రక్రియలో భాగంగా పెట్టుబడులకి అనువైన వాతావరణాన్ని కల్పించే చర్యలు చేపడుతున్నాయి.2014 నుండి తెలంగాణ రాష్ట్రం కూడా విదేశీ, దేశీయ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల నుండి పెట్టుబడులను ఆకర్షించడానికి పెట్టుబడుల సాధన కోసం రాష్ట్రంలో అనువైన వాతా



వరణాన్ని కల్పించడానికి చర్యలు చేపడుతున్నా పెట్టుబడులకు అనువైన రాష్ట్రాల జాబితాలో తెలంగాణ రాష్ట్రం 13వ స్థానంలో నిలబడటం కొంత నిరాశపరిచిందనే చెప్పాలి. ఇటీవల నీతి ఆయోగ్ విడుదల చేసిన ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్ 2026 నివేదిక ప్రకారంగా పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉన్న 28రాష్ట్రాలు 8 కేంద్రపాలిత ప్రాంతాలలో తెలంగాణ రాష్ట్రం 13వ స్థానంలో పెద్ద రాష్ట్రాల జాబితాలో 10వ స్థానం దక్కించుకుంది. రాష్ట్ర ఏర్పాటు నుండి తెలంగాణ రాష్ట్రం కూడా పెట్టుబడిదారుల పెట్టుబడులకు రక్షణ కల్పించి పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించడానికి రాష్ట్రప్రభుత్వం టీఎస్ ఐపాస్,ఐటి,ఎంఎస్ఎం ఈ పాలసీలను రూపొందించడమే కాదు పెట్టుబడులసాధన కోసం తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047తో పాటు హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుని కూడా నిర్వహించింది. హైటెక్ సిటీ తరహాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫోర్త్ సిటీని (ఫ్యూచర్ సిటీ) నిర్మిస్తుంది. అదేవిధంగా పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి స్వయంగా దావోస్ పెట్టుబడిల సదస్సులలో పాల్గొనటంతో పాటు అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ లాంటి దేశాలలో కూడా పర్యటించారు. హైదరాబాద్ లాంటి నగరం, పారిశ్రామిక అవసరాల కోసం 30వేల హెక్టార్ల భూమి ఉన్న ఏకైక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ పెట్టుబడులకు అనువైన రాష్ట్రాల జాబితాలో 13వ స్థానంలో నిలబడటం కొంత నిరాశ కలిగించే అంశమే.పరిశ్రమలకు అనుమతులు ఇచ్చే మెకానిజంగా కాకుండా పరిశ్రమలతో కలిసి నడిచే భాగస్వామిగా ఉండాలనేది రాష్ట్ర ప్రభుత్వ దృక్పథమని ప్రభుత్వం చెబుతున్నా ఆశించిన స్థాయిలో తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులను ఆకర్షించలేకపోతుంది. పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించడంలో గుజరాత్, మహారాష్ట్ర,తమిళనాడులు మొదటి వరుసలో నిలబడటంతో ఆ రాష్ట్రాలు ఎక్కువ మొత్తంలో పెట్టుబడులను సాధించగలుగుతున్నాయి.టీఎస్ ఐపాస్ లాంటి పారిశ్రామిక విధానం,పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నప్పటికీ ఈఅంశంలో రాష్ట్రం తన పరిస్థితిని మెరుగుపరచుకోవటానికి ప్రభుత్వ సంస్థాగత విధానాలను మరింత సరళీకరిస్తూ, మౌలిక సదుపాయాలను మరింత బలపరుస్తూ, పర్యావరణ స్థిరత్వాన్ని మెరుగుపరుస్తూ, సైబర్ ఆర్థికనేరాలను నియంత్రించటం ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైనవాతావరణాన్ని కల్పిస్తే రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగి యువతకి ఉద్యోగ అవకాశాలను విస్తృత పరచగలుగుతాం, రాష్ట్ర ఆదాయాన్ని కూడా పెంచే అవకాశాలుంటాయి. రాష్ట్ర ఆదాయం,తలసరి ఆదాయం ఎంత పెరిగినా ఉపాధిరహిత వృద్ధి నిజమైన ఆర్థికాభివృద్ధిని ప్రతిబింబించదు కాబట్టి దేశంలో తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయంలో రెండవ స్థానంలో, మూడో స్థానంలో నిలిచినా ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉపాధి అవకాశాలను విస్తృత పరచకపోతే వాస్తవిక అభివృద్ధి లక్ష్యాన్ని తెలంగాణ రాష్ట్రం చేరుకోనట్లుగానే భావించాలి. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# సిరియా మాజీ అధ్యక్షుడు బషేర్ అల్ అసద్‌కు మరణశిక్ష



**డమాస్కస్, ఆగస్టు 11:** సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు అక్కడి కోర్టు మంగళవారం మరణశిక్ష విధించింది. 14 ఏళ్ల అంతర్యుద్ధం సమయంలో యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలకు పాల్పడినట్లు నిర్ధారించిన కోర్టు ఆయన పరోక్షంలోనే ఈ తీర్పు ఇచ్చింది. ఈ అంతర్యుద్ధంలో సుమారు 5 లక్షల మంది ప్రాణాలు కోల్పోయినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అసద్ సోదరుడి కుమారుడు అతెఫ్ నజీబ్‌కు కూడా కోర్టు మరణశిక్ష విధించింది. 2011లో దక్షిణ సిరియాలోని దారా ప్రావిన్స్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను అణచివేసేందుకు చేపట్టిన చర్యలకు నజీబ్ నాయకత్వం వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ చర్యలే అనంతరం తిరుగుబాటుకు, అంతర్యుద్ధానికి దారితీశాయి. తీర్పు వెలువడే సమయంలో నజీబ్ కోర్టులోనే ఉన్నాడు. అసద్ 2011లో దారా ప్రావిన్స్‌లోని పొలిటికల్ సెక్యూరిటీ బ్రాంచ్‌కు అధిపతిగా పనిచేసిన మాజీ సిరియా ఆర్మీ బ్రిగేడియర్ జనరల్. అనంతరం ఆయనను అరెస్టు చేసి విచారణకు హాజరుపరిచారు. 2024 డిసెంబర్‌లో తిరుగుబాటుదారులు డమాస్కస్‌ను స్వాధీనం చేసుకోవడంతో అసద్, ఆయన సోదరుడు మహెర్ రష్యాకు పారిపోయారు. దీంతో అసద్ 24 ఏళ్ల పాలనకు తెరపడింది. హయత్ తహ్రీర్ అల్‌షామ్ నేతృత్వంలోని తిరుగుబాటు దళాలు అసద్ డమాస్కస్ ప్యాలెస్‌ను స్వాధీనం చేసుకుని, ఫెరారీ, ఆస్టన్ మార్టిన్, రోల్స్ రాయిస్, బీఎండబ్ల్యూ వంటి విలాసవంతమైన కార్లతో నిండిన భారీ గ్యారేజీని కూడా తనిఖీ చేశాయి. అసద్‌కు మరో దగ్గరి బంధువు అతీఫ్ నజీబ్‌కు కూడా మరణశిక్ష విధించారు. 2011లో దక్షిణ సిరియాలోని దారా ప్రావిన్స్‌లో రాజకీయ భద్రతా విభాగానికి ఆయన అధిపతిగా ఉన్నారు. ఆ సమయంలో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను అణచివేయడంలో కీలక పాత్ర పోషించినట్లు కోర్టు పేర్కొంది. 15 ఏళ్లలోపు చిన్నారులను ఉద్దేశపూర్వకంగా హతమార్చడం, హింసకు పాల్పడి మరణాలకు కారణం కావడం వంటి నేరాలకు నజీబ్ పాల్పడ్డారని కోర్టు నిర్ధారించింది. సిరియాలో కొత్తగా ఏర్పడిన తాత్కాలిక పాలకుల హయాంలో మాజీ ప్రభుత్వ నేతలపై జరుగుతున్న విచారణల్లో ఇది కీలక పరిణామంగా నిలిచింది. గత ప్రభుత్వంలో పనిచేసిన పలువురిపై ప్రస్తుతం కేసులు నడుస్తున్నాయి. ఇస్లామిస్ట్ నేతృత్వంలోని బలగాలు డమాస్కస్ వైపు దూసుకెళ్లడంతో 2024 డిసెంబరులో అసద్ కుటుంబంతో కలిసి సిరియా నుంచి పారిపోయారు. అనంతరం మాస్కోలో ఆశ్రయం పొందారు. మరోవైపు నజీబ్‌ను అరెస్టు చేసి విచారణకు హాజరుపరిచారు. మాజీ ప్రభుత్వంలో విచారణ ఎదుర్కొంటున్న అత్యున్నత స్థాయి అధికారుల్లో ఆయన ఒకరు.

# కేన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా ప్రకటించాలి: సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** దేశంలో క్యాన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా ప్రకటించని 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు వెంటనే ఆదిశగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. క్యాన్సర్ కేసులను తప్పనిసరిగా నమోదు చేయడం ద్వారా వ్యాధిని తొలిదశలో గుర్తించడంతో పాటు బాధితులకు సరైన వైద్యం అందేలా చూడాలని స్పష్టం చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫారసుల నేపథ్యంలో దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇప్పటికే 17 చోట్ల క్యాన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా ప్రకటించినట్లు కోర్టుకు తెలియజేశారు.

## ముందు సరిగ్గా బట్టలేసుకోండి

### ఆప్ ఎమ్మెల్యేకు ఢిల్లీ సిఎం రేఖాగుప్తా హెచ్చరిక



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** అండర్‌వేర్ మాత్రమే ధరించి మహిళల నుంచి వినతులు స్వీకరించిన ఆప్ ఎమ్మెల్యేపై ఢిల్లీ సిఎం రేఖాగుప్తా ఆగ్రహం వ్యక్తం చేశారు. దుస్తులు సరిగ్గా వేసుకోవాలంటూ ఎమ్మెల్యేకు సూచించారు. ఢిల్లీ వాయువ్య ప్రాంతంలోని కిరారి నియోజకవర్గం నుంచా ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి అనిల్ ఝా వాత్స్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నాడు. అతడు తాజాగా తన ఇంటి దగ్గర బయట కుర్చీ, టేబుల్ వేసుకుని కూర్చున్నాడు. ప్రజల దగ్గర నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. కొందరు మహిళలు కూడా ఆయనకు వినతిపత్రాలు సమర్పించారు. అయితే, ఇవి స్వీకరించే సమయంలో ఆ ఎమ్మెల్యే ఒక ఫుల్ బనియన్, చిన్న నిక్కరు మాత్రమే ధరించి ఉన్నారు. అవి పూర్తిగా లోదుస్తులు. అలాంటి దుస్తులు ధరించి, ఇంటి బయట బహిరంగంగా కూర్చుని ప్రజల నుంచి వినతులు స్వీకరించడానికి సంబంధించిన విడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఒక ఎమ్మెల్యే ఇలా సరిగ్గా దుస్తులు వేసుకోకుండా ఉండటంపై పలువురు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ అంశంపై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా స్పందించారు. ఎమ్మెల్యే సరిగ్గా దుస్తులు వేసుకోవాలని సూచించారు.

# నేతాజీ అస్థికల తరలింపు

### కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు



**న్యూఢిల్లీ,ఆగస్టు11:**స్వాతంత్ర్య సమరయోధుడు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ పార్థివ దేహాన్ని జపాన్ నుంచి భారత్‌కు తీసుకురావాలని ఆదే శాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటి షన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు కేంద్రం స్పం దనను కోరింది. నేతాజీ కుమార్తె అనితా బి. ఫాఫ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, వి.మోహనలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి, విదేశాంగ మంత్రిత్వ శాఖకు, హోం మంత్రిత్వ శాఖకు నోటీసులు జారీ చేసింది. సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు నేతాజీ కుమార్తె తరఫున సీనియర్ న్యాయవాది డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీ హాజరయ్యారు. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబర్ 28కి వాయిదా వేశారు. దశాబ్దాలుగా సుభాష్ చంద్రబోస్ అస్థికలుగా భావిస్తున్న వాటిని భద్రపరిచిన జపాన్‌లోని టోక్యోలో ఉన్న రెంకోజీ ఆలయం నుంచి నేతాజీ పార్థివ దేహాన్ని తిరిగి తీసుకురావాలని ఈ పిటిషన్‌లో కోరారు. నేతాజీ కుమార్తె చట్టబద్ధమైన వారసురాలు అయినం దున, అనితా బోస్ ఫాఫ్‌కు ఈ విషయాన్ని సుప్రీంకోర్టులో ప్రస్తావించే హక్కు ఉందని పేర్కొంటూ, పార్థివ దేహాన్ని భారతదేశానికి తిరిగి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు.

# టిఎంసి బ్యాంక్ ఖాతాలు ఇడి జప్తు

### జోక్యానికి సుప్రీం 'న్లో', రెండు పిటిషన్లు కొట్టివేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:**మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) స్తంభింపజేసిన తృణమూల్ కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలపై కోల్‌కత్తా హైకోర్టు విధించిన ఆంక్షల విషయంలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. ఇడి తమ ఖాతాలను స్తంభింపజేయడాన్ని సవాలు చేస్తూ టిఎంసిదాఖలు చేసిన పిటిషన్‌పై ఎలాంటి మధ్యంతర ఉపశమనం కల్పించేందుకు కోల్‌కత్తా హైకోర్టు నిరాకరించడాన్ని సవాలు చేస్తూ మమ త బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి వర్గం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ పిబి వరలేలతో కూడిన ధర్మాసనం విచారించింది. అక్రమ ఆర్థిక లావాదేవీలు,చట్టవిరుద్ధంగా డబ్బు వసూలు చేయడం, కొన్ని పార్టీ ఖాతాల ద్వారా అనుమానాస్పద నిధులను మళ్లించడం వంటి ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ పోలీసులునమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా, మొత్తం రూ.440.42 కోట్ల నిల్వలు ఉన్న మూడు బ్యాంకు ఖాతాలను ఇడి స్తంభింపజేసిన విషయం తెలిసిందే.

# కొలంబియాను కుదిపిన భూకంపం

### పెద్దసంఖ్యలో భవనాలు, ఆసుపత్రులు ధ్వంసం, 130మందిపైగా మృతి



**బొగోటా, ఆగస్టు 11:** పశ్చిమ కొలంబియాలో సంభవించిన శక్తివంతమైన భూకంపం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనలో కనీసం 132 మంది మృతి చెందగా, భారీగా ఆస్తి నష్టం జరిగింది. పలు భవనాలు, ఆసుపత్రులు దెబ్బతిన్నాయి. మౌలిక వసతులు ధ్వంసమయ్యాయి. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు సమాచారం. కొలంబియా జియోలాజికల్ సర్వీస్ ప్రకారం 21వ శతాబ్దంలో దేశంలో నమోదైన అత్యంత శక్తివంతమైన భూకంపం ఇదే. కొలంబియా అధ్యక్షుడిగా ఉన్న అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా ప్రమాణ స్వీకారం చేసిన కొద్ది రోజులకే ఈ విపత్తు చోటుచేసుకుంది. ఇదే సమయంలో పొరుగున ఉన్న వెనిజులాలోనూ జూన్‌లో వరుసగా సంభవించిన రెండు భారీ భూకంపాలు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. ఆ ఘటనల్లో ఆరువేల మందికి పైగా మృతి చెందినట్లు సమాచారం. అనేక ప్రధాన టెక్టానిక్ ప్లేట్ల సరిహద్దులపై లాటిన్ అమెరికా ప్రాంతం ఉండటంతో భూకంపాలు ఈ ప్రాంతానికి తరచూ ముప్పుగా మారుతున్నాయి. గత శతాబ్దాల్లో ఈ ప్రాంతంలో సంభవించిన పలు భూకంపాలు భారీ ప్రాణనష్టానికి దారితీశాయి. హైతీలో సంభవించిన భూకంపం ఆధునిక చరిత్రలో అత్యంత ప్రాణాంతక ప్రకృతి విపత్తుల్లో ఒకటిగా నిలిచింది ఈ విపత్తు కారణంగా సుమారు 8 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం సంభవించింది. ఈక్వెడార్-కొలంబియా వరుసగా సంభవించిన శక్తివంతమైన భూకంపాలు ఈక్వెడార్, పలు ప్రాంతాలను ధ్వంసం చేశాయి. చారిత్రక అంచనాల ప్రకారం మొత్తం 70వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఈక్వెడార్‌లో 40,000 మంది, కొలంబియాలో 30,000 మంది ఉన్నారు. పెరూ తీరానికి సమీపంలో సంభవించిన ఈ భూకంపం అనంతరం జరిగిన పరిణామాలు మొదటి భూకంపం కంటే కూడా ఎక్కువ ప్రాణనష్టానికి కారణమయ్యాయి. పర్వతంలోని భారీ భాగం కూలిపోవడంతో రాళ్లు, హిమనదుల మంచుతో కూడిన ప్రవాహం యుంగే, రన్రాహిర్కా తదితర ప్రాంతాల వైపు దూసుకెళ్లింది.ఈ శిథిల ప్రవాహం గంటకు 335 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించినట్లు అంచనా. యుంగే పట్టణం దాదాపు పూర్తిగా పూడుకుపోయింది. అక్కడ సుమారు 19,000 మంది మృతి చెందారు. 10 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఈక్వెడార్‌లో సంభవిం చిన ఈ భూకంపం దేశంలోని విస్తారమైన ప్రాంతాలను తీవ్రంగా నాశనం చేసింది. రియోబాంబా, క్విటో, లతకుంగా, అంబాటో ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి ఈక్వెడార్ చరిత్రలో నమోదైన అత్యంత ప్రాణాంతక భూకంపంగా నిలిచింది. ప్రపంచంలో ఇప్పటివరకు నమోదైన అత్యంత శక్తివంతమైన భూకంపం 1960లో చిలీలో సంభవించిన 9.5 తీవ్రత గల వాల్డివియా భూకంపం. 30,000 మంది మృతి చెందారు. వెనిజులాలో సంభవించిన విపత్తు ఒకే భూకంపం కాకపోవచ్చని తరువాతి అధ్యయనాలు సూచించాయి. రాజధాని కారకాస్‌లో సుమారు 90 శాతం ప్రాంతం దెబ్బతిన్నట్లు సమాచారం. బార్కిసిమెటో, మెరిడా, లా గైరా, శాన్ ఫెలిపే ప్రాంతాలు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఆరికా సంభవించిన భారీ భూకంపం అప్పట్లో పెరూలో భాగంగా ఉన్న అరికా నగరాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. అరెక్విపా, మొక్వెగువా, మొల్లెండో, ఇలో తదితర నగరాల్లోనూ భారీ నష్టం జరిగింది. గ్వాటెమాలాలో భూకంపంలో ఎక్కువ మంది నిద్రలో ఉండటంతో భారీ ప్రాణనష్టం జరిగింది.దాదాపు లక్ష చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విధ్వంసం చోటుచేసుకుంది. మట్టి ఇటుకలతో నిర్మించిన ఇళ్లు పెద్ద సంఖ్యలో కూలిపోయాయి. అనంతరం వచ్చిన ప్రకంపనలు కూడా మృతుల సంఖ్యను పెంచాయి.సుమారు 12 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.

# జార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన

### పరీక్షల రద్దుకు సిద్ధమన్న సిఎం హేమంత్ సోరెన్



**రాంచీ, ఆగస్టు 11:** జార్ఖండ్‌లో జేపీఎస్సీ, జేఎస్ఎస్‌సీ నియామక పరీక్షల్లో అక్రమాలు, అవకతవకలు జరిగా యంటూ విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ఆం దోళన 19వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం ప్రకటించింది. 14వ జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షతో పాటు బ్యాక్‌లాగ్ పరీక్షలను రద్దు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మంగళవారం ప్రకటించారు.జేపీఎస్సీ పరీక్షల నిర్వహణకు బాధ్యత వహించిన లక్నోకు చెందిన ఐటీ సంస్థ టీడీపీ ఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలపై దర్యాప్తు జరిపిస్తామని సోరెన్ తెలిపారు. నియామక పరీక్షల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడానికి ఐఐటీలు, ఐఐఎంలు వంటి ప్రముఖ విద్యాసంస్థల నిపుణుల సలహాలు తీసుకుంటామని చెప్పారు.పరీక్షల్లో ఫిర్యాదులు, ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమైన సందర్భాల్లో దర్యాప్తుకు ఆదేశించేందుకు ప్రభుత్వం వెనుకాడదని సోరెన్ స్పష్టం చేశారు. నియామక ప్రక్రియను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా, సురక్షితంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.పరీక్షలు నిర్వహించిన టీడీపీఎల్ సంస్థపై కూడా సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ సంస్థకు బీహార్‌తో సంబంధాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఇలాంటి సంస్థలకు రాష్ట్ర యువత భవిష్యత్తును దెబ్బతీసే అవకాశం ఎలా కల్పించారని ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీలో సీఎం సోరెన్ ప్రసంగిస్తున్న సమయంలోనూ ప్రతిపక్ష సభ్యులు నిరంతరం నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. పరీక్షలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని, ప్రతిపక్షాల ఆందోళనలతో సంబంధం లేకుండా తమ ప్రణాళికలను ముందుకు తీసుకెళ్తామని సోరెన్ స్పష్టం చేశారు.సోమవారం విద్యార్థుల అసెంబ్లీ మార్చ్‌ను ప్రస్తావించిన సీఎం పరిపాలన, పోలీసులు సంయమనంతో వ్యవహరించారని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్, శాసన మండళ్ల వంటి రాజ్యాంగ సంస్థల పరిసరాల్లో సాధారణంగానే భద్రతా ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

## నిజాయితీ ఐఎఎస్‌కు లేచి నిలబడి బ్రహ్మరథం పట్టిన ప్రజలు

**ముంబయి, ఆగస్టు 11:**నిబంధనల అమలులో కఠినంగా వ్యవహరిస్తారని పేరున్న ఓ ఐఎఎస్ అధికారికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆయన వేదికపైకి వస్తుండగా అంతా లేచి నిలబడి కరతాళధ్వనులతో అపూర్వ స్వాగతం పలికారు. మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) కమిషనర్ తుకారాం హరిభావు ముంధేకు పూణెలో ఈ అరుదైన గౌరవం లభించింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మహారాష్ట్రలో ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్న సంస్థలపై ఎఫ్‌డీఏ కమిషనర్‌గా తుకారాం ముంధే కొరడా ఝుళిపిస్తున్నారు. ఆయన నేతృత్వంలో ముంబైతో సహా రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లపై అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పరిశుభ్రత, ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని సుమారు 100 సంస్థల లైసెన్సులను సస్పెండ్ చేశారు. ఈ కఠిన చర్యలు దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచాయి. ఈ నేపథ్యంలోనే పూణెలోని బాల్ గంధర్వ రంగ మందిర్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి ముంధే హాజరయ్యారు. ఆయన వేదిక వైపు నడుస్తుండగా, సభలోని ప్రేక్షకులంతా ఒక్కసారిగా లేచి నిలబడి పెద్ద పెట్టున చప్పట్లు కొడుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. చాలా మంది తమ ఫోన్లలో ఈ దృశ్యాలను బంధించారు. ఆయన తీసుకుంటున్న చర్యలకు ప్రజల నుంచి లభిస్తున్న మద్దతుకు ఈ సంఘటనే నిదర్శనం. బీడ్ జిల్లాలోని ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆయన, చిన్నతనంలో ఆర్థిక ఇబ్బందుల మధ్య పెరిగారు. జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతూనే, తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సాయం చేసేవారు. కష్టపడి చదివి, ఔరంగాబాద్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మరాఠ్వాడా యూనివర్సిటీలో ఉన్నత విద్యను పూర్తి చేశారు.

# మిస్సింగ్‌లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాల్సిందే

### తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు

### నివేదికివ్వాలంటూ కేంద్రం, రాష్ట్రాలకు నోటీసులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** తప్పిపోయిన వ్యక్తుల కోసం తక్షణమే ప్రథమ సమాచార నివేదికలను (ఎఫ్ఐఆర్‌లు) నమోదు చేయాలన్న తన ఆదేశం, వయస్సు లేదా లింగంతో సంబంధం లేకుండా పెద్దలు, పిల్లలు ఇద్దరికీ వర్తిస్తుందని భారత సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. జి. గణేష్ వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు అండ్ అదర్స్ కేసులో ఆగస్టు 5న వెలువరించిన తీర్పులో ఈ స్పష్టత ఇవ్వబడింది. 'వ్యక్తి అనే పదాన్ని కేవలం పిల్లలకు మాత్రమే వర్తిస్తుందని కొన్ని రాష్ట్రాలు తప్పుగా అర్థం చేసుకోవడం పట్ల జస్టిస్‌లు అహ్సానుద్దీన్ అమానుల్లా, ఆర్. మహాదేవన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యానం కొన్ని రాష్ట్రాలు ఉద్దేశపూర్వకంగా, దురుద్దేశంతో సృష్టించిన బూటకపు ప్రచారం అని కోర్టు పేర్కొంది. మే 22 నాటి మునుపటి ఉత్తర్వులో, తప్పిపోయిన వ్యక్తి గురించి సమాచారం అందిన వెంటనే ప్రతి పోలీస్ స్టేషన్ ఆలస్యం చేయకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. వయస్సు లేదా లింగంతో సంబంధం లేకుండా 'వ్యక్తి అనే పదంలో అందరు వ్యక్తులు ఉంటారని స్పష్టతనిచ్చింది. ఈ ఆదేశాన్ని పాటించడంలో విఫలమైన ఏ రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతం అయినా కోర్టు ధిక్కరణ చర్యలకు గురవుతుందని కోర్టు హెచ్చరించింది. అటువంటి సందర్భాలలో, ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై, వారు ఆదేశాన్ని పాటించకపోవడానికి గల కారణాలపై వివరణ ఇవ్వవలసి ఉంటుంది. ఒక వ్యక్తి అదృశ్యమైన తర్వాత, తరచుగా 'గోల్డెన్ అవర్' అని పిలువబడే తొలి గంటల ప్రాముఖ్యతను గుర్తించాలని పేర్కొంది. ఈ సమయంలో తప్పిపోయిన వ్యక్తిని విజయవంతంగా గుర్తించే అవకాశం గణనీయంగా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల, తప్పిపోయిన వ్యక్తి కేసు దర్యాప్తు కోసం వనరులను సమీకరించే ముందు 24 గంటల పాటు వేచి ఉండి పోలీసులు చర్యలు తీసుకోవడంలో జాప్యం చేయకూడదు. అంతేకాకుండా, మే 22న ఇచ్చిన ఆదేశాలకు సంబంధించి తాజా స్థితి నివేదికలు, తీసుకున్న చర్యలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తప్పనిసరిగా సమర్పించాలని కోర్టు ఆదేశించింది. అలా చేయని వారిని ప్రాథమికంగా కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లుగా పరిగణిస్తారు. ముఖ్యంగా లడఖ్‌ను, సముచితంగా స్పందించడంలో తన వైఫల్యాన్ని స్పష్టం చేయడానికి వ్యక్తిగత అఫిడవిట్‌లను సమర్పించాలని కోరారు. దేశవ్యాప్తంగా సంబంధిత డేటాబేస్‌లను తప్పనిసరిగా ఏకీకృతం చేయాలని ఆదేశించబడింది, దీనిని ఆరు వారాలలోగా పూర్తి చేయడానికి గడువు విధించబడింది. సుప్రీం కోర్టు ఈ విషయాన్ని అక్టోబర్ 5న మళ్లీ విచారించనుంది.



# 'వందేమాతరం' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

### జాతీయ గీతంతో సమానంగా చట్టపరమైన రక్షణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** జాతీయ గీతం జనగణమనతో సమానంగా జాతీయ గేయం వందేమాతరానికి చట్టపరమైన రక్షణ కల్పించే బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. రాష్ట్రపతి ఆమోదంతో ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ (అమెండ్‌మెంట్) బిల్, 2026 చట్టంగా మారింది. వందేమాతరం గీతాన్ని ఉద్దేశపూర్వకంగా పాడకుండా అడ్డుకోవడం లేదా గీతం ఆలపిస్తున్న సభకు ఆటంకం కలిగించడం ఇకపై నేరంగా పరిగణించబడుతుంది. ఈ చర్యలకు జాతీయ గీతం విషయంలో ఉన్న చట్టపరమైన రక్షణనే వందేమాతరానికి కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ బిల్లును జూలై 29న రాజ్యసభ ఆమోదించగా, జూలై 30న లోక్‌సభ ఆమోదం తెలిపింది. జూలై 24న లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్, 1971లోని సెక్షన్ 3కు సవరణలు చేసింది.ఇప్పటివరకు జాతీయ గీతం జనగణమనను ఉద్దేశపూర్వకంగా పాడకుండా అడ్డుకోవడం లేదా దానిని ఆలపిస్తున్న సభకు అంతరాయం కలిగించడం మాత్రమే నేరంగా ఉండేది. ఈ నేరాలకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉండేది. రెండోసారి, ఆ తర్వాత జరిగే ప్రతినేర నిర్ధారణకు కనీసం ఏడాది జైలు శిక్ష విధించే నిబంధన కూడా ఉంది. భారత రాజ్యాంగ సభ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ 1950 జనవరి 24న చేసిన ప్రకటనను కూడా బిల్లులో ప్రస్తావించారు. బంకించంద్ర చటర్జీ రచించిన 'వందేమాతరం' భారత స్వాతంత్ర్య పోరాటంలో చారిత్రక పాత్ర పోషించిందని, జాతీయ గీతం జనగణమనతో సమానంగా దానికి గౌరవం, హోదా ఉండాలని అప్పట్లో రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ ఆరు చరణాల పూర్తి ఆలాపనకు సుమారు 3నిమిషాల 10సెకన్లు పడుతుంది. ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకల్లో తొలిసారిగా ఎర్రకోటప్రాకారాల నుంచి వందేమాతరంగీతాన్ని ఆల పించనున్నట్లు కేంద్రహోంమంత్రి అమిత్‌షా వెల్లడించారు.

## జపోరిజ్జియాపై రష్యా క్షిపణి దాడి.. ఐదుగురు మృతి, 20 మందికి గాయాలు

**జపోరిజ్జియా, ఆగస్టు 11:** ఉక్రెయిన్‌లోని ఆగ్నేయ నగరం జపోరిజ్జియాపై రష్యా జరిపిన దాడిలో కనీసం ఐదుగురు మృతి చెందగా, మరో 20మంది గాయపడ్డారు. రష్యాదాడులతో మృతులు, క్షతగాత్రుల సంఖ్య మరింత పెరుగుతోందని జపోరిజ్జియా ప్రాంతీయ సైనిక పరిపాలన అధిపతి ఇవాన్ ఫెడోరోవ్ తెలిపారు.రష్యా బలగాలు నగరంలోని పారిశ్రామిక సంస్థలు, మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకున్నాయని ఫెడోరోవ్ వెల్లడించారు. ఈదాడుల్లో గ్యారేజ్ కోఆపరే టివ్‌తో పాటు పలు నివాస భవనాలు దెబ్బతిన్నాయని చెప్పారు. దాడి జరిగిన ప్రాంతంలో మంటలు చెలరేగిన దృశ్యాలను ప్రాంతీయ అధికారులు విడుదలచేశారు. నగరంపై క్షిపణులు, గైడెడ్ ఏరియల్‌బాంబులతో దాడి జరిగినట్లు ఉక్రెయిన్ అధికారులు తెలిపారు.అధికారులు తొమ్మిది మంది గాయపడినట్లు ప్రకటించగా, అనంతరం మృతుల సంఖ్య ఐదుకు, గాయపడిన వారి సంఖ్య 20కి పెరిగినట్లు వెల్లడించారు.

# అమెరికాకు ఆంక్షల వ్యసనం పట్టింది: ఇరాన్



టెహ్రాన్, ఆగస్టు 11: తమ దేశంపై ఆంక్షలు విధిం చడం అమెరికాకు వ్యసనంగా మారిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ విమర్శించారు. ఆంక్షలతో ఇరాన్‌ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం' అని అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చెప్పడంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దౌత్య మార్గంలో లక్ష్యాలను సాధించలేనప్పుడల్లా అమెరికా ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు.అవి ఫలించకపోతే మరింత తీవ్రత పెంచుతోందని పేర్కొన్నారు. ఇది ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిందని ఎక్స్ వేదికగా ఆయన మండిపడ్డారు. ఆంక్షలతో ఇరాన్‌ను లొంగదీసుకోవడం సాధ్యం కాదని బఘాయీ స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ఇలాంటి ఆంక్షలను ఎదుర్కొంటూనే ఉన్నామన్నారు. అమెరికా నేతలు ఈ చెడు అలవాటును కొన సాగిస్తే సంక్షోభం నుంచి గౌరవప్రదంగా బయ టపడే అవకాశాలను వారే దెబ్బతీసుకుంటారని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ ప్రభుత్వం డిజి టల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడుతోందని స్కాట్ బెసెంట్ ఆరోపించారు. వారి అక్రమ ఆర్థిక నెట్‌వర్క్‌లను గుర్తించి ధ్వంసం చేస్తామని తెలిపారు.

**ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు:** ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ ఈ మార్పులు చేశారు. మేజర్ జనరల్ అలీ అబ్దొల్లాహీని సాయుధ దళాల చీఫ్‌గా, కియుమర్స్ హైదారిని డిప్యూటీగా నియమించారు. అలాగే ఐఆర్‌జీసి కమాండర్‌గా మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీ, డిప్యూటీగా మోస్తఫా ఇజాదీ బాధ్యతలు చేపట్టారు. మొజ్తబా సుప్రీం నేతగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సైన్యంలో చేసిన తొలి కీలక నియామకాలు ఇవే కావడం గమనార్హం.

# సంక్షిప్త వార్తలు

## సిజెపి ప్రచారంపై పిల్.. సుప్రీం నోటీసులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** న్యాయ విచారణల సమయంలో చేసిన మౌఖిక వ్యాఖ్యలను సోషల్ మీడి యా ప్రచారాలు, డిజిటల్ కంటెంట్ ద్వారా వాణిజ్యపరంగా దుర్వినియోగం చేయడం, డబ్బు సంపాదించడం వంటి ఆరోపణల నుండి రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్)పై సుప్రీంకోర్టు మంగళవారం నోటీసు జారీచేసింది. చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చీ, వి.మోహనలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సిబిఐల నుండి స్పందనలను కోరి, తదుపరి విచారణను సెప్టెంబర్ 10కి వాయిదా వేసింది.

## అదానీపై అమెరికా కోర్టులో కేసు కొట్టివేత



**న్యూయార్క్, ఆగస్టు 11:** భారత బిలియనీర్, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీపై నమోదైన క్రిమినల్ మోసం, లంచం ఆరోపణల కేసును అమెరికా కోర్టు సోమవారం కొట్టివేసింది. ఈ కేసులో విచారణను ముగించాలని అమెరికా న్యాయ శాఖ నిర్ణయించడంతో, బ్రూక్లిన్‌లోని అమెరికా జిల్లా న్యాయమూర్తి నికోలస్ గరాఫిస్ కేసును కొట్టివేయాలన్న ఫెడరల్ ప్రాసిక్యూటర్ల అభ్యర్థనకు అనుమతి ఇచ్చారు. కేసును ఉపసంహరించుకోవడానికి గల కారణాలపై న్యాయమూర్తి ప్రశ్నలు సంధించారు. కేసును ఉపసంహరించుకోవడానికి ప్రతిఫలంగా ఏవైనా హామీలు లేదా ఒప్పందాలు జరిగాయా అని న్యాయమూర్తి గౌతమ్ అదానీని నేరుగా ప్రశ్నించారు. అలాంటి ఒప్పందం గురించి తనకు తెలియదని అదానీ తెలిపారు. కేసు కొట్టివేతపై అదానీ స్పందిస్తూ, అమెరికా కోర్టు నిర్ణయాన్ని వినయంతో, న్యాయ ప్రక్రియపై గాఢమైన గౌరవంతో స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు.

## హర్ముజ్ జలసంధిలో భారీగా పడిపోయిన నౌకల రాకపోకలు



**వాషింగ్టన్/టెహ్రాన్:** అమెరికాఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై ఆశలు సన్నగిల్లుతున్న నేపథ్యంలో కీలకమైన హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు భారీగా తగ్గిపోయాయి. కేవలం ఆరు నౌకలు మాత్రమే ఈ జలసంధి మీదుగా ప్రయాణించినట్లు కేప్లర్ డేటా వెల్లడించింది. గత పది రోజుల సగటు రోజువారీ రాకపోకలు సుమారు 11 నౌకలుగా ఉన్నాయి. నాలుగు కమోడిటీ నౌకలు జలసంధిలోకి ప్రవేశించాయి. వీటిలో రెండు ఖాళీ ఆయిల్ ట్యాంకర్లు ఉన్నాయి. మరోవైపు ద్రవీకృత పెట్రోలియం వాయువు (ఎల్‌పీజీ)తో వెళ్తున్న చిన్న ట్యాంకర్, రిజిడ్యువల్ ఫ్యూయల్స్‌ను తీసుకెళ్తున్న మరో నౌక జలసంధి నుంచి బయటకు వెళ్లాయి.

## రాజస్థాన్‌లో 106 నకిలీ సంస్థలు

**జైపూర్, ఆగస్టు 11:** రాజస్థాన్‌లో నకిలీ సంస్థల ద్వారా పన్ను ఎగవేత, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు వాణిజ్య పన్నుల శాఖ భారీగా తనిఖీలు చేపట్టింది. రాష్ట్రంలోని మొత్తం 16 జోన్లలో ఏకకాలంలో ప్రత్యేక తనిఖీలను నిర్వహించి అనుమానాస్పద సంస్థల కార్యకలాపాలను పరిశీలించింది. ఈ తనిఖీల్లో మొత్తం 137 సంస్థలను తనిఖీ చేయగా 106 సంస్థలు నకిలీవిగా తేలాయి. మరో 31 సంస్థలు వాస్తవంగా కార్యకలాపాలు నిర్వహిస్తు న్నవిగా గుర్తించినప్పటికీ, వాటిలోనూ పన్ను సంబంధిత అవకతవకలు బయటపడ్డాయి.

## ప్రయోగాత్మకంగా ప్లాస్టిక్ కరెన్సీ!



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** దేశంలో త్వరలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లు చెలామణిలోకి రానున్నాయి. రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను క్షేత్రస్థాయి ప్రయోగాల కోసం జారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఒక్కో డినామినేషన్‌లో వంద కోట్ల చొప్పున నోట్లను ప్రయోగాత్మకంగా జారీ చేసే ప్రతిపాదనను ఆమోదించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటుకు వెల్లడించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ సెంట్రల్ బోర్డు సిఫార్సు మేరకు ఆర్ బీ ఐ చట్టం1934 లోని సెక్షన్ 25 ప్రకారం ఈ ప్రతిపా దనను ప్రభుత్వానికి పంపింది. ఈ క్షేత్రస్థాయి ప్రయోగాలు విజయవంతమైతే భవిష్యత్తులో ఈ రెండు విలువల్లోని పాలిమర్ నోట్లను క్రమబద్ధంగా జారీ చేసే అవకాశం ఉంటుంది.

## పండుగలా ప్రపంచ ఆదివాసి దినోత్సవాలు

### బాలికలతో థింసా డాన్స్ చేసిన మంత్రి సంధ్యారాణి



**సాలూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా వరుసగా 4వ రోజు ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు జరుపుకోవడం నా భూతో నా భవిష్యత్ అని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. మంగళవారం ఆమె ఆధ్వర్యంలో ఆదివాసి దినోత్సవం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రి సంధ్యారాణి ఇంకా గిరిజన నాయకులు అలాగే ఉద్యోగులు బారీర్యాలీగా బయలుదేరి సంస్కృతిక, థింసా, కోలాటం, వాయిద్యాలు మధ్య బాలికలు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. అలాగే జాతీయ రహదారి గుండా ఎమ్మార్వో ఆఫీస్ కూడలి వద్దకు చేరుకుని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి మంత్రి సంధ్యారాణి చేతుల మీదగా పూలదండ వేసి అంజలి ఘటించారు. అనంతరం మంత్రి క్యాంప్ కార్యాలయంలో గిరిజనులతో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవం అనేది కేవలం ఒక వేడుక కాదని మన గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీక, చరిత్రకు గౌరవం, హక్కులకు గుర్తింపు, భవిష్యత్తుకు భరోసా అని స్పష్టం చేశారు. అలాగే ఐక్యరాజ్య సమితి ప్రపంచంలోని ఆదివాసి సమాజాల సంస్కృతి, సాంప్రదాయాలు, జీవన విధానం, హక్కులను గౌరవించడానికి ప్రత్యేక ప్రపంచ ఆదివాసి దినోత్సవం ప్రకటించిందని క్లారిటీ ఇచ్చారు. అంతే కాకుండా వేల సంవత్సరాలుగా ప్రకృతిని దేవత గా భావించి అడవిని తల్లిగాచూసి ఇంకా నీటిని జీవంగా భావించి, జీవ వైవిద్యాన్ని కాపాడుతూ జీవించిన సమాజం మన గిరిజన సమాజమన్నారు. అలాగే సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్టంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో 1000 కోట్లతో అడవితల్లి బాటలు వేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే సాధ్యం స్పష్టం చేశారు. ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి, నిమ్మాది చిట్టి, ఆముదాల పరమేష్, ముఖి సూర్యనారాయణ, గిరిజన నాయకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## యువకుడి హత్యకేసులో నలుగురు అరెస్టు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 11 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఈ నెల 2 రాత్రి స్వర్ణముఖి ఆనకట్ట వద్ద దారుణ హత్యకు గురుకాబడిన ఎం శివకుమార్ దారుణ హత్యకు గురికాబడ్డారు. ఈ కేసును జిల్లా పోలీసు అధికారి ఎల్.సుబ్బరాయుడు, ఎయస్పి రవిమనోహరాచారిల పర్యవేక్షణలో శ్రీకాళహస్తి పోలీసులు తమ సత్తాను చూపి నలుగురిని అరెస్టు చేసినట్లు మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పి సుబ్బరాయుడు ప్రకటించారు. ఈ హత్యను తమిళనాడుకు చెందిన పాతనేరస్థుల బృందం చేసినట్లు గుర్తించారు.

పాతకక్షలతో శివకుమార్‌ను పథకం ప్రకారం హతమార్చినట్లు గుర్తించారు. హత్యకు ఉపయోగించిన కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి వివరించారు. అరెస్టు చేసిన వారిలో తమిళనాడుకు చెందిన నలుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. తిరువళ్ళూరుకు చెందిన వి.కార్తీక్(32), అంబలత్తూరుకు చెందిన వేలుగోపినాథ్(27), పొన్నెరి తాలూకా ఎలమాండ్యంకు చెందిన బి.శ్రీధర్ అనే రెడ్డి(26), పుత్తూరు టౌన్ గాంధీ నగర్‌కు చెందిన మునస్వామి సూర్య(19)లను అదుపులో తీసుకొని వారు హత్యకు ఉపయోగించిన కత్తులను మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరోక నిందితుడు పరారీలో ఉన్నాడని జిల్లా ఎస్పి సుబ్బరాయుడు వివరించారు. ఈ కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహారించి నిందితులను అదుపులో తీసుకోటానికి చక్కగా వ్యవహారించిన డివైయస్పి నరసింహామూర్తి, సిఐలు వెంకటేష్, ఇబ్రహీం, నాగరాజు, లక్ష్మీనారాయణలను అభినందించారు.



# గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

### ● ఉన్నత విద్యతో గిరిజన పిల్లలు ఉన్నతస్థాయికి ఎదగాలి ● రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వెంకటప్ప

**కుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వెంకటప్ప పేర్కొన్నారు. మంగళవారం కుప్పం వాణి మహల్‌లో జరిగిన గిరిజనుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తూ అర్హులైన గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతోందన్నారు. సిఎం చంద్రబాబు గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ 175 నియోజకవర్గాల్లో ఉన్న గిరిజనులకు ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులను ఆదేశిస్తున్నారన్నారు. నెలకు ఓసారి గిరిజనుల అంశాలపై సమీక్ష నిర్వహిస్తూ అధికారులకు తగు సూచనలు అందిస్తున్నారన్నారు. గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చెందాలనా న్నరు. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. గిరిజన సమాజ ం నుంచి ఇప్పటికే ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ వంటి ఉన్నతస్థాయికి ఎదిగిన వారు ఉన్నారన్నారు. విద్యతో గిరిజన కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. గిరిజన గ్రామాలు, గూడెంలు, తాండాలు, కొండ ప్రాంతాల్లోని ప్రజలకు విద్యుత్, సోలార్, తాగునీరు, రహదారులు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ప్రత్యేక చర్యలు చేపట్టి ఆధార్ కార్డులు అందించేందుకు అధికారులు కృషి చేశారన్నారు. ఆధార్ కార్డులు అందుబాటులో రావడంతో పింఛన్లు, రేషన్ ప్రయోజనాలు అందుతున్నాయన్నారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని చెంచు గిరిజన ప్రాంతాల్లో సైతం ఆధార్‌కార్డులు, పింఛన్లు, రేషన్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కుప ్పంలో ముప్పై పరిశ్రమలు రావడంతో యువతకు ప్రయోజనం కలుగుతుందన్నారు. త్వరలో విమానాశ్రయం రావడం సంతోషకరమైన విషయం అన్నారు.

కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, కడ ఎపిడి శ్రీనివాసులు రాజు, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎపి ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగదీష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు ఎస్టీ కమీషన్ సభ్యులు వెంకటప్ప స్థానిక శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.



## శతాధిక వృద్ధురాలు ఆవుల చెంగమ్మ కన్నుమూత

**తిరుపతి, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం పనబాకం గ్రామానికి చెందిన దేశ భక్తురాలు, శతాధిక వృద్ధురాలు ఆవుల చెంగమ్మ(101) మంగళ వారం కన్నుమూశారు. భారత స్వాతంత్రోద్యమ కాలంలో బ్రిటిష్ వారి అరాచకాల మీద తిరుగుబాటు చేసిన కుటుంబానికి చెందిన ఆమె, అన్నదాతగా కూడా పేరు గడించారు. వలసపాలనలోనే అటవీశాఖలో ఉద్యోగిగా వున్న ఆమె బావ ఒకరు, బ్రిటిష్ అధికారి నిరంకుశ వైఖరి పట్ల తొలిసారిగా తిరుగుబాటు చేశారు. దీంతో వీరి కుటుంబం కొంతకాలం అజ్ఞాత జీవితాన్ని కూడా గడపాల్సి వచ్చింది. ఆ సమయంలో కుటుంబ భారాన్ని మొత్తం చెంగమ్మ మోయడమే కాకుండా, ఎంతో ధైర్యంగా గ్రామంలో దేశభక్తి భావాలను పెంపొందించం జేశారు. అప్పట్లో ఎలాంటి విపత్కర పరిస్థితులు, బెదిరింపులు ఎదురైనా తలొగ్గని సాహసిగా పేరు పొందారు. సామాజిక చైతన్యంతో అక్షరాస్యత పెంపుకోసం ప్రయత్నిస్తూ, పేదలకు అన్నపూర్ణగా తనదైన శైలిలో సేవలందించారు. తమిళనాడు రాష్టంలో 1925లో జన్మించిన ఆమె అక్కడే ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. బాల్యం నుండే భారతీయ సాహిత్యాన్ని, దేశభక్తిని ప్రచారం చేస్తూ వచ్చారు. వివాహం తర్వాత భర్త స్వగ్రామం, స్వర్ణముఖి నదీపరివాహక ప్రాంతమైన పనబాకం గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. ఆమె భర్త రామయ్య అటవీశాఖ లో ఉద్యోగిగా వుంటూనే, వ్యవసాయం కూడా చేసేవారు. ప్రస్తుతం రాష్ట్ర అటవీశాఖలో డిప్యూటీ కన్జర్వేటర్ హోదాలో ఆమె కుమారుడు ఆవుల చంద్రశేఖర్ ఇటీవల లండన్‌లో అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు ముఖ్య కార్యనిర్వహణా ధికారి (సిఇఒ)గా విజయవాడలో ఆయన పనిచేస్తున్నారు. సిఇఒ మాతృమూర్తి, శతాధిక వృద్ధురాలు చెంగమ్మ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బుధవారం తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలోని పనపాకం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆమె బంధువులు తెలిపారు.

# రైతన్నలు పంట బీమా చేయించుకోవాలి

### ప్రకృతి వైపరీత్యాల్లో ఆసరా: మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, ఆగస్టు 11 ప్రభాతవార్త:** రైతన్నలు ప్రధానమంత్రి పంట బీమా పథకాన్ని (పీఎంఎఫ్ బివై) నమోదు చేయించుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలలో రైతన్నలకు ఈ పథకం ఆసరాగా ఉంటుందని ప్రతి ఒక్కరు కూడా తప్పనిసరిగా సమీపంలోని రైతు సేవా కేంద్రాల వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. ఆగస్టు 15 వరకు మాత్రమే గడువు ఉన్నదని ఆయన తెలిపారు. బీమా నమోదుకు పంట సాగు ధ్రువీకరణ పత్రం సరిపోతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతన్నల ప్రయోజనాల కోసం ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారన్నారు. రైతులను ఊహించని నష్టాల నుండి ఆదుకుని, తిరిగి వ్యవసాయం చేసుకునేలా రైతులను ప్రోత్సహించడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

ఎలినినో ప్రభావాన్ని ఎదుర్కోవాలి. అలాగే ప్రస్తుతం ఎలినినో ప్రభావాన్ని రైతులు ధైర్యంగా ఎదుర్కోవాలనీ, నీటి ఆధారిత పంటలు వేసి రైతన్నలు నష్టపోవద్దనీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. వర్షాలు కురవని కారణంగా చెరువులలో నీరు లేదని, ఎలినినో కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయాయన్నారు. కేవలం బోరు మోటార్లను నమ్ముకుని సాగు చేయడం ద్వారా రైతన్నలు నష్ట పోయే అవకాశం ఉందన్నారు. నీటి ఎద్దడి కారణంగా వరి పంట సాగు చేసే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు.

వాతావరణంలో వచ్చిన సమూల మార్పుల కారణంగా రైతన్నలు ఆరుతడి పంటలు సాగు చేయటం మంచిదన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనల ప్రకారం, ఎలినినో ప్రభావం కారణంగా సంప్రదాయ వరి సాగుకు దూరంగా ఉండి, ఆరుతడి పంటలు మరియు ఆధునిక నీటి యాజమాన్య పద్ధతులు (బిందు సేద్యం) పాటిస్తే రైతులు నష్టాల నుంచి తప్పించుకుని మంచి లాభాలు పొందవచ్చన్నారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలైన వేరుశనగ, కంది, పెసర వంటి పంటలు సాగు చేసి రైతన్నలు లబ్ది పొందాలని రైతన్నలను మంత్రి కోరారు. మరిన్ని వివరాల కోసం రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.

## ఆధ్యాత్మికనగరంలో గుంతలరోడ్లు

### రోడ్లను బాగుచేయాలని సిపిఐ వినూత్న పాదయాత్ర



**తిరుపతి, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** యాత్రాస్థలం,ఆధ్యాత్మికనగరం తిరుపతిలో గుంతలరోడ్లు దర్శనమిస్తున్నాయి. గుంతలమయమైన రోడ్లతో వాహనాల ప్రయాణం అవస్థలు తప్పడంలేదని సిపిఐ నిరసన తెలిపింది. మంగళవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పాదయాత్రల్లో భాగంగా తిరుపతి నగరంలో చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ. రామానాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే ఈ పాదయాత్రల ప్రధాన ఉద్దేశమన్నారు. పాదయాత్రలో ప్రజలు స్వచ్ఛందంగా తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువస్తున్నారని తెలిపారు. తిరుపతి నగరంలో అనేక ప్రాంతాల్లో కాలువలు సక్రమంగా లేకపోవడం, గుంతలమయమైన రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు, నాలుగు నెలల క్రితం వేసిన రోడ్లు కూడా ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిని గుంతలమయంగా మారాయని విమర్శించారు. ఎం.ఆర్.పల్లి పోలీస్ స్టేషన్, రిజిస్ట్రార్ కార్యాలయం పరిసరాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని తెలిపారు. పోలీస్ స్టేషన్ ముందు గత నాలుగు నెలలుగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇదే మార్గంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు, ప్రజలు, వేలాది మంది విద్యార్థులు, యాత్రికులు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల గుంతల్లో పడి ఇద్దరు విద్యార్థులు ఆసుపత్రి పాలైన ఘటనను తాము ప్రత్యక్షంగా చూశామని పేర్కొన్నారు. తిరుపతి నగరానికి స్మార్ట్ సిటీ పేరుతో కోట్లాది రూపాయల నిధులు వచ్చినప్పటికీ ఆ నిధులను ఎక్కడ ఖర్చు చేశారు అన్న విషయాన్ని మున్సిపల్ కమిషనర్ శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## 23నుండి శ్రీవారి పవిత్రోత్సవాలు

### ఒకే టిక్కెట్‌పై 3రోజులు గృహస్థ భక్తులకు దర్శనాలు



**తిరుమల, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 23నుండి 25వరకు మూడు రోజులు పవిత్రోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. 22వ తేదీ శనివారం సాయంత్రం అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉదయం 9గంటల నుండి 11గంటల వరకు స్నపన తిరుమంజ నం నిర్వహిస్తారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఆభరణాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఆగస్టు 23న పవిత్రాల ప్రతిష్ట, 24న పవిత్ర సమర్పణ, 25న పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**ఆర్జితసేవలు రద్దు:** పవిత్రోత్సవాల్లో ఈనెల 22న అంకురార్పణ కారణంగా సహస్రదీపాలంకార సేవ టిటిడి రద్దు చేసింది. 23 నుండి 25వ తేది వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార, 25న అష్టదళ పాదపద్మారాధన సేవను, ఆగస్టు 26న (పవిత్రోత్సవాలు ముగిసిన తర్వాత రోజు) కల్యాణోత్సవ సేవలను రద్దు చేశారు.

**ఒకే టిక్కెట్‌పై మూడురోజులు దర్శనం:** ఆలయంలోపల కల్యాణోత్సవ మండపం లో 23 నుండి 25వరకు జరిగే ఈ పవిత్రోత్సవాలకు ఏ రోజుకారోజు టిక్కెట్లు పొందిన గృహస్థభక్తులను సహజంగా అనుమతినిస్తారు. అయితే ఈ ఏడాది టిటిడి పెద్దలు వినూత్నంగా ఆలోచన చేసి ఏకంగా పవిత్రోత్సవాల టిక్కెట్‌ను రూ.5వేలు చేశారు. ఈ టిక్కెట్ ఆన్‌లైన్‌లో పొందిన భక్తులు పవిత్రోత్సవాలు జరిగే మూడురోజులు ఆలయంలోనికి చేరుకుని మలయప్ప ఉత్సవర్లు సేవతోబాటు శ్రీవారి మూలవిరాట్టును దర్శించుకునే భాగ్యం కల్పించారు. పవిత్రోత్సవాల సేవా టిక్కెట్లపై ఒకే టికెట్ పొందిన గృహస్థ భక్తులు మూడురోజులు సేవలో పాల్గొనే అవకాశం కల్పించింది.

## శివయ్యకు వెండి గంట బహూకరణ

**శ్రీకాళహస్తి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరునికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు సుమారు రూ.4.29 లక్షల విలువ కల్గిన వెండి గంటను అందించారు. మంగళవారం జి.హరినాథ్‌రెడ్డి, జి.పుష్పలత దంపతులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం స్వామికి ప్రత్యేకంగా తయారు చేసిన 1.5కిలోల వెండి గంటను బహూకరించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటి ఇఒ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఆలయ అకౌంటెంట్ యుగంధర్, నాగయ్యలు పాల్గొన్నారు. గంటను బహూకరించిన భక్తులకు ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనంతో పాటు వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## దేవాలయాల సమగ్ర వికాసానికి స్థానిక సలహా మండలి ఏర్పాటు చేయాలి

**తిరుపతి, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఇప్పటికే హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ, ముంబై, భువనేశ్వర్, బెంగళూరు, కురుక్షేత్ర తదితర ప్రముఖ నగరాల్లో స్థానిక సలహా మండలుల్లు విజయవంతంగా పనిచేస్తున్న విషయం విదితమే. టిటిడిపాలకమండలి పరిధిలోనే ఈ కమిటీలకు నిర్దిష్టమైన బాధ్యతలు, సూచనలు చేసే పరిధిని కల్పించారు. అదే తరహాలో ఆధ్యాత్మిక రాజధాని తిరుపతి నగర పరిధిలోని దేవాలయాల అభివృద్ధి, భక్తుల వసతుల పెంపునకు కూడా ఒక ప్రత్యేక స్థానిక సలహా మండలిని ఏర్పాటు చేయాలని టిటిడి యాజమాన్యానికి రాష్ట్ర ప్రభుత్వానికి బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ కమిటీకి రిటైర్డ్ ఐఎఎస్ గానీ రిటైర్డ్ జడ్జిని చైర్మన్‌గా నియమించాలని కోరారు.

# అన్నప్రసాదంలో మసాల 'వడ' కిరికిరి!

### ● ఛైర్మన్ అభిప్రాయానికే గండి? ● అరకొరగా తయారీతో కొందరు భక్తులకే పరిమితం



**తిరుమల, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకొండపై అధికారుల మాటలు కోటలు దాటుతున్నా ఆచరణలో మాత్రం పర్యవేక్షణ కరువై అరకొర సదుపాయాలతోనే నెట్టుకుపోతు న్నారు. శ్రీవారిపట్ల భక్తివిశ్వాసాలు కలిగిఉండే సిఎం చంద్రబాబు కూడా టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు అన్నప్రసాదంలో అదనపు మెనూగా మసాల వడ వడ్డింపు ఆలోచన, ప్రతిపాదనను అమోదించి అభినందించడం విశేషం. ఏడా దిన్నర క్రిందట టిటిడి బోర్డు తీర్మానం చేసి తిరుమల అన్నప్రసాదంలో ఎంతో ప్రతిష్టాత్మ కంగా అదనపు మెనూగా చేర్చిన మసాల వడ వడ్డింపుపై మెల్లగా సుస్తీపలికేస్తున్నారనే వాదనలు భక్తుల నుండి వ్యక్తమవుతున్నాయి. మసాలవడ (అదనంగా శనగపిండి, పచ్చిమిర్చి, అల్లం, కరివేపాకు, కొత్తిమీర, సోంపు వంటి పదార్థాలతో తయారుచేసేది) వడ్డించాలనే అభి ప్రాయంతో ఎంతో మంచి ప్రతిపాదనను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ప్రవేశపెట్టారు. ఇందుకు బోర్డు సభ్యులు, అధికారులు కూడా ఆమోదిం చారు. 2025 మార్చి 6వతేదీ తొలిసారిగా తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనం లో అన్నప్రసాదాలతోబాటు మధ్యాహ్నం వేళ మాత్రం భోజనంలో అదనంగా మసాల వడ వడ్డింపుతో మెనూ ప్రారంభమైంది. తొలుత 35 వేల వడలను మాత్రమే తయారుచేసి ఉదయం నుండి మధ్యాహ్నం వరకు అన్నప్రసా దాలు స్వీకరించే భక్తులకు మాత్రమే వడ్డిం చారు. ఆ తరువాత ఐదు నెలలకు ఈ అదనపు మెనూ వడను రోజుకు 75వేలు తయారుచేసి ఉదయం 11గంటల నుండి రాత్రి 10గంటల వరకు నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసా దంలో వడ్డిస్తూ వచ్చారు.

అన్నప్రసాద భవనం లో నాణ్యమైన అన్నంతోబాటు సాంబారు, రసం, మజ్జిగ, చక్కెరపొంగలి, తాళింపు(కర్రీ)ని అప్పటి వరకు వడ్డించేవారు. ఆ తరువాత గత ఏడాది మార్చి 6న మసాలవడ ప్రవేశపెట్టారు. రద్దీ పెరిగిన సమయాల్లో తరచూ అన్న ప్రసాదం భవనాన్ని టిటిడి తిరుమల అధికా రులు ఆకస్మికంగా తనిఖీ చేయడం, నాణ్యత రుచి వంటి వాటిపై భక్తుల నుండి అభిప్రాయాలు తెలుసుకోవడం చేస్తున్నారు. అన్నప్రసా దంలో అదనపు మెనూ మసాల వడ్డ పూర్తిగా టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు అభిప్రాయం తోనే అమలు చేశారనేది భక్తుల్లోనూ సదభిప్రాయంగా ఉంది. ఇంకా రానున్న రోజుల్లో అదనపు మెనూగా 'పప్పు' కూడా ప్రవేశపెట్టాలని భక్తుల నుండి సూచనలు, అభిప్రాయాలు వ్యక్తమయ్యాయని గతంలో బోర్డు సమావేశంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే అన్నప్రసాదంలో మసాల వడ వడ్డింపుపై గతంలో వైసిపి నాయకులు వ్యంగ్యాస్త్రాలు కూడా సంధించారు.

అయితే అన్నప్రసాదం విభాగానికి టిటిడిలో కొందరు పైఅధికారుల నుండి హుకుం జారీ అయిందో లేక కొనసాగుతున్న బోర్డుకు చెడ్డపేరు తీసుకురావాలనే ఆలోచన తోచిందో ఏమోగానీ గత 20రోజులుగా అన్నప్రసాదంలో అదనంగా వడ్డిస్తున్న మసాల వడకు సుస్తీచేసేశారు. ఇదివరకు రోజంతా ఉదయం 11గంటల నుండి రాత్రి 10గంటల వరకు నిరంతరాయంగా 75వేల వరకు తయారుచేసి వస్తున్న ప్రతిభక్తునికి వడ్డించే మసాల వడను ఏకంగా మధ్యాహ్నం ఒంటి గంట తరువాత కనిపించకుండా చేసేశారనేది అధిక శాతం మంది భక్తుల నుండి వస్తున్న విమర్శలు.

రెండువారాల క్రిందట గతనెల 18వ తేదీ తమిళనాడు తిరువళ్ళూరుకు చెందిన ఓ భక్తబృందం శ్రీవారి దర్శనం తరువాత అన్నప్రసాదం స్వీకరించడానికి తరిగొండ వెంగమాంబ భవనం వెళ్ళారు.

అక్కడ ఆ రోజు మధ్యాహ్నం 1.30గంటలకు అన్నప్రసాదంలో మసాల వడ్డ వడ్డించలేదు. ఈ విషయంగా అక్కడి సిబ్బందిని వాకబుచేస్తే లేదనే మాట వినిపించారు. భక్తులు కావడంతో సరిపెట్టుకుని వెళ్ళిపోయారు. తాజాగా గత శుక్రవారం తిరుపతికి, నెల్లూరుకు చెందిన ఇద్దరు భక్తులు అన్నప్రసాదం భవనానికి వెళ్ళారు. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో హాల్‌లో అన్నప్రసాదం స్వీకరించారు. వీరికి కూడా మసాలవడ అంద లేదు. వడలు తయారుచేయలేదేమోనని భావించి అన్న ప్రసాదాలు స్వీకరించి వచ్చేశారు.

ఈ విషయంపై 'వార్త'కు కొందరు భక్తులు సమాచారం అందించారు. సోమవారం మధ్యా హ్నం వార్త పరిశీలనలో వడ వడ్డించలేక పోవడం తెలిసింది. దీనిపై అన్నప్రసాదం విభాగం అధికారులను తెలుసుకున్నా పూర్తి స్థాయిలో వడలు వడ్డింపుకు కసరత్తు చేస్తున్నా మని, అరకొర వడలు తయారీ జరుగుతోందని, త్వరలోనే మరింత నాణ్యతగా రుచికరంగా వడలు తయారుచేసేలా చూసి భక్తులు అభినం దించేలా ఉంటుందని వివరణ ఇచ్చేశారు. వడల కొరత పై మాత్రం మాటదాటేశారు.

## జోరుగా పుష్కరిణి మరమ్మతు పనులు... పైపులైన్లు మార్పు



**తిరుమల, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో వేలపుణ్యతీర్థాలు కలిసే స్వామివారి పుష్కరిణి మరమ్మతులు, శుద్ధిచేసే పనులు వేగంగా సాగుతున్నాయి. గత పదిరోజులుగా పుష్కరిణిని పూర్తిగా మూసివేసిన టిటిడి ఇంజనీరింగ్ అధికారులు ఈ నెలరోజుల పాటు వివిధ రకాల మరమ్మతు పనులు చేస్తారు. ఈ నెలరోజులు భక్తులు స్నానాలాచరించేందుకు వరాహస్వామి ఆలయం సమీపంలో స్నాన కుళాయిలు ఏర్పాటుచేశారు. ప్రతి ఏటా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ముందు నెలరోజులపాటు స్వామి పుష్కరిణి మూసివేసి మరమ్మతులు చేపట్టడం పరిపాటి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరగనున్న వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ముందుగానే తిరుమలలోని పవిత్ర పుష్కరిణిని మరమ్మతులు మొదలుపెట్టారు. ఇప్పటికే పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి పైపులైన్ల మరమ్మతులు, సివిల్‌పనులు చేపడుతున్నారు. దీని కారణంగా నెలరోజులు పుష్కరిణి హారతి కూడా రద్దుచేశారు. అదనంగా మరో 10రోజులు సెప్టెంబర్ 10వరకు పుష్కరిణి మూసివేసేలా నిర్ణయం తీసుకున్నారు. స్వామిపుష్కరిణిలో నీరు నిల్వఉండే అవకాశం లేదు. పుష్కరిణిలోని నీటిని శుద్ధిచేసి తిరిగి వినియోగించేందుకు అత్యుత్తమ రీసైక్లింగ్ వ్యవస్థ అందుబాటులోఉంది.

## తిరుమల సమాచారం



## మలయప్పకు రెండు గరుడసేవలు

### - భక్తులకు ఆధ్యాత్మిక సదవకాశం

**తిరుమల, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో శ్రీవారి ఉత్సవమూర్తి మలయప్పస్వామికి ఈనెలలో రెండుసార్లు గరుడసేవ జరుగుతుంది. సాధారణంగా నెలలో పౌర్ణమిన గరుడసేవ జరుగుతుంది. ఈనెల 17వతేదీ సోమవారం గరుడపంచమి పర్వదినాన ఆరోజు రాత్రి మలయప్పస్వామి గరుడుని అధిరోహించి ఆలయ మాఢవీధుల్లో ఊరేగుతారు. అలాగే 28న శ్రావణ పౌర్ణమి పర్వదినం సందర్భంగా పౌర్ణమి గరుడ సేవ అత్యంత వైభవంగా జరగనుంది. సర్వాంగ సుందరంగా ముస్తాబైన మలయప్పస్వామి గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించనున్నారు. దివ్యాభరణాలు ధరించే మలయప్పస్వామి జగన్మోహన రూపంలో గరుడ వాహనంపై అధిష్ఠించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తారు. బ్రహ్మోత్సవాలకు ముందు నెలలో రెండు సార్లు గరుడసేవ జరగనుండటంతో భక్తులకు ఆధ్యాత్మిక తన్మయత్వంతో తిరుమల వీధులన్నీ మారుమోగనున్నాయి. 108 వైష్ణవ దివ్య దేశాలలో గరుడ వాహనసేవకు ఎంతో పవిత్రమైన స్థానం ఉంది. శ్రీమహావిష్ణువు పరమ భక్తుడు, వాహనమైన గరుడుడు వేద స్వరూపానికి, ఆధ్యాత్మిక జ్ఞానానికి వైరాగ్యానికి ప్రతీక. తనను సంపూర్ణ విశ్వాసంతో శరణు కోరిన భక్తులకు భగవంతుడు అందించే అపారమైన అనుగ్రహానికి ఈ సేవ నిదర్శనమని పండితులు చెబుతుంటారు. గరుడ వాహనంపై ఉన్న స్వామి వారిని దర్శించుకోవడం వల్ల పూర్వ జన్మల పాపాలు తొలగిపోవడమే కాకుండా, మనశ్శాంతి, సకల ఐశ్వర్యాలు లభిస్తాయని భక్తుల నమ్మకం.

## 14న ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం



**తిరుమల, ఆగస్టు 11 ప్రభాత వార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యం లోని తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో ఈనెల 14న శుక్రవారం ఆండాళ్ అమ్మ వారి తిరువడిపురం ఉత్సవం భక్తిశ్రద్ధలతో వైభవం గా నిర్వహించనున్నారు. ఆండాళ్ అమ్మవారి శాత్తుమొర సందర్భంగా ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు గోవిందరాజస్వామి ఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల వరకు గోవిందరాజస్వామి ఆండాళ్ అమ్మవారిని అలిపిరికి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి ఆస్థానం నిర్వహిస్తారు. ప్రత్యేక పూజల అనంతరం అలిపిరి నుంచి గీతామందిరం, రామనగర్ క్వార్టర్స్, వైఖానసాచార్యుల వారి ఆలయం, ఆర్.ఎస్. మాడ వీధి, చిన్నజీయర్ మఠం మీదుగా స్వామి, అమ్మవార్ల ఊరేగింపు తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. ఈ పవిత్ర ఉత్సవంలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవారి దివ్య అనుగ్రహాన్ని పొందాలని టిటిడి కోరింది.

# వన్య ప్రాణి వేటగాళ్లు అరెస్టు




**కదిరి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ముదిగుబ్బ మండలం దొరిగల్లు ఈస్ట్ బీట్‌లో వన్య ప్రాణులను వేటాడేందుకు ప్రయత్నిస్తున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారి గుర్రప్ప తెలిపారు. మంగళవారం ఫారెస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గుర్రప్ప యిందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కసంబావి ప్రాతంలో వన్యప్రాణి వేట జరుగుతోందన్న సమాచారం తెలియడంతో అటవీశాఖ సిబ్బంది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నింధితులను అదుపులోకి తీసుకున్నానన్నారు. నార్పల మండలం రంగాపురంకి చెందిన రామాంజినేయులు, రాజేంద్ర బాబు, కుళ్లాయప్ప, ఉమా మహేష్, గంగన్న, యాదవ్, బత్తలపల్లికి చెందిన ముత్తాలయ్య, ఆంజినేయులను అరెస్టు చేసి వారి నుంచి ఒక ఆలువ, ఒక ద్విచక్ర వాహనం, ఒక నాటు తుపాకీ, గన్ పౌడర్‌ను స్వాధీనం చేసుకుని న్యాయ స్థానంలో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. వన్య ప్రాణులను వేటాడినా, అడవుల్లో ఆయుధాలతో సంచరించినా ఎట్టపరిస్థితుల్లోనూ ఉపేక్షించమని గుర్రప్ప హెచ్చరించారు.

# కణేకల్లు రోడ్డు రైల్వే వంతెనకు త్వరలో మోక్షం

## ప్రజా ప్రతినిధులకు కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న హామీ

**గుంతకల్ రైల్వే ఆగష్టు 11: ప్రభాత వార్త :** దక్షిణ కోస్తా రైల్వే జోన్ గుంతకల్ డివిజన్ రాయదుర్గం పట్టణంలోని కనేకల్లు రహదారిపై గత ఏడేళ్లుగా అర్థాంతరంగా నిలిచిపోయిన రైల్వే వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను జిల్లా ప్రజాప్రతినిధులు కోరారు. ఢిల్లీలోని రైల్ భవన్‌లో మంగళవారం మంత్రి కార్యాలయంలో ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ బి. కె. పార్థసారథి కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాయదుర్గం పట్టణ పరిధిలోని కనేకల్లు అనంతపురం ప్రధాన రహదారులపై చేపట్టిన రైల్వే వంతెన నిర్మాణ పనులు గత ఏడేళ్లుగా నిలిచిపోయిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత సంవత్సరాల క్రితం రాయదుర్గం నుండి అనంతపురం, కనేకల్లు రెండు రైల్వే వంతెనల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం వివిధ కారణాలతో పనులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అనంతపురం రహదారిపై నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెన పనులను పూర్తి చేసేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అంగీకరించి రూ.46 కోట్లు మంజూరు చేసిందని ప్రజాప్రతినిధులు తెలిపారు. అయితే కనేకల్లు రోడ్డులోని రైల్వే వంతెన నిర్మాణాన్ని రైల్వే శాఖ ఆధ్వర్యంలోనే పూర్తి చేయాల్సి ఉందని వివరించారు. ముఖ్యంగా బళ్లారి-చిక్‌జాజూరు రైల్వే మార్గం డబ్లింగ్ పనులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో కనేకల్లు రహదారిపై ఉన్న రైల్వే వంతెన నిర్మాణానికి మరింత ప్రాధాన్యత ఏర్పడిందని వారు పేర్కొన్నారు. డబ్లింగ్ పనులు పూర్తయిన తర్వాత రాయదుర్గం-తుమకూరు రైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలు, రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఈ వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మంత్రికి వివరించారు. ప్రజాప్రతినిధుల విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న సానుకూలంగా స్పందించారు. వెంటనే రైల్వే బోర్డు సభ్యులతో పాటు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ వంతెన నిర్మాణాన్ని ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుల జాబితాలో చేర్చి, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కేంద్ర మంత్రి సానుకూల స్పందనతో ఏడేళ్లుగా నిలిచిపోయిన కనేకల్లు రైల్వే వంతెన నిర్మాణ పనులకు త్వరలో కదలిక వచ్చే అవకాశం ఉందని ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. వంతెన పూర్తయితే రాయదుర్గం పట్టణ ప్రజల రాకపోకలకు మెరుగైన సౌకర్యం కలగడంతో పాటు, భవిష్యత్‌లో పెరగనున్న రైల్వే రద్దీకి అనుగుణంగా రహదారి రవాణాకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరనుంది. కల్లూరు వద్ద వున్న రైల్వే అండర్ బ్రిడ్జి లో నిత్యం నీళ్లు నిలిచి ఉంటుదాని దీనివల్ల రెండువైపులా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు, వెంటనే చర్యలు చేపట్టాలని , మంత్రికి తెలిపేరు. కొండవీడు ఎక్స్‌ప్రెస్ రోజూ నడపాలని అనంతపురం ఎంపీ అంబికా మంత్రిని కోరారు.



రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న ను కలిసిన ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, ఎంపీలు అంబికా లక్ష్మీ మ్నారాయణ, పార్థసారథి

# బిసిలకు అదనంగా 20 వేల రూపాయలు సబ్సిడీ

## ఇపిడిసిఎల్ చైర్మన్ పృథ్వీ తేజ్

**విశాఖపట్నం (జ్ఞానాపురం), ప్రభాతవార్త:** సంప్రదాయ ఇంధన సౌర విద్యుత్ వినియోగం పెంచడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో పటిష్టంగా శ్రమిస్తున్నాయి. దీనిలో భాగంగా ఇప్పటికే రూఫ్ టాప్ సోలార్‌ను ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా అందిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ గృహాల పైకప్పులో సౌర విద్యుత్తు ఏర్పాటుకు ఈపీడీసీఎల్ద్ పూర్తి సహకారం అందిస్తున్నట్టు ఈపీడీసీఎల్ చైర్మన్ పృధ్వీరాజ్ తెలిపారు. ప్రభుత్వాలు తాజాగా వెనుకబడిన తరగతులకు కూడా మరింత ప్రోత్సాహం అందించడానికి ముందుకు వస్తున్నాయి. వెనుకబడిన తరగతుల (బీసీ) కు చెందినవారు నెలవారి వాడకం 200 యూనిట్లు లోపల ఉంటే వారికి ప్రస్తుత ఇస్తున్న రెండు కిలోవాట్లకు 60 వేల రూపాయలకు సబ్సిడీకి అదనంగా మరో 20,000 రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఛైర్మన్ యిమంది పృద్వి తేజ్ తెలిపారు. మంగళవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ ఈపీడీసీఎల్ పరిధిలో సూర్యఘర్ పథకం అమలవుతున్న విధివిధానాలను తెలియజేశారు. సోలార్ వేసుకునేందుకు ముందుగా వినియోగదారులు ఆన్లైన్లో ప్రైవేటు సోలార్ కంపెనీలను సంప్రదించి ఇంటి పై భాగంలో సోలార్ బిగించుకోవలెను. అనంతరం ఈపీడీసీఎల్ నెట్ మీటరింగ్ ద్వారా డిస్కంలకు అనుసంధానం చేస్తారు. వినియోగదారుడు వినియోగించిన విద్యుత్తు పోను మిగిలిన యూనిట్లకు ఒక్కో యూనిట్కు 2.09 రూపాయలు చెల్లింపు జరుగుతుంది. ఎస్సీ ఎస్టీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 1200 కోట్లు రూపాయలు వెచ్చిస్తున్నారు. ఈపిడిసిల్ పరిధిలో 80 వేల సూర్యఘర్ లబ్ధిదారులకు అవకాశం కల్పించినట్టు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఈ పథకం 80 శాతం ఈ పథకం అమలు కాగా పట్టణ ప్రాంతాల్లో 20 శాతం వేగంగా అమలవుతుంది. అని తెలియజేశారు.

### బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు

# పోక్సో కేసు నమోదు

**నాగలాపురం, ఆగస్టు 11 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా నాగలాపురం మండలం కొట్టగాడు గ్రామంలో 14 ఏళ్ళ బాలికపై లైంగిక ఉద్దేశంతో అసభ్యకరంగా ప్రవర్తించి, దాడికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో నాగలాపురం పోలీసులు పీవోసీఎస్‌వో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 9వ తేదీ రాత్రి బాలికపుస్తకం తీసుకుని ఇంటికి తిరిగి వెళుతుండగా, నాగరాజు అడ్డగించి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలిక అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయగా బ్లేడ్‌తో దాడి చేయడంతో గాయమైనట్లు తెలిపారు. రక్షించేందుకు వచ్చిన ఆమె 16 ఏళ్ళ సోదరుడిపై కూడా నిందితుడు దాడి చేసి గాయపరచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానికులు జోక్యం చేసుకుని, ఆమె సోదరుడిని రక్షించినట్లు తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగలాపురం పోలీస్‌స్టేషన్ క్రైమ్ నంబరు 78/2026 కింద బీఎన్ఎస్‌లోని సంబంధిత సెక్షన్లతో పాటు పీవోసీఎస్‌వో చట్టంలోని సెక్షన్ 7ఆర్/డబ్ల్యు 8, 11ఆర్/డబ్ల్యు 12 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# జార్ఖండ్‌లో విద్యార్థులపై పోలీసుల దమనకాండను ఖండిస్తున్నాం

## రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరిని ప్రశ్నించిన ఎపి బిజెపి చీఫ్ పివియన్ మాధవ్

**విశాఖపట్నం: ఆగష్టు 11 ప్రభాత వార్త:** జార్ఖండ్ రాజధాని రాంచీలో తమ ఉపాధి, ఉద్యోగాలు, భవిష్యత్తు, హక్కుల కోసం శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరును ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తీవ్రంగా ఖండించారు . విశాఖపట్నం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన పత్రికా సమావేశంలో పీవీయన్ మాధవ్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్-జేఎంఎం ప్రభుత్వం అందుకు బదులుగా వారిపై లాఠీచార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం, వాటర్ క్యానన్లు ఉపయోగించడం, బారికేడ్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ హక్కుల కోసం నిరసన చేస్తున్న విద్యార్థులను అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పీవీఎన్ మాధవ్ అన్నారు. విద్యార్థులు తమ సమస్యలపై ప్రశ్నిస్తే వారిని శత్రువులుగా చూడటం కాంగ్రెస్-జేఎంఎం ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమన్నారు. మహిళా విద్యార్థుల పట్ల కూడా అనుచితంగా వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, ఈ ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని మాధవ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై దేశవ్యాప్తంగా మాట్లాడే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి జార్ఖండ్ విద్యార్థుల ఆవేదన ఎందుకు కనిపించడం లేదని పీవీఎన్ మాధవ్ సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో జరిగే ప్రతి నిరసనపై స్పందించే రాహుల్ గాంధీ, కాంగ్రెస్-జేఎంఎం ప్రభుత్వం అధికారంలో ఉన్న జార్ఖండ్‌లో విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యపై ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు. విద్యార్థుల భవిష్యత్తు కంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పోలీసులు విద్యార్థులపై చర్యలు తీసుకుంటే ఒక విధంగా, ఇతర రాష్ట్రాల్లో జరిగితే మరో విధంగా స్పందించడం కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి కాదా అని అన్నారు. విద్యార్థులకు మద్దతు ఇవ్వడంలో కూడా 'పాలిటిక్స్ ఆఫ్ కన్వీనియెన్స్' ఎందుకు పాటిస్తున్నారని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ నిజంగా విద్యార్థుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో ఉంటే జార్ఖండ్‌కు వెళ్లి విద్యార్థులను పరామర్శించి, వారి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని పీవీఎన్ మాధవ్ అన్నారు. గత కొద్ది రోజులుగా పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన సమయంలో గందరగోళం సృష్టించడమే కాంగ్రెస్ పార్టీ వైఖరిగా మారిందని పీవీఎన్ మాధవ్ విమర్శించారు. మొదట ఒక డిమాండ్, ఆ తర్వాత మరో డిమాండ్, ఇప్పుడు ఇంకో అంశాన్ని తెరపైకి తీసుకురావడం చూస్తుంటే రాహుల్ గాంధీ ప్రతిరోజూ తన 'గోల్‌పోస్ట్' ఎందుకు మారుస్తున్నారో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ సభను సజావుగా నడవనివ్వకుండా కాంగ్రెస్ పార్టీ ఎందుకు అడ్డుకుంటోందని ప్రశ్నించారు. కేంద్ర హోంమంత్రి సభలో ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని కేంద్ర మంత్రులు స్పష్టం చేస్తున్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ చర్చ నుంచి ఎందుకు వెనక్కి వెళ్తోందని నిలదీశారు. చర్చకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వం.. చర్చకు సిద్ధంగా లేని ప్రతిపక్షం" అన్న పరిస్థితి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కనిపిస్తోందని పీవీఎన్ మాధవ్ విమర్శించారు. పార్లమెంట్ ప్రజా సమస్యలపై చర్చించాల్సిన వేదిక అని, రాజకీయ గందరగోళానికి వేదిక కాదని అన్నారు. ఆగస్టు 10న నిర్వహించిన విలేకరుల సమావేశంలో జంతర్ మంతర్ ఘటనకు సంబంధించి రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై వాస్తవాలను దేశ ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉందని పీవీఎన్ మాధవ్ అన్నారు. జంతర్ మంతర్ వద్ద బుల్లెట్లు పేల్చినట్లు చేసిన ఆరోపణలకు ఆధారాలు ఏమిటో రాహుల్ గాంధీ దేశ ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం నిర్ధారణ లేని ఆరోపణలు చేయడం, వాటి ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడి లక్షణం కాదని అన్నారు. "రాహుల్ గాంధీ గారూ.. ఆరోపణలు చేయడం కాదు.. ఆధారాలు చూపించండి" అని పీవీఎన్ మాధవ్ సవాల్ చేశారు. రాహుల్ గాంధీ పారిపోవద్దని, చర్చకు భయపడవద్దని పీవీఎన్ మాధవ్ అన్నారు. కేంద్ర హోంమంత్రి పార్లమెంట్‌లో సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, కాబట్టి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌ను సజావుగా నడవనివ్వాలని కోరారు. చర్చ జరగాలని, వాస్తవాలు దేశ ప్రజల ముందుకు రావాలని అన్నారు. రాహుల్ గాంధీ వద్ద ఏవైనా ఆధారాలు ఉంటే వాటిని పార్లమెంట్‌లో పెట్టాలని, వాటిపై ప్రభుత్వం సమాధానం ఇస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లపై కాంగ్రెస్-జేఎంఎం ప్రభుత్వం వెంటనే చర్చించి పరిష్కారం చూపాలని కోరారు. విద్యార్థులపై అధిక బలప్రయోగానికి బాధ్యులైన అధికారులపై విచారణ జరిపి, తప్పు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా విద్యార్థులు చేసిన ఆరోపణలపై ప్రత్యేకంగా విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచాలని అన్నారు. భారతీయ జనతా పార్టీ జార్ఖండ్ విద్యార్థులు, యువతకు అండగా నిలుస్తుందని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. యువత భవిష్యత్తు రాజకీయాలకు బలికావడానికి వీల్లేదని అన్నారు. విద్యార్థుల హక్కులు, ఉద్యోగాలు, భవిష్యత్తు కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడే ప్రతి విద్యార్థికి బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తన ద్వంద్వ వైఖరిని విడనాడి విద్యార్థుల సమస్యలను రాజకీయ కోణంలో చూడకుండా పరిష్కరించేందుకు ముందుకు రావాలని పీవీఎన్ మాధవ్ కోరారు

# దగా డీఎస్సీపై సిబిఐ విచారణ జరపాలి

**పుత్తూరురూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యువత, విద్యార్థుల భవిష్యత్‌లో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ డీఎస్సీ నియామకాల్లో పేపర్ లీక్, అక్రమాలు, అవకతవకలు, స్పోర్ట్స్ కోటా నియామకాలపై వచ్చిన ఆరోపణలపై తక్షణమే సీబీఐ విచారణ జరపాలని, నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైసీపీ డిమాండ్ చేసింది. వైసీపీ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపు మేరకు మాజీ మంత్రి రోజా ఆధ్వర్యంలో పుత్తూరులో కార్యక్రమం నిర్వహించారు. డీఎస్సీ పరీక్షకు లక్షలాది మంది అభ్యర్థులు హాజరైన నేపథ్యంలో పరీక్ష నిర్వహణపై వచ్చిన ఆరోపణలు, స్పోర్ట్స్ కోటాలో జరిగిన నియామకాలపై ఉన్న అనుమానాలను ప్రభుత్వం వెంటనే నివృత్తి చేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని పేద విద్యార్థులకు సంబంధించిన రూ.7,200 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగయువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# ఎర్ర చందనం దుంగలు పట్టివేత



**కదిరి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** కడప జిల్లా నుంచి బెంగలూరుకు అక్రమంగా ఎర్ర చందనం దుంగలను తరలిస్తున్న ఇన్నోవా వాహనాన్ని స్వాధీనం చేసుకుని నింధితులను అరెస్టు చేసినట్లు కదిరి అటవీశాఖ అధికారి గుర్రప్ప తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కదిరి అటవీశాఖ అధికారి గుర్రప్ప మాట్లాడుతూ.. శ్రీ సత్యసాయి జిల్లా తలుపుల మండలం పెద్దన్నవారిపల్లి సమీపంలోని పోలేకనుమ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు అనుమానా స్పదంగా వెళ్తున్న ఇన్నోవా వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా కొంత దూరం వాహనాన్ని నిలిపి ముగ్గురు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించారన్నారు. అప్రమత్తమైన అటవీశాఖ సిబ్బంది వారిని వెంబడించి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి కడప జిల్లా బ్రహ్మం గారి మటం మండలం లింగాలదిన్నె గ్రామానికి చెందిన బంగారు రెడ్డిగా గుర్తించారన్నారు. పరారైన ఇద్దరు నింధితులు మైదుకూరుకు చెందిన కృష్ణయ్య, వెంకటేశ్వర్లుగా తెలిపారన్నారు. ఇన్నోవా వాహనాన్ని స్వాధీనం చేసుకుని, అనంతరం తిరుపతి ఎర్ర చెందనం న్యాయస్థానంలో హాజరు పరిచామన్నారు. ఈ సమావేశంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి బ్రహ్మయ్య, బీట్ ఆఫీసర్లు నరసింహామూర్తి, ఆర్.శ్రవంతిలు పాల్గొన్నారు.

# డిష్‌క్లీనింగ్ స్క్రబ్బర్ల కుంభకోణంపై సిట్ విచారణ ప్రారంభం

**విజయవాడ, ఆగస్టు 11,ప్రభాతవార్తప్రతినిధి:** మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ డిష్‌క్లీనింగ్ స్క్రబ్బర్ల కుంభకోణంపై సిట్ విచారణ ప్రారంభించింది. ఈ వ్యవహారంలో తాజా సమాచారాన్ని అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 700 మంది బాధితులనుంచి మాషాఅల్లా ఎంటర్‌ప్రైజెస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసారు. వీరంతా కంపెనీకి చెల్లించిన మొత్తం రూ.10 కోట్లుగా అంచనా వేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న బాధితుల నుంచి అధికారులు వివరాలు సేకరించి నమోదు చేస్తున్నారు. అతను ప్రతి డిపాజిటర్‌కు నాన్‌జ్యుడీషియల్ స్టాంప్ పేపర్‌పై తయారు చేసిన బాండ్లను జారీ చేశాడు. పోలీసులను ఆశ్రయిస్తున్న వారితో పాటు, వాస్తవంగా జారీ చేసిన బాండ్ల మొత్తం సంఖ్యను నిర్ధారించడంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఈ సమాచారం కోరుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగానికి ఒక లేఖ పంపించారు. అందిన వివరాల ఆధారంగా బాధితుల తుది సంఖ్యను నిర్ధారించే అవకాశం ఉంది. నిందితుల ఫోన్ నంబర్లకు అనుసంధానించిన బ్యాంక్ ఖాతా వివరాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. సిట్ విచారణ ప్రాథమిక స్థాయిలో డిష్‌క్లీనింగ్ స్క్రబ్బర్ల కుంభకోణంలో భాగమైన మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ సంస్థ నిర్వాహకుడు పసుపులేటి అంకుశం పాల్పడిన మోసపూరిత కార్యకలాపాలకు సంబంధించిన పలుఅంశాలను గుర్తించింది. అతను డిపాజిట్లు సేకరించి, స్క్రబ్బర్లను ప్యాకేజింగ్ చేసే పనిని వ్యక్తులకు అప్పగించాడు. అయితే, ప్యాక్ చేసిన వస్తువులను అమ్మకుండా, వాటిని గిడ్డంగులలో నిల్వ చేశాడు. ఇదంతా ముందుగా ప్లాన్ చేసుకున్న పథకంలో భాగంగా జరిగిందంటున్నారు. ఉత్పత్తులను మార్కెట్‌లో అమ్ముతున్నారని, దాని ద్వారా వచ్చే లాభాలను డిపాజిటర్లకు నెలవారీ "జీతాలు" చెల్లించడానికి ఉపయోగిస్తున్నారని ప్రజలను నమ్మించి అతను పెద్ద మొత్తంలో డబ్బును సేకరించాడు. వీలైనన్ని ఎక్కువ డిపాజిట్లు సేకరించి, ఆ తర్వాత కార్యకలాపాలను మూసివేయడమే అతని పథకం అని నిర్ధారించారు. అతను పశ్చిమ బెంగాల్ నుంచి ముడి పదార్థాలను సేకరించాడు, తన జీఎస్టీ ఫైలింగ్‌లలో నిర్దిష్ట పార్టీలకు చేసిన అమ్మకాలను ప్రకటించలేదు. కార్యాలయంలో పోలీసులు జరిపిన తనిఖీలలో ఎటువంటి ముఖ్యమైన ఆధారాలు లభించలేదు. కేవలం ఒక కంప్యూటర్ మాత్రమే దొరికింది. అధికారులు ప్రస్తుతం దానిలోని డేటాను విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలో ఈ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ ప్రారంభించింది. నిందితుడు అంకుశం కడప వాస్తవ్యుడని వెల్లడైంది. అతను కడపలో మహ్మద్‌అనే పేరుతో కంపెనీని రిజిస్టర్ చేశాడు. మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 45 చిన్న గిడ్డంగులను నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ వ్యాపారంలోకి ప్రవేశించడానికి ముందు, నిందితుడు కోళ్ల పెంపకం, పశువుల దాణా వ్యాపారంలో ఉండేవాడు. అతను డిపాజిటర్లకు ఒక్కో స్క్రబ్బర్‌ప్యాకేజింగ్ యంత్రాన్ని రూ.30,000కు విక్రయించాడు. అయితే ఆ యంత్రం అసలు ఖరీదు రూ.7,000 నుంచి రూ.10,000 మధ్య ఉంటుందని అంచనా. ఈ విధంగా అతను పంపిణీదారులను, డిపాజిటర్లను అన్ని విధాలుగా మోసం చేశాడు. 10వ తేదీన బకాయి జీతాలు చెల్లిస్తానని వాట్సాప్ సందేశాలు పంపినప్పటికీ, అతను కార్యాలయానికి హాజరు కాలేదు. ఇక ఈ కేసులో పోలీసులను ఆశ్రయిస్తున్న వారితో పాటు, వాస్తవంగా జారీ చేసిన బాండ్ల మొత్తం సంఖ్యను నిర్ధారించడంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఈ సమాచారం కోరుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగానికి ఒక లేఖ పంపించారు. అందిన వివరాల ఆధారంగా బాధితుల తుది సంఖ్యను నిర్ధారించే అవకాశం ఉంది. నిందితుల ఫోన్ నంబర్లకు అనుసంధానించిన బ్యాంక్ ఖాతా వివరాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. అయితే, ఇప్పటివరకు నిందితుల ఆచూకీ లభించలేదు.

# మైనారిటీల సంక్షేమానికి మరింత బాధ్యతగా పనిచేస్తా : కూరపాటి జాన్ పాల్

**విజయవాడ,ఆగస్టు 11,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధానమంత్రి నూతన 15 పాయింట్ల కార్యక్రమం కింద మైనారిటీల సంక్షేమ పథకాల అమలు, పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీలో సభ్యునిగా కూరపాటి జాన్ పాల్ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని కమిటీ సభ్యులు జాన్ పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన అన్నారు. ముఖ్య కార్యదర్శి అధ్యక్షతన పనిచేసే ఈ కమిటీ రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమ పథకాల అమలును కాలానుగుణంగా పర్యవేక్షిందన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి ఎండి ఫారూఖ్, మరియు తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా అందేలా తన వంతు బాధ్యతను నిజాయితీగా నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు. క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించి అర్హులకు న్యాయం జరిగేలా చూస్తానని, ప్రత్యేకంగా క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించి లబ్ధి చేకూరేలా కృషి చేస్తానన్నారు.

# చిలకలూరిపేట మండలంలో అనారోగ్యంతో జింక మృతి

**చిలకలూరిపేట,ఆగస్టు11 ప్రభాతవార్త:** చిలకలూరిపేట రూరల్ పరిధిలోని కమ్మవారిపాలెం గ్రామ సమీపంలో పోలేరమ్మ గుడి ఎదురుగా ఉన్న పంట కాలువ పక్కన ఒక జింక మృతి చెందడం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే అప్రమత్తమై ఘటనాస్థలికి చేరుకున్నారు. కోటప్పకొండ బీట్ ఆఫీసర్ కిరణ్ ఆధ్వర్యంలో అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించగా, పశువైద్యులు జింక మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. కేవలం అనారోగ్యంతోనే ఇది మృతి చెందిందని స్పష్టమైంది. ఈ సందర్భంగా అటవీ ప్రాంతం చుట్టుపక్కల ఎక్కడైనా వన్యప్రాణులు మృతి చెందినా లేదా గాయపడినా ప్రజలు వెంటనే తమకు సమాచారం అందించి, వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని అటవీశాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# భాకరాపేట ఘాట్‌లో కోళ్ల వ్యాన్ బోల్తా

## మానవ దౌర్భల్యం .. కోళ్లను దోచుకున్న వైనం

**చంద్రగిరి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** భాకరాపేట ఘాట్ రోడ్డుపై మంగళవారం అదుపుతప్పిన కోళ్ళ వ్యాన్ బోల్తాపడింది. ప్రమాదం తీవ్రతకు వ్యాన్‌లోని కోళ్ళు రోడ్డుపై, ప్రక్కన చెల్లాచెదురుగా పడిపోయాయి. అయితే మాన ధౌర్భల్యం ప్రమాదానికి గురైన వారి కష్టాన్ని, నష్టాన్ని పట్టించుకోకుండా అందినకాడికి కోళ్ళను దోచుకుపోవడం జుగుప్స కలిగించింది. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని బోల్తాపడిన వ్యాన్‌ను ఈ ప్రాంతం ప్రజల సహాయంతో తొలగించారు. అయితే పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు రాకపోవడంతో బాధితులు వ్యాన్‌తో అక్కడి నుండి వెళ్ళిపోగా ప్రయాణికులు, స్థానికులు కోళ్ళను తీసుకుని వెళ్ళిపోయారు.

# నేడు వైసిపి శాసనసభా పక్ష సమావేశం

**విజయవాడ.ఆగస్టు11,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ అధ్యక్షతన ఈ నెల12న తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులతో సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, ప్రజా సమస్యలు, పార్టీ చేపట్టాల్సిన తదుపరి కార్యక్రమాలు తదితర కీలక అంశాలపై చర్చించి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వైయస్ జగన్ దిశానిర్దేశం చేయనున్నారు. ఈ నెల 17 నుంచి అసెంబ్లీ సమావేశాలు నాలుగు రోజులపాటు జరగనున్న నేపథ్యంలో జగన్ శాసన సభా పక్ష సభ్యుల సమావేశం నిర్వహించడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశం కానున్నది, ఈ పర్యాయం అసెంబ్లీ సమావేశాలకు జగన్ హాజరయ్యే అవకాశాలు ఉన్నాయంటున్నారు

# ఎఐ ఆధారిత పన్నుల నిర్వహణలో ఎపి అగ్రగామి

## ●ప్రభుత్వ ప్రయత్నాన్ని అభినందించిన జిఎస్‌టి కౌన్సిల్ సభ్యులు

**విజయవాడ, ఆగస్టు 11,ప్రభాతవార్తప్రతినిధి:** పన్నుల నిర్వహణ విధానంలో కృత్రిమ మేథస్సు, డేటా ఆధారిత విశ్లేషణలను వినియోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఎదుగుతూ మిగలిన రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. పన్నుల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సును ఉపయోగించుకుంటున్న తీరును అధ్యయనం చేయడానికి జీఎస్టీ కౌన్సిల్ సభ్యులు ప్రత్యేకంగా రాష్ట్రానికి వచ్చారు. జీఎస్టీ కౌన్సిల్ సెక్రటరియేట్ అదనపు కార్యదర్శి పంకజ్ కుమార్సింగ్, సంయుక్త కార్యదర్శి డి.పి. మిశ్రాలతో కూడిన బృందం సోమవారం రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయాన్ని సందర్శించింది. పన్నుల నిర్వహణలో ఏఐ అమలు చేస్తున్న తీరును స్వయంగా పరిశీలించి అధ్యయనం చేసింది. ఈ బృందాన్ని రాష్ట్ర వాణిజ్యపన్నుల ప్రధాన కమిషనర్ బాబు ఏ, అధికారులు స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం పన్నుల నిర్వణలో ఏఐ వినియోగిస్తున్న తీరుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జీఎస్టీ కౌన్సిల్ అధికారులకు వివరించారు. రిజిస్ట్రేషన్లు, రిటర్నులు, ఆదాయపన్ను, వృత్తిపన్ను, పన్నుల బకాయిలు, ఆడిట్లు, తనిఖీలు, పరిశీలన వంటి విభాగాల్లో ఏఐ ఆధారిత డ్యాష్ బోర్డులను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఈ సందర్భంగా ప్రదర్శించారు. ప్రధానంగా రాబడికి సంబంధించి డ్యాష్ బోర్డు, ఈవే బిల్ డ్యాష్ బోర్డులు జీఎస్టీ కౌన్సిల్ అధికారులను ఆకట్టుకున్నాయి. ఈవే బిల్ డేటా ఆధారంగా ఎస్‌జీఎస్టీ నగదు చెల్లింపులు, ఐజీఎస్టీ సెటిల్మెంటును అంచనా వేసేందుకు ఈ వేబిల్ డ్యాష్ బోర్డు ఉపయోగడపుతుందని, తద్వారా ఆదాయ పర్యవేక్షణకు కీలక సమాచారం లభిస్తుందని అధికారులు వివరించారు. స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తికి జీఎస్‌డీపీకి ప్రధాన సూచికగా జీఎస్టీ డేటాను వినియోగిస్తున్న విధానం, తక్షణ అంచనాల కోసం అనుసరిస్తున్న పద్ధతిని కూడా అధికారులు వివరించారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేకించి ఏఐ ఏజెంటు ద్వారా నివేదికలు, డ్యాష్ బోర్డులు రూపొందిస్తున్న తీరును జీఎస్టీ కౌన్సిల్ బృందానికి ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించారు. ఏఐ వినియోగించి వివిధ రంగాలకు సంబంధించి అధ్యయనాలు, సమాచారంతో ఒక నాలెడ్జ్ హబ్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నామని వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమీషన్ బాబు ఏ వివరించారు. గతంలోలా కాకుండా పన్నులకు సంబంధించి ఆడిట్, కేసుల ఎంపిక, అవకతవకల గుర్తింపు ప్రక్రయ నుంచి నోటీసుల జారీ, పన్ను చెల్లింపుదారుల స్పందనల పరిశీలన, వాటిపై తుదినిర్ణయం వరకు మొత్తం ప్రక్రియను ఏఐ నిర్వహించేలా చేస్తున్నామని చెప్పారు. దీనికి సంబంధించి రిటర్న్ల పరిశీలన, ఆడిట్, తనిఖీ ప్రక్రియలను ప్రతినిధి బృందం ప్రత్యక్షంగా తిలకించింది. పన్నుల నిర్వహణ విధానాన్ని మరింత బలోపేతం చేయడానికి మైక్రోసాఫ్ట్, గూగుల్ సంస్థల ఏఐ ఇంజిన్లను వాణిజ్య పన్నుల శాఖ వినియోగించుకుంటోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ లీగల్ కేస్ మేనేజ్మెంట్ సిస్టమ్‌తో అనుసంధానమై పనిచేసే లీగల్ ఏఐ మాడ్యూల్ ను కూడా జీఎస్టీ కౌన్సిల్ సభ్యులు తిలకించారు. దీనిద్వారా వాణిజ్య పన్నుల శాఖకు సంబంధించిన కేసులను గుర్తించడం, ప్రభుత్వ న్యాయవాదులకు అవసరమైన సూచనల తయారీలో సహకరించడం, అప్పీళ్ల అధికారులు, జీఎస్టీఏటీ, హైకోర్టు, సుప్రీం కోర్టు ముందున్న కేసులను పర్యవేక్షించడం వంటి పనుల నిర్వహణకు ఈ మాడ్యూల్ ఉపయోగపడుతుందని అధికారులు వివరించారు.



ఎస్టీ కౌన్సిల్ సెక్రటరియేట్ అదనపు కార్యదర్శి పంకజ్ కుమార్సింగ్, సంయుక్త కార్యదర్శి డి.పి. మిశ్రాలతో ఏపీ వాణిజ్యపన్నుల ప్రధాన కమిషనర్ బాబు

### ఆదర్శప్రాయంగా ఉన్నాయి

జీఎస్టీ కౌన్సిల్ సభ్యులు ప్రభుత్వ పన్నుల నిర్వహణ విధానంలో ఏఐ, డేటా విశ్లేషణ లాంటి సాంకేతికతను అందిపుచ్చుకుని రాష్ట్ర రాబడి పెంచుకునే దిశగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న చొరవ, కృషి మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా ఉందని జీఎస్టీ కౌన్సిల్ సెక్రటరియేట్ అధనపు కార్యదర్శి పంకజ్ కుమార్ సింగ్ అన్నారు. దీనిద్వారా పన్నుల రాబడి, పన్నుల నిర్వహణ విధానాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి దోహదపడుతుందన్నారు. ఏపీ రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తోందని కొనియాడారు.

# రోహిత్, విరాట్, బుమ్రా రీఎంట్రీ




## బంగ్లాదేశ్‌తో వన్డే సిరీస్‌కు టీమిండియా కూర్పు

**న్యూఢిల్లీ:** సెప్టెంబర్‌లో జరగనున్న బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియాను పంపించేందుకు బిసిసిఐ సన్నాహాలు చేస్తోంది. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం దిగ్గజ ఆటగాళ్లతో కూడిన 15 మంది సభ్యుల భారత జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు విజ్ఞప్తి మేరకు సెప్టెంబర్ 1 నుంచి 6 వరకు జరగాల్సిన మూడు వన్డేల సిరీస్ కోసం టీమిండియాను పంపించేందుకు బిసిసిఐ కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరేందుకు సిద్ధమైంది. కేంద్ర సర్కార్ నుంచి పచ్చజెండా లభిస్తే భారత జట్టు వెంటనే అక్కడకు పయనమవుతుంది. ఈ క్రమంలోనే సీనియర్లు, యంగ్ ప్లేయర్ల కలయికతో ఒక పటిష్టమైన 15 మంది సభ్యుల స్క్వాడ్‌ను సిద్ధం చేసేందుకు సెలెక్టర్లు కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా లార్డ్స్‌లో సెంచరీతో పాత ఫామ్‌ను రీ క్రియేట్ చేసిన రోహిత్ శర్మకు మరో అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. యశస్వి జైస్వాల్‌ను బ్యాకప్ ఓపెనర్‌గా ఎంపిక చేసే అవకాశం ఉంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ వన్డే సిరీస్‌కు శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే యోచనలో మేనేజ్‌మెంట్ ఉంది. వైస్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ వ్యవహరించే అవకాశాలను పరిశీలిస్తోంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా ఈ జట్టులో కొనసాగనున్నాడు. వికెట్ కీపింగ్ విభాగంలో మొదటి ప్రాధాన్యతగా కేఎల్ రాహుల్ ఉండగా, రెండో వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌ను జట్టులోకి తీసుకోనున్నారు. యువత, అనుభవజ్ఞుల కలయికతో కూడిన ఈ బ్యాటింగ్ లైనప్ బంగ్లాదేశ్ పరిస్థితుల్లో భారీ స్కోర్లు సాధించడానికి బాగా ఉపయోగపడుతుందని సెలక్టర్లు భావిస్తున్నారు. రైట్ ఆర్మ్ పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌తో మళ్లీ వన్డే జట్టులోకి అడుగుపెట్టడం దాదాపు ఖాయంగా మారింది. దీంతో శివమ్ దూబేకు చోటు దక్కకపోవచ్చు.

స్పిన్ విభాగంలో ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లతో పాటు ప్రధాన స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ఎంపికయ్యే సూచనలు ఉన్నాయి. పేస్ విభాగానికి స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా నాయకత్వం వహించనున్నాడు. అతడితో పాటు మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్ బౌలింగ్ దళంలో ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రసిద్ధ్ కృష్ణస్థానంలో సిరాజ్‌కు జట్టులో చోటు లభించవచ్చని భావిస్తున్నారు. యువ ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా, ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ ఇంకా గాయాల నుంచి పూర్తిస్థాయిలో కోలుకోలేదు. దాంతో ఈ ఇద్దరు ఆటగాళ్లు బంగ్లాదేశ్ పర్యటనకు అందుబాటులో ఉండటం కష్టమేనని క్రీడా వర్గాలు చెబుతున్నాయి.




## వెస్టిండీస్ కొంపముంచిన అఫ్గాన్

### వరల్డ్ కప్ డైరెక్ట్ క్వాలిఫికేషన్‌కు దూరం

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్ జట్టుకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఒకప్పుడు క్రికెట్ రారాజుగా వెలుగొందిన వెస్టిండీస్ దారుణమైన ప్రదర్శనతో పాతాళానికి పడిపోయి వన్డే ప్రపంచకప్ 2027 టోర్నీకి నేరుగా అర్హత సాధించలేకపోయింది. గత వన్డే ప్రపంచకప్ 2023 టోర్నీ కూడా వెస్టిండీస్ నేరుగా అర్హత సాధించకపోగా, క్వాలిఫయర్స్‌లోనూ పసికూన జట్లతో ఓడి టోర్నీకి దూరమైంది. క్వాలిఫయర్స్‌లోనూ పేలవ ప్రదర్శనతో టోర్నీకి అర్హత సాధించలేదు. ఇప్పుడు కూడా వెస్టిండీస్ అదే పరిస్థితి ఎదుర్కొంటుంది. తాజాగా ఐర్లాండ్‌తో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ విజయం సాధించి ప్రపంచకప్ బెర్త్‌ను దక్కించుకుంది. దాంతో వెస్టిండీస్ ఆశలు ఆవిరయ్యాయి. వన్డే ర్యాంకింగ్స్ ద్వారా నేరుగా టోర్నీకి అర్హత సాధించడానికి ఐసిసి ఈ సెప్టెంబర్ 30 వరకు డెడ్‌లైన్ విధించింది. వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్8లో ఉన్న దేశాలు నేరుగా అర్హత సాధిస్తాయి. ఈ 8 జట్లతో పాటు ఆతిథ్య దేశాలుగా ఉన్న సౌతాఫ్రికా, జింబాబ్వే కూడా క్వాలిఫై అవుతాయి. 8వ స్థానంతో అఫ్గాన్ నేరుగా క్వాలిఫై అయ్యింది. ప్రస్తుతం వన్డే టీమ్ ర్యాంకింగ్స్‌లో పదో స్థానంలో ఉన్న కరేబియన్ టీమ్, కటాఫ్ తేదీ నాటికి రెండు వన్డేలు మాత్రమే ఆడనుంది. ఆ రెండూ సెప్టెంబర్‌లో భారత్‌తోనే జరగనున్నాయి. ఆ రెండింటిలో గెలిచినా వెస్టిండీస్ టాప్8లో నిలవదు. ఆ జట్టు ప్రపంచకప్‌లో ఆడాలంటే ఫిబ్రవరి 2027లో నిర్వహించే క్వాలిఫయర్ టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. లేదంటే వరుసగా రెండోసారి ప్రపంచకప్‌నకు దూరమయ్యే ప్రమాదం ఉంది.

## రేప్ కేసులో.. ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్

# అభిషేక్ పోరెల్ అరెస్ట్



**న్యూఢిల్లీ:** భారత దేశవాళీ క్రికెట్‌తో పాటు, ఐపిఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున మెరుపులు మెరిపించిన యువ స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ తీవ్రమైన లైంగిక దాడి ఆరోపణల్లో చిక్కుకున్నాడు. రేప్, వేధింపుల కేసులో అభిషేక్‌ను పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్ట్‌చేశారు. పెళ్లిచేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకుని మోసం చేశాడని, బెదిరింపులకు పాల్పడ్డాడని కర్ణాటకకు చెందిన ఓ వైద్య విద్యార్థిని హుగ్లీలోని మొగ్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు హుగ్లీలోని ఎమామి సిటీలో 23 ఏళ్ల పోరెల్‌ను అదుపులోకి తీసుకుని, వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం చించురా న్యాయ స్థానంలో హాజరుపరిచారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం, 2023 జనవరి నుంచి అభిషేక్ పోరెల్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి, పోరెల్ తనతో శారీరక సంబంధం పెట్టుకున్నాడని సదరు విద్యార్థిని ఆరోపించింది. తాము కలిసి విదేశాలకు సైతం వెళ్లామని తెలిపింది. యేడాది కాలంగా వీరి మధ్య విభేధాలు తలెత్తాయి. ప్రశ్నించిన తనపై దాడి చేసి, బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితురాలు తన ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ కేసులో పోలీసులు సరైన చర్యలు తీసుకోవడం లేదని బాధితురాలు కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. ధర్మాసనం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, నిందితుడైన అభిషేక్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, అతడి వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను సీజ్ చేయాలని బెంగాల్ పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు కీలక ఆధారాలతో కూడిన పెన్ డ్రైవ్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి పోరెల్‌ను కస్టడీలోకి తీసుకున్నారు.

## సింక్‌ఫీల్డ్ కప్.. డ్రాతో ప్రజ్ఞానంద ప్రారంభం




**న్యూఢిల్లీ:** గ్రాండ్ చెస్ టూర్‌లోని చివరికి ముందు జరిగే ఈవెంట్ అయిన సింక్‌ఫీల్డ్ కప్ మొదటి రౌండ్‌లో, భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద అమెరికన్ జీఎం శామ్యూల్ సెవియన్‌తో డ్రా చేసుకుని తన ప్రయాణాన్ని పారంభించాడు.

మంగళవారం నల్ల పావులతో ఆడుతూ, ప్రజ్ఞానంద చాలావరకు నియంత్రణలో ఉన్న ఆటలో రూయ్ లోపెజ్ యొక్క ఆర్ఖంగెల్స్క్ వేరియేషన్‌ను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్నా ఇరు పక్షాలలో ఏ ఒక్కరికీ గెలిచేందుకు గట్టి అవకాశాలు లేకుండా పోయాయి. ఈ విధంగానే 48 ఎత్తుల పాటు సాగిన ఈ పోరు డ్రాగా ముగిసింది. 10 మంది ఆటగాళ్లు పాల్గొని, తొమ్మిది రౌండ్లు జరిగే ఈ టోర్నమెంట్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ ఫాబియానో కరువానా ఏకైక విజేతగా నిలిచాడు. ఆట మధ్యలో తన ప్రత్యర్థి ఒక పాన్‌ను కోల్పోయేలా చేసిన వ్యూహాత్మక తప్పిదాన్ని సద్వినియోగం చేసుకుని, ఈ అమెరికన్ ఆటగాడు డచ్ ఆటగాడైన జోర్డెన్ వాన్ ఫోరెస్ట్‌ను ఓడించాడు. కరువానా తనదైన కచ్చితత్వంతో వస్తుపరమైన ఆధిక్యాన్ని సద్వినియోగం చేసుకుని, 55 ఎత్తుల తర్వాత పూర్తి పాయింట్‌ను కైవసం చేసుకుని, టోర్నమెంట్‌లో తొలి ఆధిక్యాన్ని సాధించాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీదారు, ఉజ్బెకిస్తాన్‌కు చెందిన జవోఖిర్ సిందరోవ్, యునైటెడ్ స్టేట్స్‌కు చెందిన లెవాన్ అరోనియన్‌తో డ్రా చేసుకున్నాడు. నెదర్లాండ్స్‌కు చెందిన అనీష్ గిరి మరియు ఫ్రాన్స్‌కు చెందిన మాక్సిమ్ వాచియర్‌లగ్రావ్ రెండవ డ్రాను పూర్తి చేశారు. రూక్‌అండ్‌పాన్స్ ఎండింగ్‌కు చేరుకున్న ఈ మ్యాచ్, ఆటగాళ్లు స్ప్లిట్ పాయింట్‌కు అంగీకరించే వరకు పోటీగా కొనసాగింది.

## వన్డే వరల్డ్ కప్: అఫ్ఘాన్‌కు అర్హత

### ఐర్లాండ్‌పై 3 వికెట్ల తేడాతో గెలుపు



**న్యూఢిల్లీ:** ఐర్లాండ్‌పై విజయం సాధించి అఫ్గానిస్థాన్ వన్డే ప్రపంచ కప్-2027కు అర్హత సాధించింది. వన్డే మ్యాచ్‌లో అఫ్గాన్ 3 వికెట్లు తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ 46.3 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌట్ అయింది. గావిన్ హోయ్ 36 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, కేడ్ కారనఇమచల్ 32, జై మూంద్రా 31తో పర్వాలేదనిపించారు. అఫ్గాన్ బౌలర్లలో రషీద్‌ఖాన్, గజన్‌ఫర్ చెరో 3 వికెట్లతో విజృంభించగా, యామిన్ అహ్మద్‌జయ్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం అఫ్గానిస్తాన్ 44.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఓపెనర్ రహమనుల్లా గుర్బాజ్ 71 పరుగులతో అర్ధ సెంచరీ చేసి రాణించగా, చివర్లో రషీద్‌ఖాన్ 37 పరుగులతో నాటౌట్‌గా మెరుపు ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఐర్లాండ్ బౌలర్లలో గావిన్ హాక్షయ్ 4 వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో అఫ్గానిస్తాన్ 2-0తో ఆధిక్యంలో నిలిచింది.

## స్మాల్‌క్యాప్ ఫండ్లలో రికార్డు స్థాయి పెట్టుబడులు..

### డెట్ ఫండ్లకు భారీగా నిధులు




**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకాలలో పెట్టుబడులు గత జులైలో కొంత మందగించాయి. జూన్‌లో రూ.28,973 కోట్లుగా ఉన్న మొత్తం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ ఇన్‌ఫ్లోస్ జులైలో 15 శాతం తగ్గి రూ.24,697 కోట్లకు చేరాయి. ఈక్విటీ ఫండ్ పెట్టుబడులు మొత్తం మీద తగ్గినప్ప టికీ, అన్ని విభాగాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించలేదు. స్మాల్‌క్యాప్ ఫండ్లు పెట్టుబడిదారులను విశేషంగా ఆకర్షించాయి. జులైలో ఈ పథకాల్లోకి రూ.7,767 కోట్ల తాజా పెట్టుబడులు వచ్చాయి. ఈ విభాగానికి ఒక నెలలో వచ్చిన అత్యధిక పెట్టుబడులు ఇవే కావడం విశేషం. జూన్‌తో పోలిస్తే స్మాల్‌క్యాప్ ఫండ్లలోకి వచ్చిన పెట్టుబడులు 39 శాతం పెరిగాయి. దీంతో 11 ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ విభాగాల్లో నెలవారీ వృద్ధి పరంగా స్మాల్‌క్యాప్ ఫండ్లు అగ్రస్థానంలో నిలిచాయి. మిడ్‌క్యాప్ ఫండ్లు రూ.6,192 కోట్ల ఇన్‌ఫ్లోతో రెండో స్థానంలో నిలిచాయి. ఫ్లెక్సీక్యాప్ ఫండ్లలోకి రూ.4,709 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. లార్జ్ అండ్ మిడ్‌క్యాప్, మల్టీక్యాప్ ఫండ్లు కూడా జూలైలో సానుకూల ఇన్‌ఫ్లోలను నమోదు చేశాయి. ఈ రెండు విభాగాల్లో వరుసగా రూ.3,425 కోట్లు, రూ.3,227 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అయితే లార్జ్‌క్యాప్ ఫండ్ల నుంచి అత్యధికంగా రూ.1,321 కోట్లను ఇన్వెస్టర్లు ఉపసంహరించుకున్నారు. ఈఎల్ఎస్ఎస్ ఫండ్ల నుంచి రూ.959 కోట్ల ఔట్‌ఫ్లో నమోదైంది. డివిడెండ్‌యీల్డ్ ఫండ్లు, వ్యాల్యూ/కాంట్రా ఫండ్ల నుంచి కూడా వరుసగా రూ.169 కోట్లు, రూ.144 కోట్ల నిధులు బయటకు వెళ్లాయి. ఫోకస్డ్ ఫండ్లలోకి వచ్చిన పెట్టుబడులు గత నెలతో పోలిస్తే 43 శాతం తగ్గడం కూడా గమనార్హం. మరోవైపు మల్టీక్యాప్ ఫండ్లలో ఇన్‌ఫ్లోస్ 5 శాతం పెరగగా, స్మాల్‌క్యాప్ ఫండ్లు 39 శాతం వృద్ధితో డెట్ ఫండ్లలోకి ఏకంగా రూ.1.87 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అంతకుముందు రెండు నెలల్లో కలిపి రూ.2.06 లక్షల కోట్ల ఔట్‌ఫ్లో నమోదైన నేపథ్యంలో జూలై గణాంకాలు భారీ రికవరీని సూచిస్తున్నాయి.

## వేదాంత కొత్త కంపెనీల్లోకి రూ.1,300 కోట్ల నిధులు!




**న్యూఢిల్లీ,ఆగస్టు 11:** వేదాంత గ్రూప్ నుంచి విడిపోయి కొత్తగా ఏర్పడిన నాలుగు కంపెనీలు వేదాంత అల్యూమినియం మెటల్, వేదాంత ఆయిల్ అండ్ గ్యాస్, వేదాంత ఐరన్ అండ్ స్టీల్, వేదాంత పవర్‌లు సెప్టెంబర్ 2026లో జరగనున్న ఎన్ఎస్ఇ సూచీల పునర్వ్యవస్థీ కరణతో భారీగా ప్రయోజనం పొందే అవకాశం ఉందని అంచనాలు వెలువడ్డాయి. ఈ నాలుగు కంపెనీల్లోకి కలిపి సుమారు రూ.1,300 కోట్ల వరకు నిధులు రావచ్చు.ఇది ముఖ్యంగా ఇండెక్స్ ఫండ్లు, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు వంటి ఎన్ఎస్ఇ సూచీలను అనుసరించే పాసివ్ ఫండ్లపై ప్రభావం చూపనుంది. ఒక స్టాక్ సూచీలో చేరినప్పుడు, ఆ సూచీని అనుసరించే ఫండ్లు తమ పోర్ట్‌ఫోలియోలను సర్దుబాటు చేసి కొత్తగా చేరిన షేర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీంతో ఆయా కంపెనీల షేర్లకు అదనపు డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది. వేదాంత అల్యూమినియం మెటల్‌కే అత్యధిక వాటా దక్కనుంది. వేదాంత పవర్, వేదాంత ఐరన్ అండ్ స్టీల్ కంపెనీలకు మాత్రం తక్కువ స్థాయిలో పాసివ్ ఫ్లోస్ ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ఇప్పటికే ఈ కంపెనీల షేర్లను కలిగిఉన్న ఇన్వెస్టర్లకు స్వల్పకాలంలో ఇది సానుకూల పరిణామంగా మారవచ్చు. సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి కొనుగోళ్లు పెరగడం వల్ల షేర్లలో లిక్విడిటీ మెరుగుపడటంతో పాటు ధరలకు కొంత మద్దతు లభించే అవకాశం ఉంది. వేదాంత గ్రూప్ డీమెర్జర్ తర్వాత ఈ కంపెనీలు ప్రత్యేక సంస్థలుగా ఏర్పడిన నేపథ్యంలో ఈ పరిణామానికి మరింత ప్రాధాన్యత ఉంది. కొత్తగా పెట్టుబడి పెట్టాలనుకునే వారు కేవలం ఇండెక్స్ రీబ్యాలెన్సింగ్ ద్వారా వచ్చే అంచనా నిధుల ప్రవాహాన్ని ఆధారంగా చేసుకుని నిర్ణయం తీసుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తంగా, సూచీల రీబ్యాలెన్సింగ్ ఈ నాలుగు కొత్త వేదాంత కంపెనీల షేర్లకు డిమాండ్ పెంచే ఉత్ప్రేరకంగా పనిచేసే అవకాశం ఉన్నప్పటికీ, ఇది షేర్ ధర పెరుగుదలకు పెట్టుబడి హామీ మాత్రం కాదని నిపుణులు చెబుతున్నారు.

## వార్ ఎఫెక్ట్... నష్టాల్లో ముగిసిన బెంచ్‌మార్క్ సూచీలు




**ముంబయి, ఆగస్టు 11:** ముడిచమురు ధరలు పెరగడం, అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై ఆశలు సన్నగిల్లడంతో మళ్లీ భౌగోళిక రాజకీయ అనిశ్చితి నెలకొనడం దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపింది. మంగళవారం కీలక బెంచ్ మార్క్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. బ్యారెల్ ముడిచమురు ధర 90 డాలర్లకు చేరువ కావడంతో భారత్ దిగుమతి బిల్లు, ద్రవ్యోల్బణం, కంపెనీల లాభాల మార్జిన్లపై ఆందోళనలు పెరిగాయి. బలహీనమైన అంతర్జాతీయ మార్కెట్ సంకేతాలు కూడా దేశీయ మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. ఎఫ్ఎంసీజీ, మెటల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి నెలకొనడంతో నిఫ్టీ ఒత్తిడికి లోనయింది.

ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. బిఎస్ఇ సెన్సెక్స్ 388.19 పాయింట్లు నష్టపోయి 78,154.25 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 112.10 పాయింట్లు శాతం తగ్గి 24,471.70 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో మహీంద్ర 1.62 శాతం, ఎయిర్‌టెల్ 1.43 శాతం,యాక్సిస్‌బ్యాంకు 1.40 శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ దాదాపు మార్పు లేకుండా ముగియగా, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.24 శాతం లాభపడింది. బిఎస్ఇలో మొత్తం 2,033 షేర్లు లాభపడగా, 2,279 షేర్లు నష్టపోయాయి. మరో 209 షేర్లలో ఎలాంటి మార్పు కనిపించలేదు. కమోడిటీ మార్కెట్లో అక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర 2.14 డాలర్లు పెరిగి బ్యారెల్‌కు 89.86 డాలర్లకు చేరింది.ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా తగ్గింది. గత సెషన్‌లో 95.3050 వద్ద ముగిసిన పాక్షిక కన్వర్టబుల్ రూపాయి,

మంగళవారం 95.4450 వద్ద ట్రేడైంది.ఎంసిఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ 0.50 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,53,869కు చేరాయి.మ్యాట్రిమోనీ డాట్‌కామ్ షేరు 10.34 శాతం ఎగిసింది. కోల్టేపాటిల్ షేరు 11.48 శాతం దూసుకెళ్లింది.ఇండ్ స్విఫ్ట్ ల్యాబ్స్ షేరు 20 శాతం లాభపడింది. త్రివేణి టర్బైన్స్ షేరు 5.63 శాతం పడిపోయింది.

కంపెనీ ఏకీకృత నికర లాభం 20.78 శాతం తగ్గి రూ.51.1 కోట్లకు చేరినట్లు ప్రకటించడంతో షేరుపై ఒత్తిడి నెలకొంది. వొడాఫోన్ ఐడియా షేరు 0.23 శాతం తగ్గింది. 202627 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో టెలికాం సంస్థ ఏకీకృత సర్దుబాటు చేసిన నికర నష్టం రూ.5,361.99 కోట్లకు తగ్గింది.భారత్ ఫోర్జ్‌షేరు 2.01 శాతం నష్టపోయింది.ఫినోలెక్స్ కేబుల్స్ షేరు 14.64 శాతం పెరిగి ర్యాలీ తీసింది.

## మూడు బిలియన్ డాలర్ల నిధుల సమీకరణలో ఐదు బ్యాంకులు




**ముంబయి,ఆగస్టు 11:** భారతీయ ప్రైవేట్ బ్యాంకులు విదేశీ మార్కెట్ల నుంచి భారీగా నిధులు సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఐదు బ్యాంకులు సుమారు 3 బిలియన్ డాలర్లు సమీక రించేందుకు డాలర్ బాండ్లు లేదా విదేశీ రుణాల జారీని పరిశీలిస్తున్నాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ డాలర్ బాండ్ల జారీ ద్వారా గరిష్ఠంగా 1 బిలియన్ డాలర్లు సమీకరించాలని యోచిస్తోంది. మరో నాలుగు బ్యాంకులు ఫెడరల్‌బ్యాంకు, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఆర్బీఎల్ బ్యాంకు, యెస్ బ్యాంక్ ఒక్కొక్కటి 250 మిలియన్ డాలర్ల నుంచి 500 మిలియన్ డాలర్ల వరకు బాండ్లు లేదా రుణాల ద్వారా సమీకరించేందుకు పరిశీలిస్తున్నాయి. భారతీయ రూపాయిపై ఒత్తిడిని తగ్గించి, దేశంలోకి డాలర్ల ప్రవాహాన్ని పెంచేందుకు ఆర్బీఐ తీసుకుంటున్న చర్యలకు ప్రైవేట్ బ్యాంకుల తాజా విదేశీ నిధుల సమీకరణ ప్రణాళికలు ప్రత్యక్ష స్పందనగా నిపుణులు భావిస్తున్నారు.హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కు ఇది రెండో డాలర్ బాండ్ జారీ కానుంది.

ఈ యేడాది జూన్‌లో ఐదేళ్ల కాలపరిమితి కలిగిన డెట్ సేల్ ద్వారా బ్యాంక్ 750 మిలియన్ డాలర్లు సమీకరించింది. ఆర్‌బిఐ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ గతంలో చేపట్టిన 750 మిలియన్ డాలర్ల బాండ్ జారీకి ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. కరెన్సీ మారకం రేటు, భవిష్యత్తులో రుణాల రీఫైనాన్సింగ్‌కు సంబంధించిన రిస్కులు ఉన్నాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.మరోవైపు, చమురు ధరలు అధికంగా ఉండటం, అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో రూపాయిపై ఒత్తిడి కొనసాగుతున్న సమయంలో విదేశీ మారక ద్రవ్య లిక్విడిటీని పెంచి, రూపాయిపై ఒత్తిడిని తగ్గించేందుకే ఆర్‌బిఐ డాలర్ ఇన్‌ఫ్లోలను ప్రోత్సహిస్తోందని మరికొందరు విశ్లేషకులు చెబుతున్నారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ గతంలో జారీ చేసిన 750 మిలియన్ డాలర్ల బాండ్ ఆర్‌బిఐ ప్రత్యేక స్వాప్ సదుపాయాన్ని వినియోగించిన తొలి బ్యాంకింగ్ లావాదేవీగా నిలిచింది. ఆర్‌బిఐ స్వాప్ సదుపాయం గడువు ముగిసిన తర్వాత హెడ్జింగ్ ఖర్చులు పెరిగితే విదేశీ కరెన్సీ రుణాలపై అదనపు భారం పడే అవకాశం ఉందని, కరెన్సీ మారకం రేటు, రీఫైనాన్సింగ్‌కు సంబంధించిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు విదేశీ రుణాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని వారు సూచిస్తున్నారు.

## భారత్‌లో కుటుంబ వ్యాపారాలు రూ.138 లక్షల కోట్లు

### నంబర్ వన్ స్థానంలో జిందాల్ కుటుంబం

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** భారత్‌లో కుటుంబ వ్యాపార సంస్థల విలువలు భారీగా పెరుగుతున్నాయి. దేశంలోని టాప్ 300 కుటుంబ వ్యాపారాల సంయుక్త విలువ 1.46 ట్రిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.138 లక్షల కోట్లు కు చేరుకుంది. 2026 బార్క్లేస్ ప్రైవేట్ క్లయింట్స్ హురున్ ఇండియా మోస్ట్ వాల్యూబుల్ ఫ్యామిలీ బిజినెసెస్ జాబితాలో భారీ పరిశ్రమలు, ఇంజినీరింగ్, తయారీ రంగాల్లోని కుటుంబ వ్యాపారాలు అత్యధికంగా విలువను సృష్టించగా టెక్నాలజీ, రియల్ ఎస్టేట్, వినియోగదారుల వ్యాపారాల విలువలు గత మూడేళ్లలో తగ్గినట్లు నివేదిక తెలిపింది.జిందాల్ కుటుంబం టాప్‌లో జెఎస్‌డబ్ల్యు స్టీల్ అధినేత జిందాల్ కుటుంబం అత్యధిక విలువను సృష్టించింది. గత మూడేళ్లలో రూ.3.3 లక్షల కోట్ల విలువను జోడించడంతో కుటుంబ వ్యాపారాల మొత్తం విలువ 70 శాతం పెరిగి రూ.8.02 లక్షల కోట్లకు చేరుకుంది. వేదాంతకు చెందిన అనిల్ అగర్వాల్ కుటుంబం రూ.3.03 లక్షల కోట్ల విలువను జోడించింది. కుటుంబ వ్యాపారాల మొత్తం విలువ రూ.4.45 లక్షల కోట్లకు చేరింది. వేదాంతను ఐదు వేర్వేరు లిస్టెడ్ సంస్థలుగా విభజించడం ఈ పెరుగుదలకు ప్రధాన కారణమైంది. కుమార మంగళం బిర్లా కుటుంబం రూ.2.75 లక్షల కోట్ల విలువను జోడించింది. దీంతో ఆదిత్య బిర్లా గ్రూప్ వ్యాపారాల మొత్తం విలువ 51 శాతం పెరిగి రూ.8.14 లక్షల కోట్లకు చేరింది. మహీంద్రా కుటుంబం రూ.1.69 లక్షల కోట్ల విలువను జోడించగా, ఇది 49 శాతం వృద్ధి. దీంతో మొత్తం విలువ రూ.5.15 లక్షల కోట్లకు చేరుకుంది.నాదర్ కుటుంబానికి భారీ నష్టంకాగా, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్‌కు చెందిన నాడార్ కుటుంబం మూడేళ్లలో రూ.1.39 లక్షల కోట్ల విలువ తగ్గి రూ.2.95 లక్షల కోట్లకు పడిపోయింది. డిఎల్ఎఫ్ రాజీవ్ సింగ్ కుటుంబం రూ.51,000 కోట్ల మేరవిలువ కోల్పోవడంతో మొత్తం విలువ రూ.1.53 లక్షల కోట్లకుపడిపోతే ఏసియన్‌పెయింట్స్ యజమానులు చోక్సీ, వకీల్ కుటుంబాలు రూ.23,000 కోట్లను కోల్పోయి రూ.2.48 లక్షల కోట్లకు చేరింది. గోద్రెజ్ ఇండస్ట్రీస్ కుటుంబం రూ.19,300 కోట్ల విలువను కోల్పోయింది. అదానీ కుటుంబం విలువ రూ.19.6 లక్షల కోట్లు, సునీల్ భారతి మిట్టల్ కుటుంబం విలువ రూ.12.1 లక్షల కోట్లు, దిలీప్ సంఘ్వీ కుటుంబం విలువ రూ.4.55 లక్షల కోట్లుగా ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం బుధవారం 12 ఆగస్టు 2026 I


## శబ్దకాలుష్యం కలిగించే వాహణదారులపై కఠిన చర్యలు, జిల్లా ఎస్పీ బిందు మాధవ్

### రోడ్ రోలర్ తో సైలెన్సర్లు ధ్వంసం.

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్ట్ 11 (ప్రభాతవార్త):** అధిక శబ్దాలతో శబ్ద కాలుష్యం కలిగించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ పేర్కొన్నారు.మంగళవారం కాకినాడ ట్రాఫిక్ టు పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లో కలిగి ఉన్న వాహనదారులను గుర్తించి శబ్ద తీవ్రతను అధిక స్థాయిలో శబ్దాలను చేస్తూ మార్పు చేసిన సైలెన్సర్లను అమర్చిన వాహనాలపై అపరాధ రుసుం విధించి సైలెన్సర్లు రోడ్డు రోలర్ తో ధ్వంసం చేయడం జరుగుతుందన్నారు. 60 డిసిమల్ దాటి శబ్దం రావడం వలన ఆ శబ్ద కాలుష్యాన్ని కలుగచేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఆ శబ్ద కాలుష్యానికి చెవుడు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న మాడిఫైడ్ సైలెన్సర్లు వినియోగిస్తున్న వాహన దారులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మాడిఫైడ్ సైలెన్సర్లు కలిగిఉన్న వాహానాలను గుర్తించి, సదరు వాహన దారులకు జరిమానాలు విధిస్తున్నట్లు ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. అలాగే మోటారు వాహన చట్టం ప్రకారము శబ్దకాలుష్యశీ కలిగించే సైలెన్సర్లు కలిగి ఉన్న వాహణదారులపై కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వాహానాలకు అమర్చిన సుమారు



రూ.22,50,000/-లు విలువ చేసే 540 మాడిఫైడ్ సైలెన్సర్లను వాహనముల నుండి తొలగించి మాడిఫైడ్ సైలెన్సర్ల ను జప్తు చేసారు. 2025 సంవత్సరములో 169 కేసులకు గాను 2,20,500 రూపాయలు అపరాధ రుసుము మరియు 2026 సంవత్సరములో 841 కేసులకు గాను 12.61,605 రూపాయలు అపరాధ రుసుము, రెండు సంవత్సరములకు గాను మొత్తము 1010 కేసులకు గాను 14,82,105 రూపాయలు అపరాధ రుసుము విధించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ కిషోర్ కుమార్,ఎఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ టు పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామారావు,ట్రాఫిక్-1సీఐ ఎన్. రమేష్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

## రాజమహేంద్రవరంలోకి అడుగుపెట్టిన ఉబర్ బైక్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు11,ప్రభాతవార్త** భారతదేశంలోని ప్రముఖ రైడ్ హెయిలింగ్ యాప్ ఉబర్ రాజమహేంద్రవరం నగరంలో ఉబర్ బైక్ సేవలను ప్రారంభించింది. దీంతో నగరవాసులకు రోజువారీ ప్రయాణాల కోసం అందుబాటు ధరలో సౌకర్యవంతమైన ప్రయాణ ఎంపిక అందుబాటులోకి వచ్చింది. ఇకపై ఆఫీసు, కళాశాలకు వెళ్లడం, రద్దీగా ఉండే మార్కెట్లలో ప్రయాణించడం, ప్రజా రవాణా సదుపాయాలకు చేరుకోవడం వంటి రోజువారీ అవసరాల కోసం ప్రయాణికులు ఉబర్ యాప్ ద్వారా రైడ్‌ను బుక్ చేసుకుని ద్విచక్ర వాహనంపై నగరంలో సులభంగా ప్రయాణించవచ్చు అని ఉబర్ ఇండియా కన్స్యూమర్ మరియు గ్రోత్ డైరెక్టర్ రిషాంత్ ఘోష్ వెల్లడించారు.ఉబర్ బైక్ రాజమహేంద్రవరం నగరవాసులకు అందుబాటు ధరలో కొత్త ప్రయాణ సౌకర్యాన్ని అందించడంతో పాటు, స్థానిక డ్రైవర్లకు సౌకర్యవంతమైన, అనువైన ఆదాయ అవకాశాలను కల్పిస్తుందన్నారు. నగరంలో ఉబర్ బైక్ సేవల ప్రారంభాన్ని పురస్కరించుకుని, పరిమిత కాలం పాటు కొత్త ప్రయాణికులకు వారి తొలి ఉబర్ బైక్ రైడ్‌ను ఉచితంగా అందిస్తోందన్నారు. ప్రారంభ కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఉబర్ బైక్ డ్రైవర్లకు ఐఎస్ఐ గుర్తింపు పొందిన హెల్మెట్లను పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దీంతో నగరంలో ఉబర్ బైక్ సేవల ప్రారంభంలో రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోందన్నారు. రాజమహేంద్రవరంలో మన రహదారులపై ప్రయాణించే వారి సంఖ్య పెరుగుతున్న కొద్దీ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఐఎస్ఐ గుర్తింపు పొందిన హెల్మెట్లను పంపిణీ చేయడం ద్వారా బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌ను ప్రోత్సహించేందుకు ఉబర్ చేస్తున్న కృషిని అభినందిస్తున్నానన్నారు.

## ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



**.కష్టపడ్డ ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుంది.టీ. డి. పి. పార్టీ కార్యకర్తల సమావేశంలో రంపచోడవరం యం ఎల్ ఏ శిరీష దేవి.**

**చింతూరు ఆగష్టు 11 ప్రభాత వార్త** ప్రతి కార్యకర్త టీ డి పి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలనీ రంపచోడవరం యం ఎల్ ఏ మిరియాల శిరీష దేవి కార్యకర్తలకు పిలుపునిచ్చారు.మంగళవారం చింతూరు మండలం నిమ్మలగూడెం గ్రామములోని జే. కె. సిటీలో మండల అధ్యక్షులు యం. డి. జమాల్ ఖాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ టీ. డి. పి. అంటేనే అభివృద్ధి అని,ప్రతి కార్యకర్త పార్టీకోసం పని చేయాలనీ ఆమె పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీ ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేసింది అని, రాష్ట్ర విభజనకు ముందు చింతూరు ఏలా ఉంది. ఇప్పుడు ఏ లా ఉందో ప్రతి ఒక్కరు అర్ధం చేసుకోవాలని,ఈ ప్రాంత అభివృద్ధి కోసం మన ప్రియతమ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు చింతూరు కేంద్రంగా ఐ టీ డి ఏ ఏర్పాటు చేశారని, మెరుగైన వైద్య సేవలకోసం చింతూరు కేంద్రంగా ఆసుపత్రి ఏర్పాటు చేయటంతో పాటు నేడు 100 పడకల ఆసుపత్రిగా అప్గ్రేడ్ చేశారని, సబ్‌స్టేషన్, ఏపీఎస్ ఆర్ టీ సి బస్టాండ్, ట్రెజరి, జి సి సి బంక్, డిగ్రీ కళాశాల ఇవన్నీ టీ. డి పి చేపట్టిన అభివృద్ధి పనులు అని, ఎంత మంది పిల్లలు ఉంటె అంత మందికి తల్లికి వందనం ఇచ్చిన ఘనత టీ డి పి దే అని ఆమె అన్నారు.రైతు భరోసా, ఫ్రీ బస్సు, ఫ్రీ గ్యాస్(3 సిలెండర్లు ), సూపర్ సిక్స్ పధకాలు ఇలా అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు టీ డి పి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది అని, మన ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఇంటి ఇంటి కి వెళ్ళి ప్రచారం చేయాలనీ, కార్యకర్తలలే పార్టీకి పునాదులు అని, కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పార్టీ గుర్తింపు ఉంటుంది అని ఆమె అన్నారు.రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో ఘన విజయం సాధించి ప్రతి గ్రామ అభివృద్ధి కి కృషి చేయాలనీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు కోట్ని బాలాజీ, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు వల్లభనేని చందు, మండల కార్యదర్శి మల్లిలి వెంకటేశ్వరావు, క్లస్టర్ ఇన్చార్జ్ ఓ నరసింహారావు, మాజి అధ్యక్షులు జహంగీర్, చిట్టిబాబు, సావిత్రి, శ్రీరామ్ , శంకర్, శీలం తమయ్య, అసిఫ్, జానీ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్‌లో ఎడ్యూ ఫెయిర్



**రాజమహేంద్రవరం అర్బన్: ఆగస్టు 11, (ప్రభాతవార్త)** నగరంలోని కవలగొయ్య రోడ్డులో గల ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్‌లో ఆగస్టు 15, 16 తేదీల్లో ఎడ్యూ ఫెయిర్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శేషగిరిధర్ మల్బవరపు తెలిపారు. విద్యార్థుల సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనలు, నూతన ఆవిష్కరణలకు వేదికగా ఈ ప్రదర్శన నిలవనుంది. ాణ+ం, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), ాజువీ ఇన్నోవేషన్ వంటి ఆధునిక అంశాలపై విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్టులు, నమూనాలు ప్రదర్శించనున్నారు. విద్యార్థుల్లో పరిశోధనా ఆసక్తి, నూతన ఆలోచనలు, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి వారిని సిద్ధం చేయడమే లక్ష్యమన్నారు. తల్లిదండ్రులు, విద్యావేత్తలు, విద్యాభిమానులు హాజరై విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలని కోరారు.

## విద్యుత్ షాక్ గురై గిరిజన కార్మికుడు మృతి!!

### 27 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లింపునకు అంగీకారం.





**మోతుగూడెం ఆగస్టు11: ప్రభాతవార్త** పోలవరం జిల్లా చింతూరు మండలం (సీలేరు కాంప్లెక్స్) మోతుగూడెం పొల్లూరు జలవిద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించిన ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికుడి గా విధులు నిర్వహిస్తున్న మడివి ముత్తయ్య (43) మంగళవారం మధ్యహన్నం సమయంలో పొల్లూరు జలవిద్యుత్ ప్రాజెక్టు చెక్ పోస్ట్ సమీపంలో ఇటివలే కురిసిన బారి వర్షాలకు బారి వృక్షాలు కరెంట్ స్థంబాలపై పడి నేలకొరిగినవి. గత ముడురోజులగా కరెంట్ పోల్స్ ను నిలబెట్టి విద్యుత్ తీగలు అమర్చి మరమ్మత్తులు నిర్వహిస్తున్న సమయంలో ఎర్త్ వైరునుండి బ్యాక్ పవర్ రావడం తో మత్తయ్య విద్యుత్ షాక్ గురై తీవ్రాగాయల పాలైనాడు. మరో ఇద్దరు స్వల్పగాయలకు గురైనారు. ప్రదమ చికిత్స నిమిత్తం మోతుగూడెం జెన్ కో ఆసుపత్రి కి ముత్తయ్యను తరలించి సీపిఆర్ నిర్వహించిన ఫలితం లేకపోవడం తో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కార్మికుడు మృతి అత్యంత బాధాకరం విషయం. ఈ ఘటనపై సిపిఎం పోలవరం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ యాజమాన్యాల నిర్లక్ష్యం మరియు కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ముత్తయ్య ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని ముత్తయ్య కుటుంబానికి అండగా నిలవాల్సిన బాధ్యత ఏపి జెన్ కో యాజమాన్యం మరియు ప్రభుత్వాలపై ఉందని ?సిపిఎం పోలవరం జిల్లా కార్యదర్శి బొప్పన్న కిరణ్ అన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన గిరిజన కార్మికుడు మడివి ముత్తయ్య కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకోవాలని నాయ్యం చేయలని జెన్ కొ ఆసుపత్రి ముందు చింతూరు డివిజన్ సిపిఎం నాయకులు ధర్నా చెస్తు బైటాయించారు. ఏపి జేన్ కొ యాజమాన్యం మరియు స్దానిక ఉన్నతాధికారుల కాంట్రాక్టర్ స్పందించి 26 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా రూపంలో చెల్లించేలా మరియు మట్టి ఖర్చుల క్రిందా మరో 50 వేలు రూపాయలు (కుటుంబ సభ్యులకు) ఆర్ధిక సహయం ఇచ్చేలా సిపిఎం నాయకులు పరిటాల వెంకట్ చింతా.రాంబాబు మడివి గౌరమ్మా రామయ్య మరియు జెన్ కొ అధికారులు సిఈ వెంకటరాజారావు ఎస్.ఈ లు బాలకృష్ణ చిన్నా.కామేశ్వరరావు కార్మిక సంఘాల నాయకులు వేమగిరికిరణ్ రత్నకర్ తదితరుల మద్యవర్తుల సమక్షంలో మృతిచెందిన కార్మిక కుటుంబానికి ఆర్ధిక సహాయం చెల్లించేలా చర్చలు సఫలం చెస్తు ఒప్పందం కుదుర్చుకున్నారు. ముత్తయ్య కుటుంబంలో అర్హత కలిగిన కుటుంబ సభ్యునికి ఏపి.జెన్ కో లో కాంట్రాక్టు కార్మిక ఉద్యోగం కల్పించి ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని జెన్ కొ అధికారులు తెలిపారు.మోతుగూడెం ఇన్ఛార్జ్ ఎస్సై చరణ్ నాయక్ మరియు అడిసినల్ ఎస్సై సి.హెచ్ కృష్ణ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం చింతూరు సిహెచ్సి కి తరలించి తదుపరి విచారణ నిమిత్తం దర్యప్తు చెస్తున్నమన్నారు.

## వాడపల్లి వెంకన్న కు అష్టోత్తర పూజ, నిత్యకళ్యాణం ..

### పాల్గొన్న అశేష భక్త జనం

### ఘనంగా ప్రారంభమైన శ్రీ ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర ఉత్సవాలు...





**ఆత్రేయపురం, ఆగస్టు 11,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం మంగళవారం వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. వేకువజామున స్వామివారికి మేలుకొలుపు శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఐశ్వర్య హోమం, గోపూజ, అష్టో త్తర శతనామావళి, నిత్య కల్యా ణోత్సవం, బాలభోగం తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఏడువారాలు నోము పూర్తి అయిన భక్తులు అష్టోత్తర పూజ నిత్యకళ్యాణం లలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం శ్రీ స్వామి వారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి ఆలయంలో సోమ వారం సాయంత్రం సన్నాయి వాయిద్యాలతో మధ్య శ్రీ ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర ఉత్సవాలు ఈ నెల 10 వ తేదీ నుండి 14వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్, ఈఓ నల్లం సూర్య చక్రధర్రావు తెలిపారు. ఈ సందర్భంగా నీరాజన మంత్రపుష్పం, కుంకుమార్చన, ప్రాకారోత్సవం, ద్రావిడ వేదపారా యణం తదితర కార్యక్రమాలను అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.

## అంగన్వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు

### బాలల పోషణ, విద్యపై ప్రత్యేక అవగాహన



**శంఖవరం ఆగస్టు 11 ప్రభాతవార్త** బాలలకు నాణ్యమైన విద్య, పోషణ అందించే లక్ష్యంతో అంగన్వాడీ టీచర్ల కోసం జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని శంకవరం సిడిపిఓ పర్వత వెంకటలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కత్తిపూడి లో గల జిల్లా పరిషత్ హై స్కూల్లో శంకవరం మండల అంగన్వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ వెంకటలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మరింత నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్య, బోధనా నైపుణ్యాలు మరియు అభ్యసన ఫలితాలను మెరుగుపరిచే లక్ష్యంతో "జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందనిశంఖవరం ప్రాజెక్ట్ పరిధిలోని శంఖవరం మరియు రౌతులపూడి మండలాల్లో మొత్తం 112 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ శిక్షణ అందిస్తున్నామని మొత్తం 6 రోజులపాటు రెండు దశల్లో నాన్-రెసిడెన్షియల్ విధానంలో ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అదనపు ఎంఈఓ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా అంగన్వాడీ కార్యకర్తల్లో మరింత నైపుణ్యం ఆత్మవిశ్వాసం పెంపొందించి నాణ్యమైన అంగన్వాడీ నాణ్యమైన ప్రీస్కూల్ విద్య ఉజ్వలమైన బాలల భవిష్యత్తు దిశగా ముందుకు సాగేందుకు కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామలింగేశ్వరరావు సూపర్వైజర్ రజిని తదితరులు ప్రసంగించారు

## శ్రీ భావనారాయణ స్వామి ఆలయానికి వంట పాత్రలు

### వితరణ చేసిన మాజీ చైర్మన్ నారాయణరావు



**కాకినాడ రూరల్, ఆగస్టు 11 (ప్రభాతవార్త):** కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలో స్వయంభుగా కొలువుతీరిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ భావనారాయణ స్వామి నిత్య అన్నదాన పథకం అమలు కోసం మాజీ చైర్మన్ పుల్ల నారాయణరావు సుమారు లక్ష రూపాయలు విలువ చేసే వంట పాత్రలు ఆలయ కార్య నిర్వహణ అధికారి రాపాక శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే నానాజీ ఆదేశాల మేరకు నిత్య అన్నదాన పథకం ప్రారంభించడం జరుగుతుందని, వంట పాత్రల దాత నారాయణరావును అభినందించారు . కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బోనం కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థిని ప్రియాంక మరణం దురదృష్టకరం

### ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి



**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11( ప్రభాతవార్త)** వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రియాంక మరణం దురదృష్టకరమని ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చేయాలని కూటమి నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక శుభమస్తు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. తొలుత ప్రియాంక మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం రూరల్ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ప్రియాంకకు ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వము ఉన్న స్థాయి అధికారులు వెంటనే స్పందించారని పేర్కొన్నారు. ఈ కేసు విషయంపై సీఎం చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి ప్రియాంకకు న్యాయం చేయాలని చెప్పడం జరిగింది అన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ నిందితులకు కఠిన శిక్ష పడేలా చట్టపరముగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మద్యం మత్తులో ఈ ప్రమాదానికి కారుకులైన ఇద్దరు వ్యక్తులపై మరల సెక్షన్లు మార్చి కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రియాంక అంత్యక్రియలకు రుడ చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తాను కలిసి హైదరాబాద్ వెళ్లాలని అక్కడ తెలంగాణ ప్రభుత్వం కూడా సహకరించిందని తెలిపారు. ప్రియాంక తండ్రికి ప్రభుత్వం తరఫున మంత్రి టీజీ వెంకటేష్ చెక్కును అందజేశారు అన్నారు. మరో ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి ప్రియాంక మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆమె కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని అన్నారు. ఈ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి కఠిన శిక్షలు పడేలా చూడాలని పేర్కొన్నారు. జిఎస్ఎల్ యాజమాన్యం ప్రియాంక కుటుంబానికి ఆర్థిక సాయం చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. రు డా చైర్మన్ బొడ్డు వెంకటరమణ మాట్లాడుతూ ఈ కేసులో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదని ఎవరైనా ఉన్నట్లు తెలిస్తే కఠిన శిక్ష పడేలా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కేసు విషయంలో రాజకీయం చేయవద్దని ప్రియాంక తండ్రి కోరారని తెలిపారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన సదస్సు



**గండేపల్లి ఆగస్టు 11. ప్రభాతవార్త** గండేపల్లి మండలం, సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ నందు మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు ఎంపవరింగ్ గర్ల్స్ అండ్ సేఫ్ సొసైటీ అనే అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ డా. ఎమ్ శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వెల్నెస్ కోచ్ డాక్టర్. లక్ష్మీ ప్రకాష్ అడపా హాజరై విద్యార్థినులకు వ్యక్తిగత ఆరోగ్యం, టీనేజ్ ఆకర్షణలు - తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు సోషల్ మీడియా దుష్పరిణామాలు మీద అవగాహన కల్పించారు. మరొక వక్త కెరీర్ కోచ్ అయిన తోట శ్రీనిధి విద్యార్థినులకు కుటుంబ విలువలు, జీవిత లక్ష్యాలు గురించి తెలియజేసి విద్యార్థులకు ప్రేరణ కలిగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ టి వి ఎస్ కుమార్, విభాగాధిపతులు, ఉపాధ్యాయ సిబ్బంది హాజరయ్యారు.

## పారదర్శకంగా ఎరువుల పంపిణీ

### ఏపీఏఐఎంఎస్ 2.0పై అవగాహన కల్పించిన కలెక్టర్



**రంపచోడవరం, ఆగస్టు 11: ప్రభాతవార్త.** పోలవరం జిల్లాలో రైతులకు సకాలంలో, పారదర్శకంగా ఎరువులు అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఏపీఏఐఎంఎస్ 2.0 విధానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.దినేష్‌కుమార్ సూచించారు. మంగళవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏపీఏఐఎంఎస్ 2.0పై రైతులకు అవగాహన కల్పించే గోడపత్రాలను కలెక్టర్ కె.దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల భూమి విస్తీర్ణం, ఈ-పంటలో నమోదైన వివరాల ఆధారంగా యూరియా, డీఏపీ ఎరువుల కోటాను శాస్త్రీయంగా నిర్ణయించి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఏకీకృత గుర్తింపు ధ్రువీకరణ లేదా జీవ ప్రమాణీకరణ అనంతరం సమీప రైతు సేవా కేంద్రం లేదా అధీకృత ఎరువుల విక్రయ కేంద్రాల ద్వారా ఎరువులు పొందవచ్చన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ఏకీకృత గుర్తింపు కార్డుకు అనుసంధానమైన మొబైల్ నంబర్ అందుబాటులో ఉంచుకోవాలని, ఎరువుల కొనుగోలుకు సంబంధించిన రసీదు లేదా టోకెన్‌ను తప్పనిసరిగా భద్రపరచుకోవాలని తెలిపారు. కౌలు రైతులకు కూడా సీసీఆర్‌సీ లేదా స్థానిక పరిశీలన ఆధారంగా ఎరువులు అందించేలా వెసులుబాటు కల్పించినట్లు అధికారులు వివరించారు. రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ సహాయకులు, వీఏఏ, వీహెచ్ఏ, ఎంఏఓలు లేదా సమీప రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం 45 కిలోల యూరియా బస్తా రూ.266.50, 50 కిలోల డీఏపీ బస్తా రూ.1,350కు లభిస్తుందని అధికారులు తెలిపారు. రైతులు ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్‌ను వినియోగించుకుని ప్రభుత్వ సేవలను సులభంగా పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఓఎస్డీ జావాలి, ఆర్డీవో కె.స్వాతి, జిల్లా వ్యవసాయ అధికారి రామ్మోహన్‌రావు, ఏపీఓ జనరల్ డీఎన్‌వీ రమణ, ఎల్‌డీఎం దిలీప్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానికం తర్వాతే... నామినేటెడ్ పందేరం!

- రెండేళ్లుగా ఎదురుచూస్తున్న జనసైనికులకు పదవులపై ఆశలు
- స్థానిక ఎన్నికల్లో కొందరికి అవకాశం.. మిగిలిన వారికి నామినేటెడ్ పదవులు
- ఆలయ చైర్మన్ పదవులపై పాత--కొత్త నేతల మధ్య పోటీ
- కష్టకాలంలో పార్టీని మోసిన వారికా.. వైసీపీ నుంచి వచ్చిన ద్వితీయ శ్రేణి నేతలకా?

**పిఠాపురం, ఆగస్టు 11 ( ప్రభాతవార్త )**కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్న జనసైనికుల్లో ఇప్పుడు ఆశలు చిగురిస్తున్నాయి. ముందుగా స్థానిక ఎన్నికలు.. ఆ తర్వాతే నామినేటెడ్ పదవుల భర్తీకి అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. స్థానిక ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన కొందరు జనసైనికులకు రాజకీయంగా అవకాశం కల్పించి, మిగిలిన వారిని వివిధ నామినేటెడ్ పదవుల్లో సర్దుబాటు చేయాలనే ఆలోచనలో పార్టీ పెద్దలు ఉన్నట్లు సమాచారం. అయితే ఆలయాల చైర్మన్ పదవుల విషయంలో మాత్రం పాత పరిచయాలు, కొత్త రాజకీయ సమీకరణాలు, గతంలో పదవులు అనుభవించిన నేతల ప్రభావం చర్చనీయాంశంగా మారింది. రెండేళ్లుగా పార్టీ కోసం పనిచేస్తూ పదవుల కోసం ఎదురుచూస్తున్న జనసైనికులు ఇప్పుడు తమకు న్యాయం జరుగుతుందా? లేదా అధికార మార్పు తర్వాత కూటమికి చేరువైన ఇతర పార్టీల నేతలకే మరోసారి ప్రాధాన్యం దక్కుతుందా? అనే సందేహంతో ఉన్నారు. ముఖ్యంగా ఆలయాల చైర్మన్ పదవుల విషయంలో ఈ చర్చ మరింత వేడెక్కుతోంది.

**పిఠాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ గా వాకపల్లి దేవి**

సూర్య ప్రకాష్,రాష్ట్రశెట్టిబలి కార్పొరేషన్ డైరెక్టర్ పెంకె జగదీష్, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ కంచర్ల భవాని శంకర్, పద్మశాలికార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ,సాగర కార్పొరేషన్ డైరెక్టర్ మొగలి అప్పారావు,పిఠాపురం ఏరియా ఆసుపత్రి డైరెక్టర్ బొజ్జా కుమార్ అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు తోలేటి శిరీష అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ ప్రత్యేక ఆహ్వానితులుగా గంజి గోవిందరాజులు నామినేటెడ్ పదవులు ఇచ్చిన వారిలో ఉన్నారు. 2014 నుంచి జనసేన కోసం పనిచేస్తున్న మరికొందరు జన సైనికులు ఇంకా అవకాసం కోసం ఎదురుచూస్తున్నారు.

**ముందుగా స్థానికం.. తర్వాతే నామినేటెడ్ పదవులు**

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జనసేన రాజకీయ వ్యూహంలో మార్పులు చోటుచేసుకుంటున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. స్థానికంగా పార్టీ బలాన్ని పెంచుకోవడంతో పాటు, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోసం ఎదురుచూస్తున్న ఆశావహులకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ కోసం గత రెండేళ్లుగా కష్టపడుతున్న నేతలు, కార్యకర్తల్లో చాలామంది ఇప్పటికే స్థానిక ఎన్నికల్లో తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నవారికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించకపోతే కేడర్‌లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో కొందరికి అవకాశం ఇచ్చి, పోటీకి అవకాశం దక్కని వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించే విధంగా ఒక సమతుల్య విధానాన్ని అనుసరించే అవకాశాలపై చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**రెండేళ్ల నిరీక్షణ.. పదవులపై పెరిగిన ఆశలు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జనసేన కేడర్‌లో నామినేటెడ్ పదవులపై ఆశలు నెలకొన్నాయి. పార్టీ అధికారంలో లేకపోయిన సమయంలో జెండా మోసినవారికి, కేసులు ఎదుర్కొన్నవారికి, కార్యక్రమాల్లో పాల్గొన్నవారికి, గ్రామాల్లో పార్టీని నిలబెట్టినవారికి గుర్తింపు రావాలని కేడర్ కోరుతోంది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ సమీకరణాలు మారడంతో పదవుల కోసం పోటీ కూడా పెరిగింది. ఒకవైపు అసలు పార్టీ కేడర్ ఉండగా, మరోవైపు వివిధ పార్టీల నుంచి కూటమికి చేరువైన నేతలు కూడా తమకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని కోరుతున్న పరిస్థితి ఏర్పడింది. దీంతో 'ఎవరు కష్టపడ్డారు?' అనే ప్రశ్న కంటే 'ఎవరి రాజకీయ ప్రభావం ఎంత?' అనే లెక్కలు కూడా పదవుల కేటాయింపులో కీలకంగా మారుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

**ఆలయ చైర్మన్ పదవులపైనే అసలు పంచాయితీ**

నామినేటెడ్ పదవుల్లో ముఖ్యంగా దేవాలయాల పాలక మండళ్ల చైర్మన్ పదవులపై ఆశావహుల దృష్టి కేంద్రీకృతమైంది. ఆధ్యాత్మిక ప్రాధాన్యంతో పాటు స్థానికంగా రాజకీయంగా కూడా ఈ పదవులకు ప్రాధాన్యం ఉండటంతో పలువురు నేతలు వాటి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.



గత ప్రభుత్వ హయాంలో ఆలయ చైర్మన్లుగా పనిచేసిన కొందరిపై పలు ఆరోపణలు ఉన్నాయని జనసేన శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. అయితే ఆ ఆరోపణలు నిజమా కాదా అన్నది సంబంధిత అధికారిక విచారణలు, రికార్డులు నిర్ధారించాల్సి ఉంటుంది. అయినప్పటికీ గతంలో పదవులు నిర్వహించిన కొందరు నేతలు ప్రస్తుతం కూడా కూటమి ప్రభుత్వంలో ఆలయ చైర్మన్ పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదే అంశం జనసైనికుల్లో అసంతృప్తికి కారణమవుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ కోసం కష్టకాలంలో పనిచేసిన వారిని పక్కనపెట్టి, అధికార మార్పు తర్వాత రాజకీయంగా చేరువైన వారికి పదవులు కట్టబెడితే కేడర్‌కు ఎలాంటి సంకేతం వెళ్తుందనే ప్రశ్నను కొందరు నేతలు అంతర్గతంగా లేవనెత్తుతున్నట్లు సమాచారం.

**'కష్టకాలంలో మేమున్నాం' అంటున్న కేడర్**

జనసేన రాజకీయ ప్రస్థానంలో కష్టకాలంలో పార్టీతో ఉన్న కార్యకర్తలే తమకు మొదటి ప్రాధాన్యం ఉండాలని కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రచారం, బూత్ స్థాయి నిర్వహణ, గ్రామస్థాయి కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణలో తమ పాత్రను గుర్తించాలని ఆశిస్తున్నారు. "అధికారంలో లేని సమయంలో పార్టీ కోసం పనిచేశాం. ఇప్పుడు అధికారం వచ్చిన తర్వాత కూడా మా వంతు గుర్తింపు రాకపోతే ఎప్పుడు వస్తుంది?" అనే భావన పలువురు జనసైనికుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పార్టీ అధిష్ఠానం మాత్రం సామాజిక సమీకరణాలు, స్థానిక బలాబలాలు, ఎన్నికల అవసరాలు, కూటమి భాగస్వామ్యాల మధ్య సమతుల్యత పాటించాల్సిన పరిస్థితిలో ఉంది. దీంతో ప్రతి ఆశావహుడికి పదవి ఇవ్వడం సాధ్యం కాకపోవడంతో, అందరికీ రాజకీయ ప్రాధాన్యం కల్పించే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు సమాచారం.

**స్థానిక ఎన్నికలే కీలక మలుపు**

రాబోయే స్థానిక ఎన్నికలు జనసేన కేడర్‌కు కీలకంగా మారనున్నాయి. గ్రామ, మండల స్థాయిలో పార్టీకి బలమైన పునాది ఏర్పాటు చేయాలంటే స్థానికంగా ప్రభావం ఉన్న నేతలకు అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే స్థానికంగా బలంగా ఉన్న కొందరు జనసైనికులు తమకు పార్టీ టికెట్ లేదా అధికారిక మద్దతు లభిస్తుందని ఆశిస్తున్నారు. అదే సమయంలో నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న మరికొందరు నేతలు ఎన్నికల ఫలితాల తర్వాత తమకు అవకాశం వస్తుందని భావిస్తున్నారు. ఈ రెండు వర్గాల మధ్య సమన్వయం చేయడం పార్టీ నాయకత్వానికి ప్రధాన సవాలుగా మారనుంది. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించడం ద్వారా ఒక వర్గాన్ని సంతృప్తిపరిచి, ఎన్నికల్లో అవకాశం రాని మరో వర్గానికి నామినేటెడ్ పదవులు ఇవ్వడం ద్వారా అసంతృప్తిని తగ్గించాలనే వ్యూహం అమలు చేసే అవకాశం ఉందనే ప్రచారం ఉంది.

**పాత నేతల ప్రభావమా? కొత్త కేడర్ కష్టమా?**

అధికార రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత పార్టీల మధ్య నాయకుల వలసలు సాధారణమే. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ఏ స్థాయిలో ప్రాధాన్యం ఇవ్వాలన్నది ప్రతి నియోజకవర్గంలోనూ చర్చనీయాంశంగా మారింది. వైసీపీ నుంచి వచ్చిన ద్వితీయ శ్రేణి నాయకుల్లో కొందరు తమ రాజకీయ అనుభవం, స్థానిక పరిచయాలు, సామాజిక బలం ఆధారంగా పదవులను ఆశిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు, వారిని మించి పార్టీ కోసం కష్టపడ్డ అసలు జనసేన కేడర్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. ఈ రెండు వర్గాల మధ్య సమతుల్యత పాటించడమే నాయకత్వానికి పరీక్షగా మారనుంది.

**పదవి చిన్నదైనా.. రాజకీయ ప్రభావం పెద్దదే**

నామినేటెడ్ పదవులు సంఖ్యాపరంగా పరిమితమైనప్పటికీ వాటి రాజకీయ ప్రభావం మాత్రం గణనీయంగా ఉంటుంది. ముఖ్యంగా ఆలయాల పాలక మండళ్లలో చైర్మన్, సభ్యులుగా నియమితులయ్యే వారికి స్థానికంగా ఒక ప్రత్యేక గుర్తింపు ఏర్పడుతుంది. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు, ఉత్సవాల నిర్వహణ వంటి అంశాల్లో పాలక మండళ్ల పాత్ర ఉండటంతో ఈ పదవులకు రాజకీయ ప్రాధాన్యం పెరుగుతోంది. అందుకే ఒక పదవి కోసం పలువురు నేతలు పోటీ పడుతున్నారు. ఒకరికి పదవి దక్కితే మరొకరికి అసంతృప్తి తప్పని పరిస్థితి. ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయాలు రాబోయే రోజుల్లో కేడర్ ఐక్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

**ఎవరి కోసం పదవులు? అన్నదే అసలు ప్రశ్న**

ప్రస్తుతం జనసేనలో వినిపిస్తున్న ప్రధాన ప్రశ్న ఇదే. పార్టీ కోసం కష్టపడ్డవారికి ముందుగా గుర్తింపు ఇవ్వాలా? లేక ఎన్నికల సమీకరణాల్లో భాగంగా ఇతర పార్టీల నుంచి వచ్చిన అనుభవజ్ఞులకు అవకాశం కల్పించాలా? రెండింటికీ రాజకీయంగా కారణాలు ఉన్నప్పటికీ, కేడర్ మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా తీసుకునే నిర్ణయం భవిష్యత్తులో ఇబ్బందులకు దారితీసే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ప్రత్యేకంగా ఆలయ చైర్మన్ పదవుల విషయంలో గతంలో పదవులు అనుభవించిన వారికే మరోసారి అవకాశం వస్తే, పార్టీ కోసం కష్టపడిన జనసైనికుల్లో అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉందని కొందరు నేతలు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.

**అధిష్ఠానం నిర్ణయంపైనే అందరి చూపు**

స్థానిక ఎన్నికల ముందు ఆశావహుల జాబితా, సామాజిక సమీకరణాలు, పార్టీ బలాబలాలు, కూటమి భాగస్వామ్యాల మధ్య సమన్వయం వంటి అంశాలపై అధిష్ఠానం కసరత్తు చేయాల్సి ఉంది. స్థానిక ఎన్నికల్లో అవకాశం దక్కే నేతలు ఒక వర్గం.. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకపోయినా పార్టీ కోసం పనిచేసినవారికి నామినేటెడ్ పదవులు దక్కే మరో వర్గం.. కూటమి రాజకీయ సమీకరణాల్లో భాగంగా ప్రాధాన్యం పొందే ఇతర నేతలు ఇంకో వర్గం. ఈ మూడు వర్గాలను సమన్వయం చేస్తూ నిర్ణయం తీసుకోవడం అంత సులభం కాదు. అయితే కష్టకాలంలో పార్టీని నడిపించిన కేడర్‌కు తగిన గుర్తింపు ఇస్తే, భవిష్యత్ ఎన్నికల్లో పార్టీకి మరింత బలమైన కేడర్ వ్యవస్థ ఏర్పడుతుందని జనసైనికులు ఆశిస్తున్నారు.

# ఇంటింటా తెలుగుదేశం



**ముమ్మిడివరం ఆగస్టు 11 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి పేర్కొన్నారు. ఇంటింటా తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరం నగర పంచాయతీ పదిహేను వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కూటమి రెండు ఏళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమశీ, గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం నియోజకవర్గ పరిశీలకురాలు, సుంకర పావని, ఎస్సీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ చెల్లి అశోక్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు, కట్టా సత్తిబాబు, మాదాల మంగ సత్య కుమారి, యాళ్ల ఉదయ్ కదలి నాగు,దాట్ల బాబు, విళ్ల వీరాస్వామి నాయుడు సత్తి నూకరాజు, గొల్లపల్లి గోపి, భీమవరపు శ్రీనివాస్, పాయసం చిన్ని కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆగస్టు 26న ర్యాలి జగన్మోహునుడి

# శ్రవణా నక్షత్ర మాస కళ్యాణం...

### స్వామివారిని దర్శించుకున్న అశేష భక్త జనం..



**ఆత్రేయపురం, ఆగస్టు,11,(ప్రభాత వార్త)** అతి పురాతన పుణ్యక్షేత్రం స్వయంభూ క్షేత్రంగా వెలుగొందుతున్న ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవ స్వామి, గోపాలస్వామి ఆలయం నందు శ్రవణ నక్షత్ర మాస కళ్యాణమహోత్సవం ఈ నెల 26 తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబులు తెలిపారు. భక్తులు వివాహం, సంతానం, విద్య, ఉద్యోగం, బదిలీ, పదోన్నతి, విదేశీయానాం, ఆరోగ్యం, వ్యాపారం మొదలగు కోరికల కొరకు శ్రీ స్వామి వారి మాస కళ్యాణంలో పాల్గొనవలెను. కావున భక్తులు 99113 34733 మొబైల్ నెంబర్ ను సంప్రదించి ఆన్లైన్ ద్వారా రుసుం రూ.750/- లు చెల్లించి పూజనందు పాల్గొవాలని. ప్రసాదం పోస్టు ద్వారా పంపిస్తామని వారు తెలిపారు. అలాగే ఆలయంలో మంగళవారం స్వామివారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాలు నుండి భక్తులు బారీగా తరలి వచ్చారు.భక్తులు శ్రీ స్వామి వారిని దర్శించుకొని, ఆలయం నందు జరుగుతున్న నిత్యాన్నదానంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీ స్వామి వారి సేవలో ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులుఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను దత్తు లు ఉన్నారు.

## రైతు సంక్షేమం, గ్రామాభివృద్దే, ధ్యేయంగా చంద్రన్న పాలన. ఎం ఎల్ ఎ, సత్య ప్రభ,



**రౌతులపూడి, ఆగస్టు 11,(ప్రభాత వార్త)** రైతుల సంక్షేమం, గ్రామాల అభివృద్దే ధ్యేయంగా చంద్రన్న పాలన సాగుతోందని ప్రత్తి పాడు ఎం ఎల్ ఎ వరుపుల సత్య ప్రభ తెలిపారు, మంగళ వారం ఆమె మండలంలో పలు కార్య క్రమాల్లో పాల్గొన్నారు. గంగవరంలో మండల పరిషత్ నిధులు 7లక్షల రూపాయలతో నిర్మించనున్న డ్రైనేజు లకు ఆమె శంకుస్థాపనచేశారు. తదనంతరం బలరాంపురంలో శ్రీ సప్తగిరి ఇండస్ట్రీస్ వద్ద మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు ప్రతీ కుటుంబానికి నెలకు పదికిలోల చొప్పున అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంనకు సంబంధించిన తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ అంబులెన్సు ప్రారంభించారు.తదనంతరం డబ్బాది, రౌతులపూడి, బలరామపురం, ఉప్పంపాలెం, ఎస్.అగ్రహారం, శృంగవరం, డి. జే. పురం లకు చెందిన రైతులకు నూతన పట్టదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో రౌతుల పూడి మండల అధ్యక్షురాలు గంటిమల్ల రాజ్యలక్ష్మి, ప్రత్తిపాడు జనసేన పార్టీ నాయకులు బాబీ, పార్టీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, మండల మాజీ అధ్యక్షుడు ఇటంశెట్టి సూర్య భాస్కర రావు. మాజీ సర్పంచ్ పైలా సాంబ శివరావు, ఆత్మ కమిటీ ఉపాధ్యక్షుడు కరణం సుబ్రహ్మణ్యం,తహశీల్దార్ కృష్ణ కుమారి, వైద్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలువురు వైకాపా నేతలను కలిసిన సతీష్.



**తాళ్ళరేవు, ఆగస్టు 11 (ప్రభాతవార్త):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభాగం ప్రచార కార్యదర్శిగా రెడ్డి ఈశ్వరరావు (సతీష్) నియామకం అయిన సందర్భంగా మంగళవారం పలువురు వైకాపా నేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు మాజీ మంత్రివర్యులు కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిలను పుష్పగుచ్ఛాలు అందజేసి, పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ ను వ ఈ నేతలు అభినందించారు.

## అంగన్వాడీ శిక్షణ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### జిల్లా సి జె డి ఓ రమాదేవి



**కత్తిపేట, ఆగస్టు 11,(ప్రభాతవార్త)** జ్ఞాన జ్యోతి పేరున 120 రోజుల పాటు అంగన్వాడీలకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా సి జె డి ఓ రమాదేవి అన్నారు శిక్షణలో భాగంగా ఈ నెల 11 నుండి 13 వరకు అలాగే 22 24 25 తేదీలలో గర్ల్ హై స్కూల్ జరుగుతున్న అంగన్వాడీ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు కార్యక్రమం లో మండల విద్యాశాఖాధికారి ఎమ్ వర్షపితావ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ సత్యనారాయణ ప్రాజెక్ట్ సి డి పి ఓ ఎ గజలక్ష్మి రిసోర్స్ పర్సన్లుగా అంగన్వాడీ సూపర్వైజర్లు ఎస్ కె ఫాతిమా బేగం వై హిమశ్రీ ఉపాధ్యాయులు టి విజయకృష్ణ బి ఎస్ వి ప్రసాద్ ఏ మౌళి తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం



**మామిడికుదురు.ఆగస్టు 11(ప్రభాతవార్త)** చిన్నారుల ప్రాథమిక విద్య,భాషా నైపుణ్యాలు, సంఖ్యా పరిజ్ఞానం, పిల్లల అభ్యసన సామర్థ్యాల పెంపు,బోధనా పద్ధతులు వంటి అంశాలపై అంగన్వాడీ టీచర్లకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం మామిడికుదురులో సోమవారం ప్రారంభమైంది.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణా కార్యక్రమాన్ని ఎంఈఓ లు శ్రీనివాస్,మోకా వెంకన్నలు ప్రారంభించారు.ఈ శిక్షణ తరగతులను అంగన్వాడీ టీచర్లు సద్వినియోగం చేసుకుని అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను చక్కగా తీర్చిదిద్దాలన్నారు.మండల పరిధిలోని 70 మంది అంగన్వాడీ టీచర్లకు వివిధ అంశాలపై శిక్షణ అందిస్తున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిరంజీవి పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు

### ఏర్పాట్లను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



**రంపచోడవరం, ఆగస్టు 11: ప్రభాతవార్త.** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 15న రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్‌కుమార్, ఓఎస్డీ జావలి, రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.స్మార్తి పరిశీలించారు. వేదిక, బారికేడ్లు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ కె.దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, అధికారులు, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సిహెచ్ బాలాజీ, కార్యనిర్వాహణ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, సీఐ ప్రసాద్, సహాయ సంచాలకులు (సర్వే) శ్రీనివాసరావు, ఏపీఈపీడీసీఎల్ ఏడీ మహాకాళేశ్వరరావు, డీఈఈలు పి.వెంకటరమణ, చైతన్య, భవాని, ఏఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రియాంక ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి

### మాజీ ఎంపీ మార్గాన్ని భరత్ రామ్



**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11( ప్రభాతవార్త)** మెడికో విద్యార్థిని డాక్టర్ ప్రియాంక మృతి పై సమగ్ర విచారణ జరిపించాలని దీంతో అన్ని వాస్తవాలు బయటికి వస్తాయని రాజమహేంద్రవరం పార్లమెంట్ మాజీ సభ్యుడు వైసిపి జాతీయ అధికార ప్రతినిధి మార్గాన్ని భరత్ రామ్ రిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల మూడవ తేదీన ఆమె ను కారుతో ఢీ కొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపరిస్తే ఆరో తేదీ వరకు ఎందుకు బయటకు రాకుండా చేశారని నిలదీశారు. ఈ కేసు విషయంలో ఈనెల 6న మాత్రమే అరెస్టు ఎందుకు చూపించాలని నిలదీశారు నిందితులు పరారీలో ఉన్నారా పోలీస్ కస్టడ్ లో ఉన్నారా ఇంత దారుణమైన ఘటనను ప్రమాదం గా ఎందుకు చూపించారు అని ప్రశ్నించారు. ప్రకాష్ నగర్ పోలీసుల విచారణ తీరుపై కూడా తమకు చాలా అనుమానాలు ఉన్నాయని అవసరమైతే వారిపై కూడా విచారణ జరిపించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రియాంక కుటుంబానికి వైసిపి తరఫున పూర్తిగా అండగా నిలబడతావని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఇటువంటి దారుణమైన ఘటనలు జరగకుండా నిందితులకు కఠిన శిక్షలు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నేటి నుంచి జ్ఞానజ్యోతి. సి డి పి ఓ, వెంకట లక్ష్మి.



**రౌతులపూడి, ఆగస్టు 11,(ప్రభా త వార్త)** నేటినుంచి గురువారం వరకు జ్ఞాన జ్యోతి కార్య క్రమం నిర్వహించుచున్నట్లు సి డి పి ఓ వెంకట లక్ష్మి తెలిపారు. గర్భిణీ స్త్రీలు సంరక్షణ, పిల్లల ఎదుగుదల, అభివృద్ధి తదితర అంశాలపై శిక్షణా తరగతులు అంగన్వాడీ కార్యకర్తలకు తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో సూపర్ వైజర్ నాగమణి,ఉపాధ్యాయులు కోళ్ల రాంబాబు, మోహన్,శ్రీనివాస్ ,వెంకటలక్ష్మి తదితరులు ట్రైనింగ్ ఇచ్చిన వారిలో ఉన్నారు.

## ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబుకు

# ఘనంగా జన్మదిన వేడుకలు



**గోకవరం:ఆగస్టు 11ప్రభాత వార్త** మండల కేంద్రమైన గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు సుంకర శ్రీవల్లి వీరబాబు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబును పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు శాలువాలు, పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవో ఎం. గోవిందు, తహసీల్దార్ పి. రామకృష్ణ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు మాట్లాడుతూ తనపై అభిమానంతో వచ్చి జన్మదిన శు భాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం సెక్రటరీ దాసరి చినబాబు, జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు సుంకర రమణ, జడ్పీటీసీ సభ్యురాలు దాసరి శ్రీరంగా రమేష్, మాజీ జడ్పీటీసీ సభ్యులు పాలూరి బోసుబాబు, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ సెక్రటరీ తోలేటి రాంప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు

## చెరుకుంపాలెం దుర్గాదేవికి ఆషాఢం సారె



**రాజవొమ్మంగి, ఆగస్టు 11, ప్రభాతవార్త:** రాజవొమ్మంగి మండలం చెరుకుంపాలెం గ్రామంలో మంగళవారం దుర్గాదేవికి ఆషాఢం సారె కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో పండుగ వాతావరణంలో నిర్వహించారు. చెరుకుంపాలెం, మర్రిపాలెం గ్రామాలకు చెందిన సుమారు 50 మంది మహిళలు సంప్రదాయ వస్త్రాలు ధరించి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఉదయం మహిళలు బాజా భజంత్రీలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని దుర్గాదేవికి ఆషాఢం సారెను సమర్పించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 200 రకాల పిండి వంటకాలను తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. దీప, ధూపాలతో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులు భజనలు చేశారు. దుర్గాదేవి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఆషాఢం సారె కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు తరలిరావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## అంగన్వాడీ వర్కర్స్ కు జ్ఞానజ్యోతి శిక్షణ ప్రారంభం



**రాజవొమ్మంగి, ఆగస్టు 11, ప్రభాతవార్త** రాజవొమ్మంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్వాడీ వర్కర్స్ కు మూడు రోజులు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని యం. ఇ. ఓ. కె. వి. వి. సత్యనారాయణదొర ప్రారంభించారు. మొదటి రోజు శిక్షణలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే 3 సం. నుండి 6 సం. లోపు చిన్నారులకు సులభంగా ఆంగ్లబోధన పై డి. ఆర్. పి లు మఠం చంద్రశేఖర్ బాబు, పప్పుల సరస్వతి, కోటం సత్యనారాయణ శిక్షణలో వివరించారు. చిన్నారులకు ఆంగ్ల పరిచయం, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తో బోధన, కృత్యారాధ బోధన, అభినవ గేయాలు వంటి పద్ధతులతో సులభమైన బోధన చేసే అంశాలను తెలిపారు. బుధ, గురువారాలు కూడా శిక్షణ ఉంటుందని సూపర్ వైజర్స్ వీరయ్యమ్మ, అమ్మిరాజు అన్నారు. ఈకార్యక్రమంలో యం. ఇ. ఓ. లు కె. వి. వి. సత్యనారాయణదొర, టి. సూరయ్యరెడ్డి, హెచ్. యం. ఆదిలక్ష్మి, డిఆర్పీలు మఠం చంద్ర శేఖర్ బాబు, పప్పుల సరస్వతి, కోటం సత్యనారాయణ, సూపర్ వైజర్స్ వీరయ్యమ్మ, అమ్మిరాజు, సి. ఆర్పీ శ్రీనివాస్, 101 మంది అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

## తల్లీ బిడ్డ సంక్షేమానికే తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్

### తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ నూతన వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం :ఆగస్టు 11 ప్రభాత వార్త** గ్రామీణ ప్రాంత వాసులకు తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ ఎంతో ఉపయోగకరమైన ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ నూతన వాహనాన్ని మంగళవారం నాడు ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కన్నబాబు, జగ్గంపేట మార్కెట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ ఉంగరాల రాము, గోకవరం సొసైటీ చైర్మన్ ఘాజింగం సత్తిబాబు, మండల టిడిపి కన్వీనర్ పిల్ల చంటి బాబు,రాష్ట్ర స్థాయి,జిల్లా స్థాయి,మండల స్థాయి నాయకులు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, అరుణ కుమారి, పిట్టా అరుణ్, రాయవరపు శ్రీను ప్రభుత్వ వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## "వరి"లో యాజమాన్య పద్ధతులు చేపట్టాలి..

### జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ నందకిషోర్..



**అంబాజీపేట, ఆగస్టు 11, (ప్రభాతవార్త):** వ్యవసాయంలో ప్రస్తుతం నెలకొన్న అనిశ్చిత వాతావరణ పరిస్థితులకు ఎల్ నినో కారణమని, దానివలన వర్షాలు తక్కువగా పడి,వరి పొలాల్లో కొన్ని రకాల పురుగులు,తెగుళ్లు ఎక్కువయ్యే అవకాశం ఉందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్ తెలిపారు. మండలంలోని పసుపల్లి గ్రామంలో మండల వ్యవసాయాధికారి కె.ధర్మప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ వరి రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా యాజమాన్య పద్ధతులు చేపట్టాలని సూచించారు.ఎరువులను సమతుల్యంగా వాడాలని, యూరియాను ఎక్కువగా వినియోగించవద్దని,పటాస్ ఎరువును దుమ్ములోను,చిరుపొట్ట దశలోను తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. కాంప్లెక్స్ ఎరువులను ఆకు ఊడ్చిన పది రోజులలోగా వేసుకోవాలన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో వరిలో "ఆకునల్లి" ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, మూడు గ్రాముల గంధకంను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే పటాస్ లోపంతో వరి ఆకులు పసుపు రంగుకు మారినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వినియోగించాల్సిన రసాయనాల వాడే విధానాన్ని రైతులకు సూచించారు.పిఎం ఎఫ్బివై పథకంలో ఎకరా వరి చేనుకు రూ.76లు చెల్లించి పంటల బీమా చేయించుకోవాలని, ఈనెల 15తో గడువు ముగిస్తుందని మండల వ్యవసాయాధికారి ధర్మ ప్రసాద్ రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కుడుపూడి రాంబాబు, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ నాగులాపల్లి కొండలరావు, రైతు గంగుమళ్ళ వీరభద్రరావు, ఏఈఓ పి.జాబేజ్ శాస్త్రి, వీఏఏ లు కె.దేవా,స్వర్ణతేజ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మోరంపూడి ఫ్లైఓవర్‌కు శాశ్వత పరిష్కారం



**రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 11, (ప్రభాతవార్త)** విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్ వద్ద రూ.3.40 కోట్ల అంచనా వ్యయంతో అప్రోచ్, సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వ ఆలోచనా విధానానికి మోరంపూడి ఫ్లైఓవర్ నిదర్శనమన్నారు. గత పాలనలో కాంట్రాక్టర్‌ను ఇబ్బందులకు గురిచేయడంతో పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చొరవతో ప్రక్రియ వేగవంతమైందన్నారు. సర్వీస్ రోడ్ల నిర్మాణంతో వాహనదారులు, ప్రజల ఇబ్బందులు తొలగుతాయని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పష్టం చేశారు.

### ఉద్యోగ సాధనకు కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఎంతో కీలకం



**గండేపల్లి. ఆగస్టు 11. ప్రభాతవార్త** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అలుమ్ని ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా డెవాన్స్ క్లాసెస్ వ్యవస్థాపకుడు, ఫ్రీలాన్స్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ కె. సాయి దేవన్ పాల్గొని ప్రసంగించారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షిస్తూ.. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సమర్ధవంతమైన లికమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, ఇంటర్వ్యూ మరియు వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలను పెంపొందించుకోవాలి అని ఆంగ్ల భాషా నైపుణ్యం పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొననున్నారు.

### తేటగుంట యనమల గార్డెన్స్ లో వరుణ యాగానికి ఏర్పాట్లు



**తుని, ఆగస్టు 11,( ప్రభాతవార్త )** తుని మండలం తేటగుంట లోని యనమల గార్డెన్స్ ఆధ్యాత్మిక కార్యక్రమానికి వేదిక కానుంది.. వర్షాలు సమృద్ధిగా కురవాలని, అన్నదాతలు సుభిక్షంగా ఉండాలని, గ్రామాలు పాడిపంటలతో కళకళలాడాలని ఆకాంక్షిస్తూ మాజీమంత్రి యనమల రామకృష్ణుడు, తుని నియోజకవర్గ ఎమ్మెల్యే యనమల దివ్య వరుణ యాగం జరిపించాలని నిర్ణయించారు.. ఈనెల 19 నుంచి 22 తేదీ వరకు తేటగుంటలోని యనమల గార్డెన్స్ ఈ మహత్తర కార్యక్రమానికి వేదిక కానుంది.వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య వరుణ యాగం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.టీడీపీ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, యినుగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, మల్ల గణేష్, కుసుమంచి సత్యనారాయణ తదితరులు మంగళవారం యాగం నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. యాగం నిర్వహణపై వేద పండితులు నేతలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తుని నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం వరుణ యాగం జరిపించాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య నిర్ణయించారన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని, 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు యాగాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు.

# యువతి దారుణ హత్య.. నిందితుడి ఆత్మహత్యాయత్నం

**రాజమహేంద్రవరం అర్బన్: ఆగస్టు 11 (ప్రభాతవార్త)** పరిచయస్తుడి చేతిలో ఓ యువతి దారుణ హత్యకు గురైన ఘటన రాజమహేంద్రవరంలో కలకలం రేపింది. యువతిని కత్తితో మెడపై తీవ్రంగా గాయపరిచి హతమార్చిన అనంతరం నిందితుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని పోలీసులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం నిందితుడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**సర్వీస్ రోడ్డుపై మృతదేహం.. కొన ఊపిరితో యువకుడు**

రాజమహేంద్రవరం కాతేరు నుంచి ఫోర్త్ బ్రిడ్జి వైపు వెళ్లే సర్వీస్ రహదారి పక్కన సోమవారం రాత్రి ఓ మహిళ మృతదేహం, తీవ్ర గాయాలతో ఓ యువకుడు పడి ఉన్న ఘటన వెలుగులోకి వచ్చింది. రాత్రి 11.05 గంటల సమయంలో చీనా× హైవే పెట్రోల్ సిబ్బంది జగదీష్ దయల్ 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడే ా 40 జ 0662 నంబరు గల ద్విచక్ర వాహనం కూడా ఉన్నట్లు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. నైట్ డ్యూటీలో ఉన్న సౌత్ జోన్ డీఎస్పీ, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, రోడ్ సేఫ్టీ మొబైల్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని పరిశీలించి తీవ్ర గాయాలతో ఉన్న యువకుడిని ఆసుపత్రికి తరలించారు.

**కత్తితో మెడపై దాడి**

పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం మృతురాలు వరదా ప్రసన్న ఏ మధు (21), శాంతినగర్‌కు చెందిన సత్యనారాయణ కుమార్తె. నిందితుడు కుసుమ అభిలాష్ (21), కోటిలింగాలపేటకు చెందిన లేట్ చంద్రశేఖర్ కుమారుడు. వీరిద్దరికీ గతంలోనే పరిచయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సోమవారం రాత్రి 8.30 గంటల తర్వాత వీరిద్దరూ సంఘటనా స్థలానికి వచ్చినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం అభిలాష్ మధుపై కత్తితో దాడి చేసి మెడపై తీవ్రంగా గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాల కారణంగా ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు.

**హత్య అనంతరం పురుగుల మందు**

యువతిపై దాడి చేసిన అనంతరం అభిలాష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడి పరిస్థితిని గమనించి వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ





ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మెట్‌సేఫ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

**కేసు నమోదు.. దర్యాప్తు ముమ్మరం**

ఈ ఘటనపై రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 369/2026గా దీచీూ సెక్షన్ 103(1) కింద కేసు నమోదు చేశారు. హత్యకు దారితీసిన కారణాలు ఏమిటి? యువతికి, నిందితుడికి మధ్య ఉన్న సంబంధం ఏమిటి? ఘటనకు ముందు ఏం జరిగింది? వంటి అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, ద్విచక్ర వాహనం, పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజీ తదితరాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. నిందితుడు కోలుకున్న అనంతరం అతడిని విచారించి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను రాబట్టేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

# విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

### మహిళల భద్రత, సైబర్ నేరాలు, రహదారి భద్రతపై అవగాహన



**రంపచోడవరం: ఆగస్టు 11. ప్రభాతవార్త** రంపచోడవరం లెనోరా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, రహదారి భద్రత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ అదనపు ఎస్పీ మంద జావళి, రంపచోడవరం ఎస్‌డీపీవో అష్రాఫ్ అలీ , రంపచోడవరం సీఐ నాగేంద్ర ప్రసాద్ , పోలీసు సిబ్బంది పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు, విద్యార్థినుల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనుమానాస్పద వ్యక్తులు, ఘటనలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండటంతో పాటు, ఇతరుల భద్రతకు కూడా సహకరించాలని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తత ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, నకిలీ ఉద్యోగ అవకాశాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, పాస్‌వర్డ్‌లు, రహస్య సంకేతాలు ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతగా వినియోగించాలని సూచించారు. రహదారి భద్రతకు ప్రాధాన్యం విద్యార్థులు రహదారి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగించకూడదని, అతివేగానికి దూరంగా ఉండాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలపై విద్యార్థులకు వివరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం లేదా సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిసినప్పుడు పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## జాతీయ సదస్సులో డాక్టర్ సాద్వితకు ప్రథమ స్థానం



**పెదపూడి.ఆగస్టు 11: ప్రభాతవార్త** ముంబైలో ఆగస్టు 9న నిర్వహించిన జాతీయ స్థాయి చర్మవ్యాధుల వైద్య నిపుణుల సదస్సులో పెదపూడి మండలం గొల్లల మామిడాడకు చెందిన డాక్టర్ మేడపాటి సాద్విత ప్రథమ స్థానం సాధించారు. జాతీయ స్థాయిలో తెలుగు విద్యార్థి ప్రతిభ చాటడం పట్ల ఆమె తల్లిదండ్రులు మేడపాటి సూరారెడ్డి, సరిత దంపతులతో పాటు యూత్ నేత చింత దొరబాబు, మాజీ జెడ్పీటీసీ సత్తి భగవాన్ రెడ్డి హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. గొల్లలమామిడాడకు కీర్తిని తెచ్చిన శుభ సందర్భంగా చిరంజీవికి కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ స్పీకర్ ఓ ఎస్ డి పడాల సత్యనారాయణ రెడ్డి , మాజీ జెడ్పిటిసి సత్తి భగవాన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి యువనాయకులు చింతా దొరబాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ డిసిఎంఎస్ డైరెక్టర్ పైన పిఏసిఎస్ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ అమ్మిరెడ్డి, గొల్లల మామిడాడ గ్రామ వైఎస్ఆర్సిపి కన్వీనర్ మేడపాటి తాతారెడ్డి, ద్వారంపూడి వెంకటరెడ్డి మాజీ చాంబర్ అధ్యక్షులు, ద్వారంపూడి వెంకటరెడ్డి (చింతపండు) పప్పు చిన్నారెడ్డి, రామారెడ్డి, కర్రి రామసుబ్బారెడ్డి, పడాల అమ్మిరెడ్డి, తాడి వీర ఫ్రెండ్స్ , మేడపాటి వీర ఫ్రెండ్స్ , కర్రి చందు ఫ్రెండ్స్, చక్రి ఫ్రెండ్స్, సంజయ్ ఫ్రెండ్స్, ఎంవివి రామారెడ్డి, కర్రి వీర్రెడ్డి, మేడపాటి అమ్మిరెడ్డి,చింతాదొరబాబు యూత్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఫిర్యాదులు.. హామీలే.. పరిష్కారం ఏది ?



**గోపాలపురం, ఆగస్టు 11 (ప్రభాతవార్త)** మండలంలోని, సాగిపాడు గ్రామంలో సర్వే నంబర్ 79/1లో ఉన్న య.3.96 సెంట్ల స్మశాన వాటిక భూమి విషయంలో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించి గ్రామస్థులకు న్యాయం చేయాలని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు అధికారులను కోరారు. ఈ మేరకు గోపాలపురం తహసీల్దార్ మహాలక్ష్మికి మంగళవారం మరోసారి వినతిపత్రం అందజేశారు. తణుకు వేములయ్య అనే వ్యక్తి స్మశాన వాటిక భూమిని అక్రమంగా ఆక్రమించుకుని అనుభవిస్తున్నాడని ఆరోపించారు. దాని వలన మృతదేహాలను ఖననం చేసేందుకు దారి లేక గ్రామస్థుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయని వాపోయారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఏడీ సర్వే అండ్ ల్యాండ్స్, కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం, జిల్లా ఎస్పీతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే, సమస్యను పరిష్కరిస్తామని అధికారుల నుంచి మెసేజీలు, స్పందన వస్తుందే తప్పా.. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే భూమిపై సమగ్ర విచారణ జరిపి గ్రామస్థులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, జిల్లా పంచాయతీ అధికారులకు కూడా ఫిర్యాదు ప్రతులను పంపినట్లు దొడ్డిగర్ల సువర్ణరాజు తెలిపారు. పోసిన గణపతి, సాగిపాడు గ్రామస్తులు నారాయణ రాజు, నరసింహమూర్తి, సత్తిబాబు, శ్రీను, వెంకటేశ్, వీరస్వామి, జనసేన పార్టీ శ్రేణులు నాగేంద్ర, బాలు తదితరులు పాల్గొన్నారు.

## కేజే ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీ



**గోపాలపురం, ఆగస్టు 11 (ప్రభాతవార్త):** కేజే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని సాగిపాడు లెప్రసీ కాలనీలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా కళ్లజోళ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. కాలనీలో నివాసముంటున్న 16 కుటుంబాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఇటీవల నిర్వహించిన వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి మంగళవారం కళ్లజోళ్లు అందజేశారు. అనంతరం వారికి పౌష్టికాహారం పంపిణీ చేశారు. కాలనీ వాసులతో పాటు మరికొంతమంది సేవకులకు కూడా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. కేజే ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆకుల పవన్ కళ్లజోళ్లను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో జీసస్ వారియర్స్ ప్రేయర్ గ్రూప్ సువార్తికులు ప్రసాద్, జి.సైమన్, కే.మాణిక్యం, పి.రామ్మోహన్, రూపస్, పి.జెకర్యా, యేసురత్నం, జే.మోషే, బెంజిమెన్, అలెగ్జాండర్, సాల్మన్ రాజుతో పాటు కంటి వైద్యులు పాల్గొన్నారు.

## నేషనల్ మెరిట్ స్కాలర్షిప్ కి విద్యార్థి ఎంపిక.



**రౌతులపూడి, ఆగస్టు 11,(ప్రభాత వార్త)** మండల గ్రామం లచ్చిరెడ్డి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న గొట్టుపల్లి విష్ణు వర్ధన్ 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయం తో చదువుకోవడానికి ఎంపికైనట్లు మండల రెండవ విద్యాధికారి గాడి కొండబాబు తెలిపారు.8వ తర గతి లో విద్యా శాఖ పెట్టిన పరీక్షల్లో ప్రతిభ కనబరచి ఈ స్కాలర్షిప్ కి ఎంపికైనట్లు తెలిపారు. విష్ణు వర్ధన్ ను ఉపాధ్యాయులు గ్రామపెద్దలు అభినందించారు..

మరిన్ని వార్తలు 6లో

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# వైసిపి విషప్రచారంపై నిప్పులు చెరిగిన యంఎల్ఏ శిరీషదేవి



**చింతూరు ఆగస్టు 11 ప్రభాత వార్త** . ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డీఎస్సీ నిర్వహించి 16,343 టీచరు ఉద్యోగాలను భర్తీ చేస్తే అది చూసి ఓర్వలేక వైసిపి తప్పుడు ప్రచారం చేస్తుందని, వైసిపి విష ప్రచారంపై రంపచోడ ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి నిప్పులు చెరిగారు. మంగళవారం చింతూరు పర్యటనకు వచ్చిన ఆమె చింతూరు మండలం నిమ్మలగూడెం గ్రామములోని జెకె సిటీలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించిన ఆమె వైసిపి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టారు. ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేని వైసిపి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిఎస్సీ పైనే తొలి సంతకం చేశారని, ఎంతో ప్రతిష్టత్మకంగా డీఎస్సీని నిర్వహించి 16,343 మందికి టీచర్ ఉద్యోగాలు ఇస్తే ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని నిప్పులు చేరిగారు. వై సి పి హాయంలో రాష్ట్రం మొత్తాన్ని అప్పుల మయం చేసి ఖజానాను ఖాళీ చేస్తే అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఎన్నో కష్టనష్టాలను అనుభవించి రాష్ట్రాన్ని పరిపాలనను గాడిలో పెట్టారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వ హాయంలో రాష్ట్రంలోని అనేక పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లాయని, ఇక్కడ పరిశ్రమల స్థాపించడానికి భయపడ్డ కార్పొరేట్ కంపెనీలు ఈ రాష్ట్రాన్ని వదిలి దూరంగా వెళ్లిపోయాయని, మళ్లీ అధికారంలోకి టిడిపి రాగానే అనేక పరిశ్రమలు ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపిస్తున్నాయని తద్వారా వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయని ఆమె అన్నారు.బోగా పురం ఎయిర్పోర్ట్ ను పూర్తి చేసి జాతికి అంకితం చేశారని, బోగాపురం ఎయిర్పోర్ట్ తో అక్కడ ఉపాధి, ఉద్యోగాలు వేలమందికి లభిస్తాయి అని అన్నారు. అది చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారాలు చేస్తుంది అని ఆమె విమర్శించారు.రాష్ట్రంలో ప్రజలు ప్రశాంతంగా ఉండటం ఈ పార్టీకి ఇష్టం లేదు అని అందుకే ఎక్కడో ఒకచోట అలజడి సృష్టించి ఫేక్ మీడియాతో తప్పుడు ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, ప్రజలు, మేధావులు ఇటువంటి తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని ఆమె అన్నారు.

## సేవక్రియం ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ



**పెదపూడి,ఆగస్టు 11: (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం పైన గ్రామంలో ఉన్న సత్య హెల్పింగ్ డిజబుల్ సొసైటీ అనాధ ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు, వికలాంగులకు, కంటిచూపు లేని వారికి సుమారు 100 మందికి కరకుదురు గ్రామానికి చెందిన సేవ క్రియం ట్రస్ట్ అధినేత తలాటం మురళీకృష్ణ దుప్పట్లు, భోజనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవ క్రియం ట్రస్ట్ వైస్ చైర్మన్ పాలంశెట్టి త్రిమూర్తులు మాట్లాడుతూ పైన గ్రామంలో ఏర్పాటు చేసిన హెల్పింగ్ హేన్డ్స్ అనాధ ఆశ్రయానికి పెదపూడి మండలం పెద్దాడ గ్రామంలో పైడిమళ్ల సత్యనారాయణ ఏర్పాటుచేసిన కార్యక్రమానికి వచ్చిన అందరికీ కూడా సేవ క్రియం ట్రస్ట్ తరఫున తలాటం మురళీకృష్ణ సుమారు 100 మందికి దుప్పట్లు, భోజనాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు మాకు చాలా సంతోషంగా ఉందని, దీనిని ఆదర్శంగా తీసుకుని పెదపూడి మండలంలో ఉన్న అన్ని గ్రామాల నుంచి దాతలు ఈ అనాధ ఆశ్రమానికి సాయం చేయాలని కోరుకుంటున్నామని సేవ క్రియం ట్రస్ట్ వైస్ చైర్మన్ పాలం శెట్టి త్రిమూర్తులు తెలిపారు. పైన సత్య హెల్పింగ్ డిజబుల్ సొసైటీ అనాధ ఆశ్రయం ప్రెసిడెంట్ రాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ అనాధ ఆశ్రమంలో ఉన్న వికలాంగులు, వృద్ధులు, అనాధ ఆశ్రమం నడిపిస్తూ, సేవ క్రియం ట్రస్ట్ అధినేత తలాటం మురళీకృష్ణ అంధులకు, వికలాంగులకు, వృద్ధులకు, అనాధ బిడ్డలకు, సుమారు 100 మందికి దుప్పట్లు, భోజనాలు వసతులు ఏర్పాటుచేసిన సేవక్రియం ట్రస్ట్ ఇంకా అభివృద్ధి చెంది రానున్న రోజుల్లో ఇంకా ట్రస్ట్ తరఫున అనేకమందికి సహాయ సహకారాలు అందించాలని, సేవ క్రియం ట్రస్ట్ అధినేత తలాటం మురళి కృష్ణకు, వారి బృందానికి ఆ దేవుడు ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని రాయుడు శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలం శెట్టి శ్రీనివాస్, పుండ్రు రామకృష్ణ ,ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలి: ఎంపీపీ సత్యప్రసాద్



**కడియం, ఆగస్టు 11 ( ప్రభాతవార్త)** రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అలవాటు చేసుకుని ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలని కడియం మండల పరిషత్ అధ్యక్షుడు వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ సూచించారు. మండల కేంద్రం కడియం ఆవ ప్రాంతంలో ఆత్మ పథకంలో భాగంగా రైతు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్, పి.ఎ.సి.ఎస్ అధ్యక్షులు వెలుగుబంటి నాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని, యాంత్రీకరణ, డ్రోన్లతో పాటు నానో యూరియా, నానో డీఏపీ, నానో పొటాషియం అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవాలని వారు సూచించారు. వరి రైతులందరూ పంటల బీమా చేయించుకోవడంతో పాటు రైతు గుర్తింపు సంఖ్య కలిగి ఉండాలని, పంటకు సంబంధించిన ప్రభుత్వ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని రాజమహేంద్రవరం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. శశిబిందు తెలిపారు. పంటకు అవసరమైన మేరకే ఎరువులు వాడాలని, చీడపీడలు పరిమితి దాటినప్పుడు మాత్రమే మందులు పిచికారీ చేయాలని శిక్షణ సహాయ వ్యవసాయ సంచాలకురాలు జయసావిత్రి సూచించారు. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో ఆవరించిన వాతావరణ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలతో సార్వా వరి పంటలో చీడపీడలు పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు డా. ఎం.వి.వి. నరసింహరావు, ఎం. శ్రీనివాసరావు తెలిపారు. రైతులు ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలుకలు, మువ్వ పురుగు, ఎండాకు, కాండం కుళ్ళు వంటి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చని ఉద్యానవన అధికారి డి. సుధీర్ సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.వి. శ్రీనివాస్, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రత్యూష, రమేష్, రైతులు పాల్గొన్నారు.

## తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**తుని, ఆగస్టు 11,( ప్రభాతవార్త )** తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో 80వ భారత స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.విద్యార్థులు, కళాశాల సిబ్బంది జాతీయ జెండాను ప్రదర్శిస్తూ, దేశభక్తి గీతాలు ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ లలిత మాట్లాడుతూ విద్యార్థులు, ప్రజలలోదేశభక్తిని పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఎన్ఎస్ఎస్ దత్త గ్రామం వి. కొత్తూరులో ఇంటింటికి వెళ్లి జాతీయ జెండాలు అందించి ఇంటిపై ప్రదర్శించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించారు. జాతీయ పతాక విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ -×× కోఆర్డినేటర్ డాక్టర్ డి లక్ష్మి, యూనిట్ సభ్యులు భారతి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనక దుర్గ అమ్మవారికి ఆషాఢ చీర - సారె...



**సఖినేటిపల్లి ఆగస్టు 11, ప్రభాత వార్త:** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో వెలిసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఈ రోజు చీరా సారె ను అమ్మవారికి అందించారు. చెరువు గట్టు దగ్గర నుండి ఊరేగింపుగా వాయిద్యాలతో తరలివచ్చిన మహిళలు సారె సమర్పించి, భక్తులు ప్రసాదం స్వీకరించారు.

## పీపీపీ పేరుతో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం

### మాజీ మంత్రి కురసాల కన్నబాబు



**కాకినాడ రూరల్ , ఆగస్ట్11 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో పిపిపి విధానం పేరుతో ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థలకు చేస్తుందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆరోపించారు. రమణయ్యపేట మాజీ ఎమ్మెల్యే కన్నబాబు స్వగృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటీకరణ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలతో పాటు ఆర్టీసీ స్థలాలు, ఆసుపత్రులు, పరిశ్రమలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఆస్తులు అప్పగించడమే కాకుండా బ్యాంకు రుణాలు, వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ పేరుతో ప్రజాధనాన్ని వెచ్చించడం ఎందుకని ప్రశ్నించారు. ప్రైవేటు సంస్థలకు అనుకూలంగా పాలసీలు రూపొందుతున్నాయని ,పీపీపీ విధానాన్ని అడ్డుకుని, ప్రజలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ పేరిట రాష్ట్రాన్ని కార్పొరేట్ కంపెనీలకు అమ్మేసే యోచనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారని వైఎస్సార్‌సీపీ నేత కురసాల కన్నబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## 'పంచ సమ్మేళన్' పై అవగాహన సదస్సు



**గొల్లప్రోలు,ఆగస్టు 11,(ప్రభాతవార్త)** గొల్లప్రోలు మండల మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన కల్పించేందుకు "పంచ సమ్మేళన్" కార్యక్రమాన్ని నిర్వహించారు. వికసిత్ భారత్ – జి రాంజీ జీ చట్టంపై ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఎన్. సెలాట్ రాజు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ (పిపిటి) ద్వారా ప్రజాప్రతినిధులకు,స్పెషల్ ఆఫీసర్లకు సమగ్రంగా శిక్షణ ఇచ్చారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు అభివృద్ధి పథకాలను ఎలా ముందుకు తీసుకువెళ్లాలి కొత్త చట్టాల ద్వారా ప్రజలకు చేకూరే లబ్ధి ఏమిటని అంశాలపై ప్రజాప్రతినిధులకు క్షుణ్ణంగా వివరించారు ప్రతి గ్రామీణ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడం,జీవనోపాధి మెరుగు పరచడం,శాశ్వత ఆస్తుల నిర్మాణం చేపట్టడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు.అలాగే ప్రకృతి వనరుల సంరక్షణ,పరిపాలనలో సాంకేతిక వినియోగం పెంచడం,పారదర్శకమైన పాలన అందించడం వంటి పలు కీలక అంశాలపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు కూలంకషంగా వివరించారు. సమావేశం ప్రారంభానికి ముందు జాతిపిత మహాత్మా గాంధీ,రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు అరిగెల అచ్చియమ్మ రామయ్య దొర,జెడ్‌పీటీసీ సభ్యులు ఉలవకాయల నాగ లోవరాజు,వైస్ ఎంపీపీ ఆదివిష్ణు, తాటిపర్తి ఎంపీటీసీ నూకరాజు,ఏపీ మల్లవరం ఎంపీటీసీ సుబ్రహ్మణ్యంలతో పాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.అధికార యంత్రాంగం తరపున డీవై ఎంపీడీవో వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు వెన్న శ్రీనివాస్,బీవీ శివప్రసాద్,ఏపీఓ బెజవాడ సత్యనారాయణ,మండల వ్యవసాయ అధికారి కెవివి సత్యనారాయణ,జేఈ రాంజీ,వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ శిక్షణ సదస్సుకు హాజరయ్యారు.

## మురమండ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన



**కడియం, ఆగస్టు 11 ( ప్రభాతవార్త)** కడియం మండలం మురమండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కడియం ఎస్ఐ దుర్గాప్రసాద్, ఈగల్ బృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించే విధానం, అనుమానాస్పద సంఘటనలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈగల్ బృందం ఎస్ఐ విజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు, కానిస్టేబుళ్లు రామ్‌కుమార్, చిన్న శ్రీను, కళాశాల సిబ్బంది, సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాలను పరిశీలించిన అధికారులు..



**అంబాజీపేట,ఆగస్టు 11 (ప్రభాతవార్త):** అంబాజీపేటలో పలు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలను డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ వై ఖోమ్ నైడియా దేవి కొత్తపేట ఆర్డీఓ జి.వి.సత్యనారాయణతో కలిసి మంగళవారం పరిశీలించారు. స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో ఉన్న స్థలాన్ని పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలను పరిశోధన కేంద్రం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు నిమిత్తం స్థల సేకరణలో భాగంగా ఇక్కడ స్థలాన్ని పరిశీలించారు.ఉపాధి కల్పన కోసం ఇండస్ట్రీస్ ను ఏర్పాటు చేసేందుకు అనువైన స్థల సేకరణ అవసరమై ఉందన్నారు. అనంతరం ఆర్డీఓ సత్యనారాయణ ఆర్టీసీ బస్ స్టేషన్ వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు. వీరి వెంట తహసీల్దార్ బి.చినబాబు, ఆర్ఐ కె. ఏడుకొండలు, సర్వేయర్లు, వీఆర్వోలు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి చెక్కు అందజేసిన జనసేన నాయకులు



**యు.కొత్తపల్లి, ఆగస్టు 11 (ప్రభాతవార్త) :** ఇటీవల ఉప్పాడ గ్రామానికి చెందిన మత్స్యకార మహిళలు ఆటోలో సామర్లకోట వైపు వెళుతుండగా జరిగిన ప్రమాదంలో ఇరువురు మరణించగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గరికిన సింహాద్రి కూడా మృతి చెందిన విషయం విదితమే. సంఘటనా స్థలంలో మృతి చెందిన ఇరువురు బంధువులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన చెక్కులను గతంలో అందజేయడం జరిగింది. మంగళవారం సింహాద్రి కుటుంబ సభ్యులకు డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, పాడా పీడీ ఎన్. శివరామప్రసాద్ చేతుల మీదుగా రూ. 2లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రావు అక్షయ్ జనసేన పార్టీ సీనియర్ నాయకులు జ్యోతుల శ్రీనివాస్, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఉప్పాడ గ్రామ ఇంచార్జ్ గంట విజయ్ కుమార్, పొన్నాడ, మూలపేట గ్రామ ఇన్చార్జిలు పల్లెటి బాపన్న దొర, రామిశెట్టి రాంబాబు తదితరులు ఉన్నారు.

## మా ఇష్టం జోరుగా చెరువులు తవ్వేస్తాం.. అడిగేవారెవరు..?



**కాట్రేనికోన ఆగస్టు 11(ప్రభాతవార్త)** కాట్రేనికొన మండలంలో అనుమతులు లేని చెరువుల తవ్వకాలు జోరుగా సాగుతుందని ప్రజలు వాపోతున్నారు. అధికార యంత్రాంగం తగు రీతిలో దృష్టి సారించకపోవడంతో ఆ ఏముందిలే అన్న చందాన కొంతమంది పంట భూములను ఆక్వా చెరువులుగా మార్చేస్తున్నారు .వీరికి అధికారుల అనుమతితో పనిలేదు. తాజాగా సత్తమ్మ చెట్టులో రెండు ఎకరాల పరిధిలో ఆక్వా చెరువును నాలుగు రోజులుగా తవ్వుతున్నారు. దీనికి ఎటువంటి అనుమతులు లేవని స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోలేదు. కొన్నిచోట్ల పేరుకే వెళ్లి పనులు తాత్కాలికంగా నిలిపి వేస్తున్నా..వారు వెళ్లిన వెంటనే తవ్వకాలు యధాతథంగా సాగుతున్నాయి. సత్తెమ్మ చెట్టులో గ్రామాన్ని ఆనుకుని చెరువు తవ్వడంతో తాగునీరు కలుషితమవుతాదని, చుట్టుపక్కల పంట పొలాలు నాశనమవుతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతులు లేనీ చెరువులు తవ్వకాలను నిలిపివేసి, ప్రొక్లైన్ సీజ్ చేసి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు

### ఆర్డీఓ మళ్లీ బాబు హెచ్చరిక



**గొల్లప్రోలు, ఆగస్టు 11,(ప్రభాతవార్త)** రైతులను తరచూ తిప్పించుకుంటే సహించేది లేదని,రెవెన్యూ అధికారులు,సర్వేయర్లు తమ పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని కాకినాడ ఆర్డీఓ మళ్లీ బాబు హెచ్చరించారు.శనివారం గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు), సర్వేయర్లతో ఆర్డీవో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.మండల పరిధిలోని పలు రెవెన్యూ అంశాలపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు.ఈ సమావేశంలో జాయింట్ ఎల్పీఎంలు,గతంలో నిర్వహించిన భూ సర్వేలలో తప్పులుగా నమోదైన హెచ్చుతగ్గులను ఇంతవరకు సవరించకపోవడంపై ఆర్డీఓ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.చిన్నచిన్న సమస్యల కోసం కూడా రైతులను రెవెన్యూ కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిప్పించుకోవడం ఏమిటని ఆయన అధికారులను ప్రశ్నించారు. సర్వేయర్లు,వీఆర్వోలు క్షేత్రస్థాయికి వెళ్లి భూ రికార్డులను ఎందుకు సరిచేయడం లేదని మండిపడ్డారు.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పలువురు వీఆర్వోలు, సర్వేయర్లతో ఆర్డీఓ నేరుగా మాట్లాడి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు.బాధ్యతాయుతంగా పనిచేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.ఈ సమావేశంలో గొల్లప్రోలు తహసిల్దారు వెంకట భాస్కర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ ఐ) బాలకృష్ణ,మండల సర్వేయర్ కేదారేశ్వర రావు,పలువురు వీఆర్వోలు, గ్రామ సర్వేర్లు పాల్గొన్నారు.

## చెవాలియర్ చెల్లాన్ నాయగర్ చిత్రపటానికి ఘన నివాళులు



**యానాం, ఆగస్టు 11: (ప్రభాతవార్త)** పుదుచ్చేరి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ నాయకుడు చెవాలియర్ చెల్లాన్ నాయగర్ చిత్రపటానికి ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పి.డబ్ల్యూ.డి. శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు, మంత్రులు రాజవేలు, శివకొళుంతు, ఎమ్మెల్యే విఘ్నేష్ కన్నన్ తదితరులు పాల్గొన్నారు. చెల్లాన్ నాయగర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొని చెవాలియర్ చెల్లాన్ నాయగర్‌కు ఘన నివాళులు అర్పించారు

## చిన్నారుల్లో సృజనాత్మకతను పెంచాలి : సీడీపీఓ శ్రీకళ



**యు.కొత్తపల్లి, ఆగస్టు 11 (ప్రభాతవార్త) :** పెరిగే చిన్నారుల వయస్సుకు తగినట్లగా సృజనాత్మకతను పెంపొందించేలా కృషి చేయాలని పిఠాపురం సీడీపీఓ శ్రీకళ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా బాల్య సంరక్షణ విద్య పై మూడు రోజుల శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల సమగ్ర అభివృద్ధి, ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య, వయస్సు కు అనుగుణమైన అభ్యాసన, ఆటపాటల అభ్యసనం నేర్పించాలన్నారు. ఈ శిక్షణలో గ్రేడ్ – విస్తరాధికారులు ఎస్. లలితా నిర్మల, సారమ్మ,ఉపాధ్యాయులు శేషారెడ్డి, రామకృష్ణ,సుబ్బిరెడ్డి, సీహెచ్.డి.రావు వివిధ అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు.

## విబిజి రామ్‌జి పథకంపై అవగాహన




**తాళ్లరేవు, ఆగష్టు 11 (ప్రభాతవార్త ):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్( వి బి జి రామ్ జి ) పథకం పట్ల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో స్వర్గన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ పాల్గొని మాట్లాడారు. నూతన పథకం పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పథకం లక్ష్యాలను ప్రజలకు చేకూరే ప్రయోజనాలను కూలీలకు వివరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఏపీవో తేజస్విని నూతన పథకం పట్ల అవగాహన కల్పించారు. గతంలో 100 రోజులు పని బదులు ఇప్పుడు 125 రోజులు పని కల్పిస్తున్నామన్నారు. పనికి దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి గ్యారంటీగా ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి కె. సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో వీ జే వి రమణ, వైస్ ఎంపీపీ ధూళిపూడి వెంకటరమణ, ఉప్పంగల ఎంపిటిసి కాదా శ్రీనివాస్, మండల అధికారులు వి బి జి రామ్ జి సిబ్బంది పాల్గొన్నారు.

# కదిలిన యంత్రాంగం

## ఏలేరు ప్రాంతంలో పర్యటించిన ఇరిగేషన్ అధికారులు

### " వార్త" కథనానికి స్పందన



**పిఠాపురం, ఆగస్టు 11 ( ప్రభాతవార్త )** ఏలేరు ఆయకట్టు ప్రాంతంలో మంగళవారంఇరిగేషన్ అధికారులు పర్యటించారు. గోపాల చెరువు, పి రాయవరం చెరువు, సింహాద్రి రాజు కాలువలను పరిశీలించారు. సోమవారం వార్త దినపత్రికలో ప్రచురించిన" కలింగల కట్టడి.. రైతుల కడగండ్లు " కథాంశానికి అధికారులు స్పందించారు. బి కొత్తూరు, గోకివాడ, రాపర్తి, భోగాపురం, బి ప్రత్తిపాడు, పి రాయవరం, పి తిమ్మాపురం, వెల్దుర్తి, పి దొంతమూరు, గ్రామాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారు.

## ఇంటి ఇంటికి టీ. డి. పి. కార్యక్రమంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

### చింతూరు మండలంలో ఎమ్మెల్యే పర్యటన విజయవంతం.

### ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత. ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి






**చింతూరు, ఆగస్టు 11ప్రభాత వార్త**.ఇంటి ఇంటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా చింతూరు మండల పర్యటనకు వచ్చిన రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవికి మంగళవారం చింతూరులో ఘన స్వాగతం లభించింది. చింతూరు మండలం చిడుమూరు, ముకునూరు గ్రామాల్లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తమ గ్రామాల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవికి ఆ పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులు పూలను చల్లి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం అని ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తామని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. చిడుమూరు, ముక్కునూరు గ్రామాల్లో అనేకమంది గృహాలకు వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి, ప్రజలకు చేకూరుతున్న లబ్ధి గురించి ఆమె ఆరా తీశారు. తల్లికి వందనం డబ్బులు పడ్డాయా లేదా అని ప్రతి ఒక్కరిని ఆమె అడిగి తెలుసుకున్నారు, రైతు భరోసా, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు సౌకర్యం వంటి వాటిపై ఆరా తీసిన ఆమె ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని తమ స్థాయిలో పరిష్కారం అయ్యే సమస్యలను ఇక్కడికి ఇక్కడే పరిష్కారం చేస్తామని అంతకుమించిన సమస్యలు ఏమైనా ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె ప్రజలకు హామీ ఇచ్చారు. చెడు మూడు గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన ఆమె ప్రజల నుంచి వినతులను స్వీకరించి పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచనలు జారీ చేశారు. అక్కడినుంచి నేరుగా ముకు నూరు గ్రామానికి చేరుకొని ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, మౌలిక వసతులు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తున్నట్టు ప్రకటించారు. ఎమ్మెల్యే తో పాటు నియోజకవర్గ పరిశీలకులు కోట్ని బాలాజీ, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు వల్లభనేని చందు, చింతూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎం.డి. జమాల్ ఖాన్, కార్యదర్శి వెంకటేశ్వరరావు,మాజీ మండల అధ్యక్షులు జహంగీర్, నరసింహారావు, రాంబాబు,రియాజ్, జానీ, శ్రీరామ్,పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొదటి విడతలోనే బీవీసీ ఐటీఎస్‌లో 100 శాతం సీట్ల భర్తీ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు10,ప్రభాతవార్త**. ఏపీ ఈఏపీసెట్--2026 మొదటి విడత సీట్ల కేటాయింపు ఫలితాలను అధికారులు సోమవారం రాత్రి విడుదల చేశారు. ఈ మొదటి విడత కౌన్సెలింగ్‌లోనే బట్లపాలెంలోని బీవీసీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బివిసి ఐటిఎస్)లో 100 శాతం సీట్లు భర్తీ కావడం విశేషం.గత కొన్నేళ్లుగా ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో బీవీసీ ఐటీఎస్ వరుసగా 100 శాతం అడ్మిషన్లు సాధిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల విశ్వాసాన్ని చూరగొంటోంది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బోనం కృష్ణ సతీష్ మాట్లాడుతూ, కళాశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు చూపిస్తున్న నమ్మకం, విశ్వాసం వల్లే ఈ ఘనత సాధ్యమవుతోందన్నారు. ప్రతి సంవత్సరం బీవీసీ ఐటీఎస్‌లో సీట్ల కోసం పెద్ద సంఖ్యలో విద్యార్థులు పోటీ పడుతున్నారని, పరిమిత సీట్లు ఉండటంతో కొంతమంది విద్యార్థులకు సీట్లు లభించక నిరాశ ఎదురవుతున్నప్పటికీ, కళాశాలపై ఉన్న విశ్వాసం మాత్రం మరింత పెరుగుతోందన్నారు. కళాశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్య, మెరుగైన ప్లేస్‌మెంట్ అవకాశాలు, ప్రాక్టికల్ ఓరియెంటెడ్ శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అందిస్తున్న ప్రాధాన్యత ఈ విజయానికి ప్రధాన కారణాలని ఆయన తెలిపారు. బీవీసీ ఐటీఎస్‌ను తమ విద్యాభవిష్యత్తుకు ఎంపిక చేసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల సెక్రటరీ శ్రీ బోనం కనకయ్య మొదటి విడతలో సీట్లు పొందిన విద్యార్థులకు అభినందనలు తెలియజేసి, వారి భవిష్యత్ విద్యాభ్యాసం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలక మండలి సభ్యులు బోనం విజయలక్ష్మి ,ప్రిన్సిపాల్ జె.వి. జి రామారావు, పరిపాలన అధికారి జె.వి. కృష్ణారావు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీతానగరంలో బంగారు వరలక్ష్మి కానుక




**సీతానగరం, ఆగస్టు 11, (ప్రభాతవార్త) :** స్థానిక జీవీకే ఫంక్షన్ హాల్‌లో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మొదటిరోజు సీతానగరం గ్రామ మహిళలకు నిర్వహించిన 'బంగారు వరలక్ష్మి కానుక సీజన్ 4' లక్కీడ్రా ఘనంగా జరిగింది. తొలుత కంబాల దంపతులు వరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ... మహిళా మూర్తుల్లో హైందవ చైతన్యం పెంపొందించడం, సనాతన ధర్మ విలువలను బలోపేతం చేయడం కోసం శ్రావణమాసంలో ప్రతి పేద మహిళ ఆనందంగా వరలక్ష్మి వ్రతాన్ని జరుపుకోవాలనే సంకల్పంతోనే 2023లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రతి ఒక్కరూ మన సంస్కృతీ సాంప్రదాయాలను పాటించాలని సూచించారు. రాజానగరం, రంపచోడవరం, జగ్గంపేట నియోజకవర్గాల్లో 4 వేలు బంగారు రూపులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన లక్కీడ్రాలో విజేతలుగా నిలిచిన 100 మంది మహిళలకు బంగారు రూపులు, పట్టుచీరలు, పసుపు, కుంకుమను ఉచితంగా అందజేశారు. అలాగే లక్కీడ్రాలో పాల్గొన్న 1,500 మంది మహిళలకు పట్టుచీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పెట్టే భోజనంలో మెనూ పాటించండి..ఫుడ్ కమీషన్ చైర్మన్



**మామిడికుదురు.ఆగస్టు11(ప్రభాతవార్త)** విద్యార్థులకు పెట్టే భోజనంలో విధిగా మెనూ పాటించాలని రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్,కమీషనర్ చిత్తా విజయప్రతాప్ రెడ్డి ఉద్యోగులకు సూచించారు.సోమవారం ఆయన కమీషన్ డైరెక్టర్ జక్కంపూడి కృష్ణకిరణ్ తో కలిసి మామిడికుదురు బాలుర,బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలుర హాస్టల్ వార్డెన్ కె.ప్రవీణ్ తో మాట్లాడుతూ మీ హాస్టల్ పై ఫిర్యాదులు వస్తున్నాయి ఇకనైనా పద్ధతి మార్చుకోండి లేదంటే సస్పెండ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనం రుచి చూశారు.ఆయన వెంట సోషల్ వెల్ఫేర్ డీడీ టి.వెంకటకృష్ణ,పాఠశాల హెచ్‌ఎం బి.చిరంజీవి పలువురు అధికారులు ఉన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps